ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 26 పేజీలు: 10+4 వెల: 6.50

'గోల్డ్ కార్డ్' వీసాతో ఎవరికి లాభం? 5

సూడాన్‌లో కుప్పకూలిన విమానం: 46 మంది మృతి



## 'కుంభ్'కు తెర

### 45 రోజులు సుదీర్ఘంగా సాగిన మేళా

### 65 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు: యుపి సర్కార్

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 26:** అంతర్జాతీయంగా అత్యంతప్రాధాన్యతను సంతరించుకుని దేశవిదేశీ భక్తులు లక్షలాదిగా తరలివచ్చిన మహాకుంభమేళా శివరాత్రి పర్వదినంతో ముగిసింది. 45 రోజులపాటుజరిగిన ఈ మహా ఆధ్యాత్మిక వేడుకకు ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వ పర్యాటక శాఖ, దేవాదాయ >>2



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం కీసరలోని శివలింగం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

6

శివనామ స్మరణతో మార్మోగిన కీసర గుట్ట

భక్తుల రద్దీతో తెలుగు రాష్ట్రాలలో కిటకిటలాడిన శివాలయాలు

వేములవాడ రాజన్నను దర్శించిన 3లక్షలమంది భక్తులు

## ఎస్సెల్బీసీ పాపం కెసిఆర్‌దే..



### అనుమానాస్పద మరణాలపై విచారణ కెటిఆర్ ఎందుకు కోరడం లేదు?

### ప్రధాని నుంచి ఆ ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడుగుతా..

### కులగణన బిల్లు పెట్టాకే ప్రధానితో చర్చిస్తా: ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి 26:** బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ అనుమానాస్పదంగా మృతి చెందితే.. కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడు అనుమానాస్పద మరణాలు చోటు చేసుకున్నాయని, కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న న్యాయవాది సంజీవ్‌రెడ్డి, కేసువేసిన లింగమూర్తి మరణాలపై కెటిఆర్ ఎందుకు జ్యూడిషియల్ విచారణ కోరడంలేదని సీఎం ప్రశ్నించారు. >>2

## మెట్రో ఫేజ్-2కు అనుమతివ్వండి

### ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కు నిధులు ఇవ్వండి

### రీజనల్ రింగ్ రైల్, డ్రైపోర్ట్‌లు, సెమీ కండక్టర్ మిషన్ మంజూరు చేయండి

### ప్రధాన మంత్రి నరేంద్రమోడీని కోరిన ముఖ్యమంత్రి రేవంత్

### ఎస్ఎల్‌బిసి ప్రమాద ఘటనను ప్రధానికి వివరించిన సిఎం



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24, 269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. గంటకుపైగా జరిగిన ఈ సమావేశం సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్ లోనూ రాష్ట్రానికి కేటాయింపులు లేవని తెలిపారు. రాష్ట్రంలోని వివిధప్రాజెక్టులకు నిధులుఇవ్వాలని పీఎంను ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూసేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన >>2



## పోసాని అరెస్టు

### గచ్చిబౌలిలో అదుపులోకి తీసుకొని ఎపికి తరలింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి26:** రాయదుర్గం మైహోమ్ భుజాలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. టాలీవుడ్ డైరెక్టర్, నటుడు పోసాని కృష్ణ మురళిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఇప్పటికే పోసానిపై ఆంధ్రప్రదేశ్‌లో పలు కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో పోసాని కృష్ణ మురళిని అరెస్టు చేసి ఆంధ్రప్రదేశ్‌కు తరలించారు. ఓబులవారిపల్లి పిఎస్‌లో పోసానిపై కేసు నమోదు, సెక్షన్ 196,353(2),111 రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు. కులాల పేరుతో దూషించడం, ప్రజల్లో వర్గ విభేదాలు సృష్టించారని పోసానిపై కేసు పెట్టారు. రాజంపేట అడిషనల్ మెజిస్ట్రేట్ ఎదుట.. పోసానిని పోలీసులు హాజరుపర్చనున్నారు. పోసాని అరెస్టుపై ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ఏపీ పోలీసుల తీరు బాగోలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

## ఆశలు ఆవిరేనా?

### ఐదు రోజులైనా కానరాని కార్మికుల జాడ

### సొరంగం చివరి భాగం చేరుకున్న ర్యాట్ హోల్ మైనర్స్

### 140 మీటర్ల మేర బురద, మట్టి, తుక్కు

### యోగక్షేమాలు తెలియక తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

### 2 రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం: మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



బుధవారం టన్నెల్ వద్ద మీడియాతో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపి మల్లు రవి

**హబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఐదు రోజులు గడుస్తున్నా కార్మికుల జాడ తెలియకపోవడం పరిస్థితి భయానకంగా మారింది. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్, హైడ్రా లాంటి 11సంస్థలు నిరంతరంగా శ్రమిస్తున్నా ఫలితం లేకపోవడంతో నిరాశే మిగులుతున్నది. టన్నల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) శకలాలు, బురదను తొలగించడం సవాలుగా మారింది. సొరంగంలో ఆక్సిజన్ లెవల్స్ తక్కువగా ఉండడంతో రెస్క్యూ బృందాలో పాటు లోకో ట్రైన్‌లో ఆక్సిజన్ సిలిండర్లను సైతం పంపించారు. ఆరోసారి రెస్క్యూ బృందం ఎస్ఎల్బీసీ సొరంగం చివరి వరకు వెళ్లగలిగారు. అక్కడ పెద్ద మొత్తంలో బురద మట్టి పేరుకుపోవడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. 13.50కి.మీటరు వరకు ర్యాట్ హోల్‌మైనర్స్ వెళ్లినా అక్కడ కార్మికులజాడ కానరకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. బురద, బండరాళ్లు, కంకర, యంత్రాల తుక్కు మధ్యలో కార్మికులు ఉండవచ్చుని అంచనాకు వచ్చినట్లు తెలుస్తున్నది. శిథిలాల కింద నలిగిపోయినట్టుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రమాద స్థలంలో 140మీటర్ల మేర శిథిలాలు పేరుకుపోయినట్లు రెస్క్యూ >>2

## పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నేడే

### 15 జిల్లాల్లో మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు

### కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ

### రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్‌లో బుధవారం ఎన్నికల సామాగ్రి పంపిణి కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

**కరీంనగర్,ప్రభాతవార్త:** మెదక్ నిజామాబాద్ కరీంనగర్‌ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఈనెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికలవిధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులకు సిబ్బందికి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్ పై రూట్ ఆఫీసర్లతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టం, సీలింగ్ పై మరోసారి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159 ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ >>2



## దంచి కొడుతున్న ఎండలు

### భద్రాచలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తున్నప్పటికీ.. ఉదయం 9 గంటల తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో గాలిలో తేమ తగ్గడంతో >>2

## దేశంలో పౌరులందరికీ సార్వత్రిక పింఛన్!

### కొత్త పెన్షన్ స్కీం అమలుకు కేంద్రం కసరత్తు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 26:** దేశంలోని అందరు పౌరులకోసం కేంద్రం కొత్తపింఛన్ పథకం ఒకటి తీసుకువస్తోంది. 60ఏళ్లుపైబడిన వారందరికీ సార్వత్రిక పింఛను అందించే ఉద్దేశ్యంతో సార్వత్రిక పింఛన్ పథకంపై కేంద్రం కసరత్తులు చేస్తోంది. ఎలాంటి సామాజికభద్రత పథకానికి నోచుకోని నిర్మాణరంగ కార్మికులు, గిగ్‌వర్కర్లు వంటి వారికి ప్రయోజనం కల్పించే ఉద్దేశ్యంతో ఆదిశగా అడుగులువేస్తున్నట్లు కార్మికశాఖ ఈదిశగా కార్యాచరణ ప్రారంభించింది. పదవీ విరమణ అనంతరం పింఛన్ అందించేందుకు ఉద్యోగులకు ఉద్యోగభవిష్యనిధి సంస్థ ఉంది. ఏదైనా కంపెనీలో వ్యక్తిపనిచేస్తే ఆతడి వేతనం నుంచి 12శాతంచొప్పున ఆతడి పిఎఫ్ ఖాతాకుజమ అవుతుంది. పనిచేస్తున్న సంస్థ సైతం అంతేమొత్తంలోజమచేస్తుంది. ఇక్కడ ప్రభుత్వం ఎలాంటిజమలుచేయడంలేదు. దీనితో పాటుసంఘటిత రంగంలో పనిచేసేవారికోసం అటల్‌పెన్షన్‌యోజన వీధివ్యాపారుల కోసం ప్రధానమంత్రి శ్రమ్‌యోగి మాన్‌ధన్‌యోజన, రైతులకోసం కిసాన్‌మాన్‌దన్ >>2





బుధవారం బయో ఆసియా సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

## లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్‌లో మరింత పురోగతి

### పదేళ్లలో ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు రెట్టింపు

### బయో ఆసియా ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం బయో ఏషియా-2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచఫార్మసీగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులు హబ్‌గా ఖ్యాతికెక్కిందని అన్నారు. ఈ నేపథ్యంలో 22వ ఎడిషన్ బయో ఆసియా-2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని అన్నారు. పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందని అన్నారు. 2014లో 15 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతికాగా, 2024లో ఇది 27.85 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. భారత్‌లోఫార్మా ఉత్పత్తులతోపాటు వివిధ రంగాల్లోనూ ఎగుమతులు పెరిగాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంపై కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో పెట్టుబబడులు >>2



మహాశివరాత్రి సందర్భంగా విద్యుద్దీపకాంతుల్లో కాశీవిశ్వనాథాలయం



ఎంపీలోని బాలాజీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్రపతి ముర్ము



కీసరలోని శివలింగం వద్ద గంగిరెద్దు



వేములవాడలో కోడెమొక్కులు చెల్లిస్తున్న భక్తులు

# అనుమతివ్వండి

>> ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత (కనెక్టవిటీ) సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని ప్రధానిని సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్టులను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డుతో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణకు ఆర్థికసాయం చేయాలని ప్రధానిని సీఎం కోరారు. పలు ప్రాజెక్టులకు కేంద్ర సాయాన్ని ముఖ్యమంత్రి కోరారు. విభజన చట్టంలోని పెండింగ్ సమస్యలను ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అపాయింట్‌మెంట్ సమాచారం రావడంతో ఆయన మంగళవారం రాత్రిదిల్లీ వెళ్లారు. గతఏడాదిజులైలో ప్రధానితో భేటీ అయిన రేవంత్‌రెడ్డి దాదాపు 6నెలల తర్వాత మళ్లీ సమావేశం అయ్యారు. ఇటీవల ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై మోదీ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు నేడే

>> ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారని తెలిపారు. అన్ని జిల్లాలలో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని వివరించారు. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు (గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో: కరీంనగర్ జిల్లాలో 71 వేల 545 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 4 వేల 305 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 103 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరుగుతుంది. 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు కాగా, 18 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్లో వారీగా పరిశీలిస్తే కరీంనగర్ రెవెన్యూ డివిజన్లో 69 గ్రాడ్యుయేట్, 12 టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. హుజురాబాద్ రెవెన్యూ డివిజన్లో 16 గ్రాడ్యుయేట్ 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 103 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 312 మంది పోలింగ్ ఆఫీసర్లు, 36 మంది రిజర్వు సిబ్బంది, మొత్తం 451 మంది పోలింగ్ విధుల్లో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపించి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

**వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 19 మంది పోటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 19 మంది పోటీలో ఉండగా, మొత్తం ఓటర్లు 24,905 మంది ఉన్నారు. అందులో పురుషులు 14,940 మంది, మహిళలు 9,965 మంది ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బహుముఖ పోటీ నెలకొనడంతో గెలుపు ఎవరిని వరిస్తుందో అని ఆసక్తికరంగా మారింది. పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ కూడా అమలులోకి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మూతపడ్డాయి.

# హెల్త్‌కేర్‌లో మరింత పురోగతి

>> పెడుతున్న కారణంగానే ఈ మార్పులు సాధ్యమవుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. సమీప భవిష్యత్తులోనే మూడో స్థానానికి ఎగబాకుందనే విశ్వాసం మాకుందని అన్నారు. ప్రధాన మంత్రి మోడీ దూరదృష్టి ఫలితంగా రక్షణ రంగంలో దిగుమతులు చేసుకునే పరిస్థితి నుంచి టాప్ 25 ఎగుమతుల దేశాల జాబితాలో చేరామని, 2014లో ఒక్క మొబైల్‌ఫోన్ కూడా ఎగుమతి చేయలేని పరిస్థితినుంచి ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్ల విలువైన మొబైల్‌ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామన్నారు. రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. 2030 నాటికి ఏకంగా 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని అన్నారు. 2047కల్లా భారత్ 18 వేల డాలర్ల తలసరి ఆదాయంతో 30 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ప్రధానమంత్రి విజన్, వేగంగా సమర్థవంతంగా పథకాల అమలు, యువశక్తి సామర్థ్యం, వివిధ రంగాల్లో నిపుణులు, పారిశ్రామికవేత్తలందరి కృషికారణంగానే ప్రగతి సాధిస్తున్నాం. 2014కు ముందు ఫియర్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి 2014 తర్వాత ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా దేశం పరివర్తనం చెందిందన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం అనేక రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణల కారణంగానే సాధ్యమైందన్నారు. జిఎస్‌టి అమలులో అన్ని రంగాల పరిశ్రమలు లబ్ధి పొందాయని, ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కారణంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి కూడా నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా భారత్‌లో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పలు అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో పేర్కొన్నాయన్నారు. హైదరాబాద్ నగరం బల్క్ డ్రగ్ క్యాపిటల్గ్, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా పురోగతి సాధించిందని, ఐటి ఎగుమతుల్లో లీడర్‌గా నిలిచిందన్నారు. 2024లో భాగ్యనగరంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా రూ.1.2 లక్షల కోట్ల ఐటి సేవలు ఎగుమతులు జరిగాయన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో అంతర్జాతీయంగా పరిశోధనలు, ఏఐ హెల్త్ కేర్, తయారీ రంగంలో ఎంతో వృద్ధి చెందుతూ వసుధైవ కుటుంబ భావనకు ప్రతిబింబంగా భారత్ నిలుస్తుందని అన్నారు. భారత్ ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోందన్నారు. 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి.

# 'కుంభ్'కు తెర

>> శాఖలు విస్తృత ఏర్పాట్లుచేసాయి. 45 రోజులపాటు జరిగిన ఈ భక్తివేడుకల్లో గంగాయమున సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమంలో 65 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలుచేసారనియూపీ సర్కారు ప్రకటించింది. ప్రపంచం నలుమూలలనుంచి ప్రయాగరాజ్‌కు రావడం విశేషం. గంగామాతకు ప్రత్యేకపూజలుచేసారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిదులు సినీప్రముఖులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు మొత్తం అందరూ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలుచేసారు. కుంభ మేళాతో 2.5 లక్షలకోట్ల ఆదాయవనరులు వస్తుందని యూపి ప్రభుత్వంగతంలోనే ప్రకటించింది. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. హర్‌హర్‌మహాదేవ్ మంత్రోచ్ఛారణలతో త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలు ఆచరించారు. తెల్లవారుజామున 2గంటలకే మహాశివరాత్రిరోజున 12 లక్షలమందికిపైగా పుణ్యస్నానాలుచేసారు. ఒక్కరోజే 90 లక్షలమందివరకూ వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మహాకుంభ మేళా ముగింపురోజున భారత వైమానిక దళం మహాకుంభమేళా ప్రాంతంలో అద్భుత వైమానిక ప్రదర్శనను నిర్వహించింది. మాఘపౌర్ణమి సందర్భంగా గతనెల 13న మహాకుంభ మేళాప్రారంభం అయింది. ఫిబ్రవరి 26న మహాశివరాత్రితో ఈ ఆధ్యాత్మికకార్యక్రమం ముగిసింది. ప్రయాగరాజ్‌తోపాటు బాలరాముని ఆలయంనిర్మించిన అయోధ్య, యూపిలోని హరహరమహాదేవుని దివ్యరూపం ఉన్న వారణాసి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. హనుమాన్ గర్హిని కూడా సందర్శించి హనుమంతుడికి భక్తకోటి ప్రత్యేక పూజలుచేసారు. చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని భావించిన యూపి పసర్కారు ప్రత్యేక ఏర్పాట్లుచేసింద. ఇ మహాకుంభ్‌నగర్ మొత్తం నోవెహికల్‌జోన్‌గా ప్రకటించింది. కుంభమేళాలో పౌష్‌పూర్ణిమ జనవరి 13, మకర సంక్రాంతి జనవరి 14, మౌని అమావాస్య జనవరి 29, వసంతపంచమి ఫిబ్రవరి 3, మాఘపూర్ణిమ ఈనెల 12, మహాశివరాత్రి ఈనెల 26వ తేదీలను ముఖ్యమైన పవిత్ర తేదీలుగాభావించారు. శివరాత్రికి ముందురోజు 1.33కోట్లమంది పుణ్యస్నానాలుచేసారని యోగిప్రభుత్వం ప్రకటించింది. అలాగే కుంభ మేళా ముగియడంతో భక్తులు తమ గమ్య స్థానాలకువెళ్లేందుకు గాను ప్రయాగరాజ్‌నుంచి దేశవ్యాప్తంగా 350కిపైగా రైళ్లను నడుపుతున్నట్లు రైల్వేశాఖప్రకటించింది.

## వారం - వర్జ్యం

**తేది : 27-02-2025, గురువారం**
**శ్రీ క్రోధి నామ సంవత్సరం,**
**పుష్యమాసం, ఉత్తరాయణం,**
**హేమంత ఋతువు, కృష్ణపక్షం,**
చతుర్దశి ఉ.8.55
ధనిష్ఠ మ.3.43
వర్జ్యం రా.10.18-11.46
దు.ఉ.10.31-11.18,
2) మ.3.13-4.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** మంచితనంతో అందర్నీ ఆకట్టుకొని ముందుకు సాగుతారు. వస్తు, వస్త్రాలాభాలు పొందుతారు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. దైవదర్శనాలు చేసుకొంటారు.

**మిథునం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఖర్చులు పెరిగి చికాకులు పెడతాయి. జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** కుటుంబంలో తగాదాలు ఏర్పడిన పరిష్కరించు కొంటారు. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం.

**సింహం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణబాధలు ఎక్కువై అయిన నిదానంగా తీరుస్తారు.

**కన్య :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి సలహాలతో ముందుకు సాగుతారు. తీర్థయాత్రలు చేస్తారు.

**ధనుస్సు:** ఆర్థిక వ్యవహారాలు లాభసాటిగా సాగుతాయి. రుణాలు తీరి ఊరట చెందుతారు.

**మకరం:** కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తుంది.

**మీనం:** మిత్రులతో ఏర్పడిన విరోధాలు తీరి ఊరట చెందుతారు. వస్తు సేకరణ.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎస్సెల్బీసీ పాపం కెసిఆర్‌దే..

>> బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీని రేవంత్‌రెడ్డి కలిసిన అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కేదార్ ర్యాడిసన్‌బ్లూ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడని, కేదార్ మృతదేహం ఇండియాకు రానుందన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యే దుబాయ్‌లోనే ఉన్నారని.. అతను ఎవరు అని సిఎం ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్‌లో 11 సంస్థలు పని చేస్తున్నాయని సీఎం చెప్పారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎస్ఎల్‌బీసీని వందశాతతం పూర్తి చేసి తీరుతామన్నారు. కమీషన్లు రావనే ఉద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ పనులను కేసీఆర్ పక్కన పెట్టేశారని సీఎం ఆరోపించారు. పదేళ్ల నుంచి ఎలాంటి పనులు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, కాంగ్రెస్ హయాంలో 30 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయిందని, మధ్యలో ఏ పనులు చేయకపోవడం వల్లే మెషీన్ బేరింగ్స్ పాడయ్యాయని, అన్నీ తుప్పు పట్టిపోయి ఉండటం వలనే ఈ ఘోరం జరిగిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని ఉద్ఘాటించారు. ప్రాజెక్టు పెరిగిన అంచనాలతో కలిపి రూ. 5,000 కోట్లలోపే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ఇది పూర్తయితే మూడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయని సీఎం వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కెసిఆర్ కమిషన్ల కోసమే నిర్మించారని, ఆ ప్రాజెక్టులో పని లేకుండానే ఈ ఏడాది 1.56 కోట్ల మెట్రిక్ టన్నుల దిగుబడి రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. కాళేశ్వరం నిపుణుల కమిటీ నివేదికల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పందించిన సీఎం.. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో అర్థం కావడం లేదన్నారు. 2014 నుంచి 2024 వరకు ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడూ ఉందని గుర్తు చేశారు. గత పదేళ్లలో పక్క పార్టీల నుంచి వచ్చిన వాళ్లను మంత్రులను చేస్తే ఉప ఎన్నికలు రాలేదని, ఇప్పుడు ఎలా ఎన్నికలు వస్తాయన్నారు. లెజిస్లేచర్ పార్టీ విలీనం అనేది లేదని, పార్టీనే సుప్రీం అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో లేని వారు మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ సెటైర్లు వేశారు. అధ్యక్షుడు ఎవరైనా బీజేపీతోనే తమకు పోటీ అని రేవంత్ పేర్కొన్నారు. బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు. ఫోన్ టాపింగ్ అంశంలో విదేశాలలో ఉన్న వారిని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. విదేశాల్లో ఉన్న వాళ్లను ఎవరు తీసుకొస్తారో తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మెట్రోను కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకురాకుండా అడ్డుకున్నదే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డే అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను ప్రధానికి ఇచ్చిన ఐదు విజ్ఞప్తులను సాధించుకొని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ మీద ఉందన్నారు. తన వంతుగా చేయాల్సింది తాను చేశానని అవన్నీ తీసుకొచ్చి క్రెడిట్ వాళ్ల సొంతం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇది చేస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడిగి సన్మానం కూడా చేస్తానని సీఎం ప్రకటించారు. కెసిఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్ట్నర్, కెసిఆర్ కోసమే కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. మెట్రో విస్తరణలో నాకు పేరు వస్తుందని కెసిఆర్ హయాంలో ఇది జరగలేదు కాబట్టి నా హయాంలో జరగవద్దు అని కిషన్‌రెడ్డి భావిస్తున్నారు. అందుకే కిషన్‌రెడ్డి మెట్రో విస్తరణ ప్రాజెక్టును కేబినెట్‌లో అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదు ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రం తరఫున విడుదల చేయాల్సిన నిధులకు సంబంధించిన రిప్రెజెంటేషన్ ప్రధాని నాకు ఇచ్చారని చెప్పారు. కేంద్రానికి రాష్ట్రం నుంచి పన్నులు ఎంత కడుతున్నామో అంతే స్థాయిలో రాష్ట్రాలకు వాటా రావాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు మెట్రో తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ, నాటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి అని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు హైకోర్టు మానిటరింగ్ చేస్తోందన్నారు. సీబీఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని బీజేపీ ఆలోచిస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలు చేసిన అవినీతిపై సిబిఐ విచారణ చేస్తే ఆ వంకతో బిజెపిలో కలిసిపోవచ్చు అనుకుంటున్నారని దుయ్యబట్టారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని కేంద్ర మంత్రులను ప్రశ్నించారు. రాత్రికి రాత్రి తాము ఎవరినీ అరెస్ట్ చేయబోమని.. అది తమ విధానం కూడా కాదన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ విచారణ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించామన్న సీఎం రేవంత్.. తాము చేస్తున్న పనులకు ప్రచారం కల్పించుకోవడం లేదన్నారు. ఇక తన కేబినెట్‌లోని మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందని, వారందరూ అనుభవజ్ఞులేనని పేర్కొన్నారు. వారి వారి శాఖలో సమర్థవంతంగా పని చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోందన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు వస్తే తాము విచారణ చేపడతామని తెలిపారు. ప్రధానమంత్రితో కులగణనపై చర్చ జరగలేదని, అసెంబ్లీలో బిల్ చేశాక చర్చిద్దాం అనుకుంటున్నామని తెలిపారు. నదుల పునరుద్ధరణ చేయడం మంచి ఆలోచన అని ప్రధాని పేర్కొన్నారని తెలిపారు. హైదరాబాద్‌కు మెట్రో తెచ్చింది జైపాల్‌రెడ్డి అని, హైదరాబాద్ మెట్రోలో జైపాల్‌రెడ్డి పాత్ర చాలా కీలకమన్నారు. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ మెట్రో సెకండ్ ప్లేస్‌లో ఉండేదని, ఇప్పుడు 9వ స్థానంలోకి పడిపోయిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బెస్ట్ ఎఫెర్ట్స్ పెట్టాము, గెలుస్తామని అనుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి గెలిపించడానికి బిఆర్ఎస్ అభ్యర్థులను పోటీకి పెట్టలేదని, రాష్ట్రంలో బిఆర్ఎస్ లేదన్నారు. మంత్రివర్గ విస్తరణ ఉందని నేను ఎప్పుడూ చెప్పలేదన్నారు. పిసిసి కమిటీ అంశం అధ్యక్షుని అడగండి, శివరాత్రి పూజలు ఉన్నందునే భట్టి విక్రమార్క ఢిల్లీకి లేదన్నారు. ప్రభాకర్‌రావును రప్పించాలని కేంద్రానికి లేఖ రాశాను. గత ప్రభుత్వం అవినీతిపై కమిషన్లు వేశాము. కమిషన్ల నివేదిక వచ్చాకే ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కొడంగల్ అసెంబ్లీ వ్యవహారాలు నా బ్రదర్ చూసుకుంటాడు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నా బ్రదర్‌ను పెట్టాం అని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. రియల్ ఎస్టేట్ గతంలో కంటే మెరుగ్గానే ఉందని, 7,8ఏళ్లకు ఒకసారికరెక్షన్ జరుగుతూ ఉంటుందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఈసారి ఆక్యుపేషన్ బాగా పెరిగిందని అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలోనే పర్ఫామెన్స్ బెటర్‌గా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో త్రివేణి సంగమం రద్దీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తున్న ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్

# దేశంలో పౌరులందరికీ సార్వత్రిక పింఛన్!

>> యోజన వంటి పథకాలున్నాయి. వీటికి కొంతమొత్తం పౌరులు చెల్లిస్తుండగా ఇంకొంతమొత్తం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈక్రమంలో పౌరులందరికీ ఒకే తరహా పింఛన్ తేవాలని కేంద్రం భావిస్తోంది. పొదుపు, పింఛన్ పథకాలను హేతుబద్ధీకరించి కొత్తపథకానికి శ్రీకారంచుట్టే అవకాశం ఉంది. స్వచ్ఛంద ప్రాతిపదికన ఏ పౌరుడు అయినా వీటిని ఎంచుకోవచ్చని అదికారవర్గాలు చెపుతున్నాయి. ప్రస్తుతానికి కొత్త పింఛన్‌స్కీంగా పిలుస్తున్న ఈకొత్తపథకం స్వచ్ఛంద పింఛన్‌పథకం అయిన జాతీయ పింఛన్ పథకాన్ని భర్తీచేయడం కాని విలీనం కాని చేయదని కార్మిక అధికారులు చెపుతున్నారు. ఉద్యోగం చేస్తున్నవారినుంచి ఉద్యోగంలో లేనివారుకూడా ఈస్కీంలో చేరవచ్చు. స్వయం ఉపాధిలో ఉన్నవారు కూడా దీంట్లోచేరే అవకాశం ఉంది. ఈపథకానికి సంబంధించి విధివిధానాలపై కసరత్తుప్రారంభం అయింది. త్వరలోనే ప్రజాభిప్రాయసేకరణ ఉంటుందనికార్మికశాఖ ఉన్నతాధికారులు చెపుతున్నారు. కాగా నేషనల్ పెన్షన్‌స్కీంయధాతథంగా కొనసాగుతుందని కూడా భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం అసంఘటిత రంగానికి అనేక పింఛన్‌పథకాలునిర్వహిస్తోంది. వాటిలో పెట్టుబడిదారుడికి 60 ఏళ్లునిండిన తర్వాత నెలకు 1000 నుంచి 1500 రాబడిని అందించే అటల్‌పెన్షన్‌యోజన వీధివ్యాపారులు, ఇంటిపనికార్మికులకు ప్రయోజనం ఇచ్చే శ్రమయోగి మాంధన్‌యోజన వంటివిఉన్నాయి.

# ఆశలు ఆవిరేనా?

>> బృందాలు చెబుతున్నాయి. నేడు ఏడో ప్రయత్నంగా వెళ్లి బండరాళ్లు, తుక్కు తొలగించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్ల బృందాలతోనే తవ్వకాలు జరపుతున్నారు. ర్యాట్ హోల్ మైనర్స్ 14మంది టీం ఇన్‌చార్జి ఫెరోజ్ మాట్లాడుతూ ఆపరేషన్ అతి క్లిష్టంగా ఉందని వెల్లడించారు. ఎస్ఆర్ఎస్‌ఏ నిపుణులు, మరో జీఎస్ఐ బృందం రంగంలో దిగనున్నట్లు మంత్రులు చెప్పారు. సొరంగం కూలిన ఘటనపై ఎన్డీఎస్‌ఏ దక్షిణాది విభాగం నివేదిక కోరింది. ఇదిలా ఉండగా సొరంగం ప్రమాదం జరిగి ఐదు రోజులు గడిచినా అధికారులు ఏమీ చెప్పక, ఎలా ఉన్నారో.. తెలియక తమవారి క్షేమ సమాచారం కోసం కుటుంబసభ్యుల తల్లడితున్నారు. బురద మొత్తం ఒక్కసారిగా తీసే ప్రయత్నం చేసినా తిరిగి ఒక్కసారిగా కూలే ప్రమాదం ఉంటుందని అందుకే అలాంటి చర్యలకు పూనుకోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. గురువారం ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**సహాయక చర్యలు వేగవంతం**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం ప్రమాదవశాత్తు చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు రెస్క్యూ బృందం పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట లోని ఎస్ఎల్‌బిసి క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రులు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డితో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలను రక్షించేందుకు భారతదేశంలోని టన్నెల్ నిష్ణాతులందరినీ రప్పించడం జరిగిందన్నారు. వారి సేవలను వినియోగించుకొని సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. దేశంలో ఉన్నఅత్యధిక సదుపాయాలు ఉపయోగించుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలపై ఆశలు వదులుకోలేదని ప్రాణాలతో బయటకు తీసుకురావాలని ఆశతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## హైదరాబాద్‌కు చేరుకున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటనను ముగించుకొని సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లి నుంచి నేరుగా ప్రయాగ్ రాజ్‌కు వెళ్తారన్న ప్రచారం సాగింది. ప్రయాగ్ రాజ్ వెళ్లకుండానే హైదరాబాద్‌కు బయలుదేరివెళ్లారు. ప్రధానితో భేటీ అనంతరం సాయంత్రం రాష్ట్రానికి తిరుగు పయనం అయ్యారు.

## ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** ఆ మహదేవుడి అనుగ్రహం అందరిపై ఉండాలని ప్రార్థిస్తూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. ఎస్ఎల్‌బిసి సొరంగం కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే ఎన్నికల ప్రచారంలో మునిగి తేలారని, మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టారని ఎక్స్ వేదికగా విమర్శించారు. సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు ముందుకు .. వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉందని పేర్కొన్నారు. అక్కడ ఆక్సిజన్ లేదు..కన్వేయర్ బెల్టు తెగిపోయింది..96 గంటలు దాటినా ఒక్కడుగూ ముందుకు పడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం పర్రెల మీద శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారుకూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్ఎల్‌బిసి విషయంలో మాత్రం నోరెత్తడం లేదని మండిపడ్డారు. హస్తిన యాత్రలు మాని ఆ కార్మికుల గోడు వినాలని, ఆ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. అక్కడ చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదు .. ఈ జాతి సంపద అంటూ ట్వీట్ చేశారు.

# దంచి కొడుతున్న ఎండలు

>> ఉక్కపోత వాతావరణం నెలకొంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం భద్రాచలం జిల్లా భద్రాచలంలో అత్యధికంగా 38.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే విధంగా మంచిర్యాల జిల్లా ఖాసీపేటలో, ములుగు జిల్లా గోవిందరావుపేట, నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 38.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో ఎలాంటి హీట్ వేవ్స్ వచ్చే అవకాశం లేదని, ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 33 నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర,తూర్పు జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయని, ఉదయం సమయంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందన్నారు. మార్చి 2 నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమవుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## నేటి నుంచి కాళేశ్వరం విచారణ షురూ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** కాళేశ్వరం వైఫల్యంపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకిని చంద్రఘోష్ గురువారం నుంచి విచారణ మళ్లీ ప్రారంభించనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి విజిలెన్స్, కాగ్ నివేదికలతోపాటు, ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చే వాటితోపాటు తాను ఇప్పటివరకు చేసిన అంశాలను జోడించి సమగ్ర నివేదికను జస్టిస్ పిసిఘోష్ అందించే అవకాశం ఉంది. పిసిఘోష్ కమిషన్ ఇప్పటివరకు మాజీ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయం అధికారిగా పనిచేసిన స్మితాసబర్వాల్‌తోపాటు అనేకమంది ఐఎఎస్ అధికారులను ఇతర ఇంజినీరు అధికారులను 120 మంది వరకు విచారణ చేసింది. అంతేకాదు నిర్మాణ సంస్థలను కూడా విచారణ చేశారు. మొత్తం 436 పేజీలతో నివేదికను రాసినట్లు తెలిసింది. విచారణ దాదాపు తుదిశలో ఉంది. రిటైర్డు సిఇ నరేందర్‌రెడ్డి, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండి హరిరామ్ విచారణకు హాజరుకావాలని ఆదేశాలు పిసిఘోష్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అఫిడవిట్ల ఆధారంగా బహిరంగ విచారణ చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులను స్వచ్ఛంద సంస్థలను విచారణ చేశారు.



## గచ్చిబౌలి స్టేడియాన్ని సందర్శించిన ఫీఫా బృందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఆల్ ఇండియా ఫుడ్‌బాల్ ఫెడరేషన్ బృందం బుధవారం గచ్చిబౌలీలోని స్టేడియాన్ని సందర్శించింది. 2047 నాటికి ప్రంచ స్థాయి ఫుట్‌బాల్ స్టేడియంగా దీన్ని తీర్చిదిద్దే అవకాశాలపై ఈ బృందం చర్చించింది. తెలంగాణలో క్రీడల పట్ల పెరుగుతున్న నిబద్ధతకు అనుగుణంగా ఈ స్టేడియాన్ని తీర్చిదిద్దేందుకు తగిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు ముందుగా స్టేడియంలో ఉన్న మౌలిక సదుపాయలను, వసతి, శిక్షణ మైదానాలను నిశితంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసింది. స్టేడియాన్ని సందర్శించే ముందు ఈ బృందం ప్రభుత్వ కార్యదర్శి దర్శి జయేష్ రంజన్‌తో సమావేశమైంది. ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణ తదివతర అంశాలపై బృందం సభ్యులు ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. దేశంలోఈ క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని చూపిస్తున్న భువనేశ్వర్ తర్వాత హైదరాబాద్ రెండవ స్థానంలో ఉందని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్టేడియాన్ని సందర్శించిన వారిలో బృందం సభ్యులు గెడ్ రోడీ, అనిల్‌కుమార్, సోని బాలా దేవి తదితరులు ఉన్నారు.

## బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు బిజెపికి లేదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఇస్లాం మతం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు పర్తింపజేయడానికి వీలులేదని బిజెపి నాయకులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిన్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఒకవైపు మేము కులగణనకు వ్యతిరేకం కాదని బండి సంజరు చెబుతున్నారు. మరోవైపు పార్లమెంట్‌లో మాత్రం కులగణనను బిజెపి వ్యతిరేకిస్తుందని ఆయన ఆరోపించారు. కుల గణనను వ్యతిరేకించడంతో బిసిలకు సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం అమలు జరగదన్నారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడిన బిజెపి, బిసిల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

దేశ వ్యాపితంగా బిసిల హక్కులను కాలరాయడంతో పాటు, ఇక్కడ బిసిలతో పేరుతో ముస్లిం, మైనారిటీల హక్కులను కాలరాసే వైఖరి అవలంభిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతి అంశాన్ని మతం ఆధారంగానే మాట్లాడుతూ, మతోన్మాదాన్ని, మత ఘర్షణలను సృష్టించడమనేది బిజెపికి రాజకీయంగా వెన్నతో పెట్టిన విద్య అని, కులాల వృత్తులు దెబ్బతిన్నటువంటి నేపథ్యంలో రిజర్వేషన్లు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బిసిల రిజర్వేషన్లు జనాభాకనుగుణంగా కావాలని అదనంగా అడగడంలో తప్పులేదు. కానీ ఇస్లాం మతం స్వీకరించారనే పేరుతో బీసీలో చేర్చకూడదనడం సరైందికాదన్నారు. ఒకవేళ మతం ఆధారంగానే రిజర్వేషన్లు అయితే, ఆ మతాలు స్వీకరించిన ఎవరికీ కూడా ఈ రిజర్వేషన్లు అమలు జరిగేటటువంటి అవకాశం ఉండదు. ఇది రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమన్నారు.

# సొరంగాల భద్రతపై సందేహాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ ఎడమగట్టు కెనాల్ ప్రమాదంలో ఎనిమిది మంది గల్లంతు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా నీటి పారుదలశాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న సొరంగాల భద్రతపై సందేహాలు ఆవరించాయి. గోదావరి,కృష్ణానదుల కంటే ఎత్తైన ప్రదేశంలో తెలంగాణ ప్రాంతం ఉండటంతో సాగు,తాగు అవసరాలు తీర్చుకోవడానికి ఎత్తిపోతల పథకాలు అనివార్యమైనాయి. గ్రావిటీతో నీటిని తరలించడానికి తప్పనిసరిగా సొరంగ మార్గాలు నిర్మించాల్సి వస్తున్నది. తెలంగాణలో కృష్ణ,గోదావరి నదిని ఆవరించి అభయారణ్యాలు ఉండటంతో పర్యావరణ అనుమతులు లభించడం కష్టతరమవడంతో ప్రత్యామ్నాయంగా అతి కష్టమైన సొరంగమార్గాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఎస్ఎల్‌బిసి సొరంగమార్గంలో షీర్ జోన్ రావడంతో తలెత్తిన ప్రమాదం తెలంగాణను ఒక్కసారి ఉలిక్కిపడేలా చేసింది. కామారెడ్డి నుంచి మొదలుకొని ఖమ్మం వరకు తెలంగాణలోని వివిధ జిల్లాలో నీటిపారుదల మౌళిక వసతుల కల్పనకే కోసం సొరంగాలను నిర్మించే పనిలో ఉన్న కార్మికులు,సాంకేతిక సిబ్బంది వారి కుటుంబాలు అనిశ్చితికి గురవుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి జలాలను పాలేరు నియోజకవర్గానికి తిరుమలాయపాలెం మండలం నుంచి కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌కు తీసుకొచ్చేందుకు చేపట్టిన పనుల్లో ఎనిమిది కి.మి పొడవుతో సొరంగ మార్గం నిర్మించాల్సి ఉంది. దమ్మాయిగూడెం వద్దక కేంద్రంలో,బీరోలు వద్ద రెండో కేంద్రంతో పాటు కూసుమంచి మండలంలోని పోచారం వద్ద నాలుగో కేంద్రం ఏర్పాటు చేసి మొత్తం నాలుగు ప్రాంతాల నుంచిసొరంగ మార్గం తవ్విస్తున్నారు. ఎనిమిది కి.మి సొరంగ మార్గం పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 3.20కిమి దూరం టన్నెల్ పనులు పూర్తయ్యాయని నీటిపారుదలశాఖ అధికారులు అం టున్నారు. ప్రా ణాలను పణం గా పెట్టి ఈ నాలుగు సొరంగ ప్రాంతాలలో రోజుకు విడుతలవారిగా సుమారు నాలుగు వందల మంది కార్మికులు సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. కార్మికులు,సాంకేతిక సిబ్బందికి అనేక ఇబ్బందులు పడుతూ ఉంటారు. తరుచూ డయోరియా వంటి సమస్యలతో పాటు శ్వాసకోశ వ్యాధులు వారికి తలెత్తుతూ ఉంటాయి. సొరంగమార్గం నిర్మించే కార్మికులకు కృత్రిమ గాలి అందిస్తున్నా అది ప్రకృతి సహజంగా లభించే గాలి వలే అపరిమితంగా ఉండదు. ఏదీ ఏమైనా సొరంగ నిర్మాణ రంగ కార్మికుల భవితవ్యంపై ఆయా కుటుంబాలు ఇప్పుడు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా కామారెడ్డి,మెదక్ జిల్లాలకు సాగునీటిని తరలించేందుకు జలయజ్ఞంలో సొరంగమార్గం ప్రతిపాదించారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు అటుకెక్కించడంతో కాళేశ్వరం నీటిని అందించాలని ప్రతిపాదించి అదే సొరంగ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. కాళేశ్వరం ప్యాకేజీ-22లో భాగంగా 5.6 కి.మి మేరకు సొరంగం నిర్మించాల్సి ఉండగా భూసేకరణ ఇతరత్రా సమస్యకారణంగా 1.48 మేరు సొరంగం తవ్వినారు. కొండెం చెరువు వద్ద భూసేకరణ జరిగితే తప్పకం పనులు కొలిక్కి వస్తాయని అధికారులు అంటున్నారు. గత ఏడాది నుంచి నిధుల లేమితో ప్యాకేజీ 22 సొరంగంలో పనులు చేపట్టడంలేదు దీనితో తవ్వినంత మేరకైనా సొరంగం నిర్వహణ సరిగా చేపట్టడంలేదు దీనితోఅక్కడ అస్తవ్యస్తంగా మారింది .కామారెడ్డి,మెదక్ జిల్లా సరిహద్దుల్లో గట్టినేలలు ఉండటంతో సొరంగానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అభిప్రాపడుతూనే ఎస్ఎల్‌బిసి టన్నెల్ విషాదంతో అందరిలోను భయాం దోళనలు మొదలయ్యాయి.

### వాటి నిర్మాణాల్లో పాల్గొనేవారి కుటుంబాల్లో ఆందోళన

### ఎస్ఎల్‌బిసి దుర్ఘటనతో సర్వత్రా విషాదం

## ఎల్ఆర్ఎస్ 25 శాతం డిస్కౌంట్‌తో 5 లక్షల మందికి ప్రయోజనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అనధికార లేఅవుట్లు, అందులోని ప్లాట్ల క్రమబద్ధీకరణ మరోసారి లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ప్రకటించింది. అంతే కాకుండా ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం 25 శాతం ప్రత్యేక డిస్కౌంట్ కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ యేడాది మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లిస్తే ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా కొత్తగా మరో 5 లక్షల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థలాల క్రమబద్ధీకరణకు తొలిసారిగా 2020లో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ సమయంలో 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో వచ్చిన అప్లికేషన్లలో ఇప్పటివరకు సుమారు 9 లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించగలిగారు. పెండింగ్ అప్లికేషన్లు ఒకేసారి పరిష్కరించేందుకు 25 శాతం స్పెషల్ డిస్కౌంట్ ఇస్తూ ఇటీవల రేవంత్ ప్రభుత్వం ఓటీఎస్‌ను ప్రకటించింది. ఇదే కాకుండా ఏదైనా లేఅవుట్‌లో 10 శాతం స్థలాలు మాత్రమే అమ్ముడుపోయి మిగతా 90 శాతం ఖాళీగా ఉన్న ప్లాట్లకు కూడా నిర్ధారిత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునే ఛాన్స్ కల్పించారు. దీనివల్ల దాదాపు 5 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి స్థలాలను కొన్నవారు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని చెప్పారు. ఇక ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లలో ప్రస్తుతం 16 లక్షల వరకు పెండింగ్ లోనే ఉన్నాయి. వీటి విస్తీర్ణం ఆధారంగా ఎంత ఫీజు చెల్లించాలన్నది ఆటోమేటెడ్‌గా నిర్ధారణ కానుంది. అందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది. ఈ మేరకు అప్లికేషన్ చేసుకున్న వ్యక్తి ఫోన్‌కు లింకును పంపుతారు. దాన్ని ఓపెన్ చేసి ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన వారి స్థలాన్ని అధికారులు తనిఖీ చేశారు. అన్నీ కరెక్టుగా ఉన్నాయనుకుంటే ప్రొసీడింగ్స్ ఇవ్వడంతో స్థల క్రమబద్ధీకరణ పూర్తవుతుంది.

ప్రభుత్వ భూముల సర్వే నంబర్లను, నీటి వనరులకు 200 మీటర్ల పరిధిలో ఉన్న భూముల సర్వే నంబర్లను అధికారుల ఇప్పటికే ఆన్‌లైన్ చేశారు. పెండింగ్ అప్లికేషన్లలో ఈ నంబర్లుంటే వాటిని పక్కన పెడతారు. ఇలాంటి స్థలాలు మొత్తం అప్లికేషన్లలో 5 శాతం వరకు ఉండవచ్చని అంచనా. ఇవిపోగా మిగతావన్నీ సవ్యంగా ఉంటే.. మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన అవసరం లేదని అధికారుల భావిస్తున్నారు. వచ్చే వారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## జల విద్యుత్ ఉత్పత్తిపై మార్చి18కి విచారణ వాయిదా

### ఆంధ్రప్రదేశ్ పిటిషన్‌పై సుప్రీం విచారణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** జల విద్యుత్తు ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ మార్చి 18కి వాయిదా పడింది. తెలంగాణలో సాగునీటి అవసరాలతో పాటు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం స్థాపిత సామర్థం మేరకు జల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జీవో 34ను జారీ చేయగా, దానికి ఆంధ్రప్రదేశ్ సర్కారు అభ్యంతరం తెలిపింది. పరిమితులు లేకుండా విద్యుత్తు ఉత్పత్తికి నీటిని మళ్లించ డం సరికాదని, ఆ జీవోను రద్దు చేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారణ జరిపింది.

ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినించారు. వాటిపై అభిప్రాయాలను తెలపాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి రెండు వారాల్లోగా వివరాలను సమర్పిస్తానని వైద్యనాథన్ పేర్కొనడంతో తదుపరి విచారణను మార్చి 18కి వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించింది.

## కుంభ్ విమానం ఆలస్యంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళన

**హైదరాబాద్ (శంషాబాద్) ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** హైదరాబాద్ నుండి వారణాసి వెళ్లాల్సి న విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. మహాశివరాత్రి సందర్భంగా కుంభమేళా చివరిరోజు కావడంతో వారణాసిలో ప్రయాగ్ రాజ్‌లో పుణ్యస్నానాలు చేయడానికి వెళ్లేందుకు పెద్దఎత్తున భక్తులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. స్పైస్ జెట్ విమానంలో వెళ్లాల్సి న వీరికి తీవ్ర అవరోధం ఎదురైంది. వారణాసి వెళ్లేందుకు బుధవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న భక్తులు బోర్డింగ్ పాసులు తీసుకొని ఎయిర్‌పోర్ట్ లోనికి వెళ్లినప్పటికీ వారికి విమాన సర్వీసు అందుబాటులో లేదు. వారణాసి వెళ్లాల్సి న స్పైస్ జట్టు సాంకేతిక కారణాలతో ఆలస్యంగా వెళ్లనున్నట్లు అనౌన్స్ చేశారు.

**బోర్డింగ్‌పాస్ తీసుకొని లోపలికి వెళ్లిన భక్తులు**

చివరి నిమిషంలో ఫ్లైట్ డిలే అంటూ ప్రకటన వెలువడడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ సిబ్బందితో ప్రయాణికులు వాగ్వా దానికి దిగారు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది వారికి మెసేజ్ చెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వారు వినిపించుకోలేదు.

వేల రూపాయలు ఖర్చుపెట్టి టికెట్లు కొనుగోలు చేసామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాగ్ రాజ్ లో పుణ్య స్నానాలు ఆచరించడం చివరి రోజు కావడంతో తమకు పుణ్యస్నానం చేసే భాగ్యం లభిస్తుందో లేదో అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్ పోర్టులో మమ్మల్ని పట్టించుకొనే నాదుడు లేదని, సంబంధిత ఎయిర్లైన్స్ అధికారులు వెంటనే చొరవ తీసుకొని తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటిహెచ్ ఆస్ట్రేలియా వర్సిటీ ప్రతినిధులు

## ఎస్ఐఎంఎంఇసిటిని ప్రారంభించిన ఐఐటి హైదరాబాద్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (స్విన్‌బర్న్), ఆస్ట్రేలియా ఎస్ఐఎంఎంఇసిటి 'స్విన్‌బర్న్ ఐఐటి హైదరాబాద్' తయారీ, మెటీరియల్స్, ఎనర్జ్, కమ్యూనికేషన్ టెక్నాలజీస్ జాయింట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' బుధవారం ఎస్ఐఎంఎంఇసిటిని ప్రారంభించాయి. ఈ మైలురాయి చొరవ ఐఐటి హైదరా బాద్, స్విన్‌బర్న్ మధ్య దీర్ఘకాలిక పరిశోధన సహకారాన్ని బలోపేతం చేస్తుం దని, గణనీయమైన పరిశ్రమ, సామాజిక ప్రభావంతో అత్యాధునిక పురోగతులను ప్రోత్స హిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న ఇరు సంస్థల అధికారులు పేర్కొ న్నారు. మూడు కీలక అంశాలలో పరిశోధన, సాంకేతిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి, ఒక వినూత్న వేదికగా ఉపయోగపడుతుందన్నారు. మెటీరియల్స్, తయారీ–ఉపరితల పూతలను మెరుగుపరచడం, మెటీరియల్ అభివృద్ధి, సంకలిత తయారీ, డిజిటల్ తయారీ సాంకేతికతలు. శక్తిపరివర్తన – భారీ పరిశ్రమలో డీకార్బనైజేషన్, కీలకమైన ఖనిజాల ప్రాసెసింగ్, ఇ వ్యర్థాల రీసైక్లింగ్‌ను పరిష్క రించడం, తదుపరి తరం కమ్యూనికేషన్, క్వాంటం టెక్నాలజీస్–6బి, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సా ర్లు, క్వాంటం సిద్ధాంతంలో మార్గదర్శక పరి శోధన సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

స్విన్‌బర్న్‌లో డిప్యూటీ వైస్‌ఛాన్సలర్ (పరిశోధన) ప్రొఫెసర్ కరెన్‌హాప్‌గుడ్ మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌తో తమ భాగస్వామ్యం ఇప్పటికే ఉమ్మడి పరిశోధన, పిహెచ్‌డి శిక్షణలో అద్భుతమైన ఫలితాలను అందించిందని, ఎస్ఐ ఎంఎంఇసిటి స్థాపన తమ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ స్థాయిలో సంచలనాత్మక పరిశోధన, ఆవిష్కరణల కోసం కొత్త అవకా శాలను సహసృష్టించడానికి తమకు వీలు కల్పిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ భాగ స్వామ్యం ఐఐటి హైదరాబాద్, స్విన్‌బర్న్ మధ్య దీర్ఘకాలిక సహకారం కోసం స్థిరమైన ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుంది, దృశ్యమానత, ఆవిష్కరణ అవుట్‌పుట్, పరిశ్రమ, సమాజానికి వాస్తవ ప్రపంచ సహకారాలను మెరుగుపరుస్తుందని అన్నారు.

## తెలంగాణకు 63 టిఎంసిల నీరు ఇవ్వాల్సిందే

### రాష్ట్ర నీటిపారుదల కార్యదర్శి రాహుల్‌బొజ్జా

### గైర్హాజరైన ఆంధ్రప్రదేశ్.. వాదనలు వినిపించిన తెలంగాణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ సాగు, తాగునీరు అవసరాలు తీర్చుకోవడానికి 63 టిఎంసిలు ఇవ్వాల్సిందే అని తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జ కోరారు. బుధవారం హైదరాబాద్ జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. శ్రీశైలం నాగార్జునసాగర్‌లో ఎంత నీరు లభ్యత ఉందో అనే అంశాన్ని తేల్చడానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీ వేశారు. ఆకమిటి నివేదిక ఆధారంగా చర్చలకోసం సమావేశం ఏర్పాటు చేయగా తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అధికారులు సమావేశంకు హాజరు కాలేదు. గురువారం మరోమారు సమావేశం కావాలని కెఆర్ఎంబి చైర్మన్ నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంపై రాహుల్ బొజ్జా స్పందించారు. సమావేశం ఏర్పాటు చేస్తే ఆంధ్రప్రదేశ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే హాజరుకాలేదని ఆరోపించారు. తన వాదనలను రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి మే వరకు తమకు 55 టీఎంసీల నీరు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా, తమకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

# మావోయిస్టులకు దృష్టి లోపంతోపాటు తీవ్రఅనారోగ్య సమస్యలు?

### పోలీసులకు పట్టుబడిన నక్సల్స్ డంప్‌లో పలు కిట్‌లు, ఔషధాలు లభ్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పోలీసుల వరుస ఆపరేషన్లతో ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవులకు పరిమితమైన మావోయిస్టుల్లో అనేక మంది కంటి చూపు సమస్యలతో పాటు దృష్టి లోపం, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. వీరిలో పార్టీ అగ్ర నాయకులు కూడా వున్నారని నిఘా వర్గాలకు అందిన సమాచారం వెల్లడిస్తోంది. ఛతీస్‌ఘడ్‌లోని పలుచోట్ల ఇటీ వల జరిగిన అనేక ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో నక్సలైట్లు మరణించడం తెలిసిందే. ఇదే సమయం లో పలుచోట్ల మావోయిస్టులకు సంబంధించిన డంప్‌లు పెద్ద ఎత్తున పోలీసులకు లభ్యమయ్యాయి. మావోయిస్టుల డంప్‌లు పోలీ సులకు లభ్యమ వడం కొత్తేమికాదు. ఈ డంప్‌లలో ఇప్పటి వరకు ఆయుధాలతో పాటు మావోయిస్టు సాహిత్యం, వంట సామాగ్రి వుంటాయి. కొన్నిసార్లు మావోయిస్టు ల అంతర్గత సమాచారం కూడా పోలీసులకు లభించిన ఉదంతాలున్నాయి. కానీ ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని రోజుల క్రితం పోలీసులకు లభించిన మావోయిస్టుల డంప్‌లో ఆ యుధాలతోపాటు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారు వాడే పలురకాల ఔషధాలు వున్నాయి. దీంతో పాటు కంటి సమస్యలతో బాధపడుతున్న వారు, దృష్టి లోపం వున్న వారు వాడే ఔషధాలు, వీటిని గుర్తించేందుకు వున్న కొన్ని రకాల అధునాతన ఉపకరణాలు డంప్‌లో పోలీసులకు లభించాయి. డంప్‌లో ఎ క్కువగా వున్న ఉపకరణాలు కంటి పరీక్షలు చేసే ఐఓఎల్ మాస్టర్ ఆప్టో మీటర్, లెన్స్ కిట్, స్లైర్ వున్నాయి. ఈ మూడు ఉపకరణాలు కంటి చూపు సమస్యతో ఇబ్బం ది పడే వారిలో దృష్టి లోపం ఏ స్థాయిలో వుందో...? గుర్తించేందుకు వాడతారని పోలీసు వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు పలు దశలకు సంబంధించిన కళ్ల జోళ్లు వున్నాయి. దట్టమైన అడవుల్లో అధునాతన ఆయుధాలు, డ్రోన్లతో ముందుకు దూసుకువస్తున్న పోలీసులతో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న నక్సలైట్లు పూర్తి స్థాయిలో పోరాడలేక పోతున్నారని నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలోనే తాముండే ప్రాంతంలోనే కంటి చూపు సమస్యను పరిష్కరించుకునేందుకు ఓవైపు ఉపకర ణాలను తెప్పించుకుని, దీంతోపాటు తమ దృష్టి లోపానికి సరిపడే కళ్ల జోళ్లను కూడా రప్పించుకున్నారని నిఘా వర్గాలు గుర్తించాయి. కంటి సమస్యలతో పాటు పలు రకాల అనారోగ్య సమస్యలకు అవసరమయ్యే ఔషధా లను కూడా నక్సలైట్ల డంప్‌లో లభ్యమయ్యాయి. కాగా దట్టమైన ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో ఈ ఔషధాలతోపాటు కంటి జబ్బులను గుర్తించే ఉపకరణాలను ఎవరు పంపారు? ఇవి అక్కడికి ఎలా వెళ్లాయి? ఎవరి ద్వారా చేరాయి? అనే అంశాలపై పోలీసులు విచారణ చేబట్టారు.

## డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఎనిమిది మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** నగర శివార్లలోని పెద్ద అంబర్‌పేట్ వద్ద 2021 ఫిబ్రవరి నెలలో కేంద్ర నార్కోటిక్ బ్యూరో (ఎన్‌సిబి అధికారులకు 681 కిలోల గంజాయితో పట్టుబడ్డ ఎనిమిది మంది డ్రగ్స్ స్మగ్లర్లకు ఎల్‌బి నగర్‌లోని రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పు చెప్పింది. ఎపిలోని సీలేరు నుంచి వీరు మూడు వాహనాలలో తెలంగాణ మీదు గా మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు గంజా యిని తరలిస్తుండగా పెద్ద అంబర్‌పేట్ వద్ద ఎన్‌సిబికి పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. పట్టుబడ్డ స్మగ్లర్లు ఎపితో పాటు మహారాష్ట్రకు చెందిన వారని ఎన్‌సిబి అధికారులు తెలిపారు.

## శిశువుల విక్రయముఠా వివరాల సేకరణకు గుజరాత్‌కు రాచకొండ పోలీసు బృందం


### పట్టుబడిన నేరగాళ్లను కస్టడీకి కోరనున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన శిశువుల విక్రయ అంతరాష్ట్ర ముఠాకు సంబంధించి పూర్తి సమాచారం రాబట్టేం దుకు రాచకొండ పోలీసులు గుజరాత్‌కు ప్రత్యేక బృందాన్ని పంపారని సమాచారం. మంగళవారం పట్టుబడ్డ ఈ అంతరాష్ట్ర ముఠాలో మొత్తం 11 మంది నేరగాళ్లు వుండడం తెలిసిందే. ఇదే సమయంలో రోజుల వయస్సు కలిగిన నలుగురు పసికందులను పోలీసులు కాపాడి వారిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. పోలీసులకు పట్టు బడ్డ శిశువుల్లో ఒక మగ శిశువు కాగా మిగతావి ఆడ శిశువులు. ఈ పసికందులు గుజరాత్ నుంచి వారం లేదా పది రోజుల క్రితం హైదరాబాద్‌కు తరలించినట్లు తేలి ంది. ఈ ముఠాలో హైదరాబాద్‌కు చెందిన కోలా కృష్ణవేణి కీలకంగా వుండగా ఈమెకు మరో ఐదుగురు సహకరించారు. ఇందులో గుజరాత్ నుంచి శిశువులను తెచ్చిన సావిత్రి దేవి ముఖ్యురాలు. వీరితో పాటు నాలుగు శిశువుల్లో అమ్మకాలు చేసిన మూడు శిశువులకు సంబంధించి పసికందులను కొన్న ఐదుగురిని అరెస్టు చేశారు. అమ్మ కానికి సిద్ధంగా వుంచిన మరో శిశువును చివరి నిమిషంలో పోలీసులు కాపాడి సంరక్షణ కేంద్రానికి తరలించారు. కాగా ఈ కేసులో గుజరాత్‌కు చెందిన వందన, సునిత సుమన్ అనే ఇద్దరు మహిళలు పరారీలో వుండగా వీరిని పట్టుకునేందుకు ఒక బృందం గుజరాత్‌కు వెళ్లిందని సమాచారం. వీరిని అరెస్టు చేస్తే శిశువుల విక్రయాలకు స ంబంధించి మరింత సమాచారం వెలుగుచూసే వీలుంది. దీంతో పాటు ఈ ముఠా ఎప్పటి నుంచి ఈ వ్యాపారంలో వుంది...? ఇప్పటి వరకు ఎంత మంది శిశువుల ను తల్లుల వద్ద నుంచి కొన్నారు...? ఎంత మందిని బెగ్గింగ్ మాఫియా ద్వారా సంపాదించారు...? వీరంతా ఏ ఏ ప్రాంతాలకు చెందిన వారు...? ఇలా కొన్న వారి ని ఏ ఏ రాష్ట్రాలలో ఎవరెవరికి అమ్మారు...? వారి వివరాలు ఏమిటీ...? ఈ ముఠాకు తెలుగు రాష్ట్రాలలో శిశు విక్రయాలు, కిడ్నాపులు జరిపే ముఠాలతో ఏమైనా సంబంధాలు వున్నాయా...? వుంటే ఈ సంబంధాలు ఎలాంటివి...? తెలుగు రాష్ట్రాలలో కనిపించకుండా పోయిన పసికందులను ఉత్తరాది రాష్ట్రాటలో ఏమైనా విక్ర యించారా...? వారి వివరాలు ఎవరి వద్ద వున్నాయి...? అనే వాటి గురించి పోలీసులు తెలుసుకునే వీలుంది. ఇప్పటికే పట్టుబడ్డ 11 మంది నుంచి దీనికి సంబంధిం చి పోలీసులు కొంతమేర సమాచారం సంపాదించారని తెలిసింది. వీరిని కస్టడీలోకి తీసుకుని మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్ని స్తున్నారు. నింది తులను కస్టడీలోకి కోరేందుకు పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కోర్టు అనుమతితో కనీసం వారం రోజుల పాటు అందరిని విచారించి శిశువుల విక్రయ వ్యవహారంలో మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## డొనాల్డ్‌ట్రంప్ చిత్రంతో 250 డాలర్ నోటు

### ప్రతినిధులసభ సభ్యుడు చట్టసభలో ప్రతిపాదన

**వాషింగ్టన్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటిన నుంచి మంచి జోరుమీద ఉన్నారు. ఏకంగా 250 డాలర్ల నోటును ఆయన బొమ్మతో ముద్రించాలని అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు జోవిల్సన్ ఒక చట్టాన్ని ప్రతిపాదించాలని యోచిస్తున్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. బైడెన్ పాలన సమయంలో పుట్టుకొచ్చిన ద్రవ్యోల్బణమే తాను ఈచర్య తీసుకోడానికి పురిగొల్పిందని ఆయన వివరణ ఇచ్చారు.



ప్రస్తుతం అమెరికన్లు భారీ మొత్తంలో నగదు తీసుకెళితేకానీ వారి అవసరాలు తీరని విధంగా ధరలు పెరిగిపోతున్నాయని అన్నారు. ట్రంప్‌ను అత్యంత విలువైన అధ్యక్షుడిగా అభివర్ణించారు. అందుకే ట్రంప్‌చిత్రంతో 250 డాలర్ల నోటును మునరదించాలని బ్యూరో ఆఫ్ ఎన్‌గ్రేవింగ్ అండ్‌ప్రింటింగ్‌కు సూచిస్తూ ఈచట్టం తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో ఈ ప్రతి పాదనకు విపరీతంగా ట్రోల్స్ వస్తున్నాయి. కొందరు సానుకూలంగాను మరికొందరు వ్యతిరేకంగాను పోస్టులు హోరెత్తిస్తున్నారు. అసలు 250 డాలర్‌నోటు వాడతామని అందుకోసమేనాట్రంప్‌ను మేం గెలిపించింది అంటూ కామెంట్లు వస్తున్నాయి. ట్రంప్ అమెరికా చట్టసభల్లో తన బలమైన పట్టునిరూపించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రధాన అజెండా అయిన కీలక బిల్లును నేడు 217-215 ఓట్లతో ఆమోదించారు. పన్ను చట్టంలో మార్పులు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ పాలసీ, కొత్త ఇంధనవనరుల అన్వేషణకు డ్రిల్లింగ్ జాతీయభద్రతపై భారీగాసొమ్మును వెచ్చించడం వంటి అంశాలున్నాయి.

వార్త

స్వల్ప విషయాలే మనల్ని చికాకుపరచి బాధపెట్టేవి. ఏనుగుని తప్పించుకోగలం గాని, దోమను ఏం చేయగలుగుతాం.

-హౌస్‌మాన్

# ఊబకాయంపై సమరాస్త్రం!


ఉన్నట్టుండి ఊబకాయంపై ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధం ప్రకటించారు. ఊబకాయం ఓ అవలక్షణం. ఒకసారి ఊబకాయం శరీరాన్ని ఆవహించాక అలా మనిషి మట్టిలో కలిసిపోవాల్సిందే తప్ప సన్నబడతారన్న గ్యారంటీ ఏమీలేదు. ప్రతి 'మన్ కిబాత్' కార్యక్రమానికి ఓ సామాజికాంశాన్నో, ఆరోగ్య జీవన విధానాన్నో, ఆయా ప్రాంతాల నైపుణ్యాలను ప్రస్తావించి వాటిని ప్రోత్సహించే విధానాలను 'స్పష్టంచేయడం ఆయన ప్రసంగాల ప్రధానఅంశాలుగా ఉంటాయి. మొన్నామధ్య ఆంధ్రప్రదేశ్‌లో అరకుకాఫీని తెలంగాణలో ఆదిలాబాద్ ఉపాధ్యాయుడొకరు గిరిజన మాండలిక భాషా పరిరక్షణకు కృత్రిమ మేధనుపయోగించిన తొడసం కైలాష్ గురించి ప్రస్తుతించారు. ఎన్నుకొన్న అంశాలన్నీ ప్రజల్లో ఆలో చింపచేసేవే. ఏ ఒక్కటీ కొట్టివేయదగినది కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్నా సమరోత్సాహంతో స్పందించి ఊబకాయంపై పోరాటానికి దేశంలో వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖుల్ని నామినేట్ చేయడం ప్రశంసించదగిన విషయం. ఈ అంశాలపై అవగాహన పెంచు కుని ఉద్యమాన్ని ముందుకు నడిపించాల్సింది ఆ ప్రముఖులే. మారథాన్ వాక్‌ల కన్నా ఓ సామాజిక విప్లవం తెచ్చేదిశగా కార్యచరణతో ప్రధాని మోడీ పిలుపును వాళ్లు స్వీకరించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022లో చేసిన సర్వేలో ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారని అంచనా. భారతదేశంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయంతో రోజువారీ కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బంది పడ్తున్నట్లు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా మోడీ నూనె వినియోగాన్ని 10శాతం తగ్గించాలని చెప్పచూసారు. ఊబకాయం తగ్గాలంటే నూనె వాడకం తగ్గిస్తే సరిపోదు. శారీరక వ్యాయామం, జీవన శైలి, ఆహార వ్యవహారాల్లో క్రమశిక్షణ ముఖ్యం. ఇవేమీ లేకుండా ఊబకాయంపై ఎవరూ పోరాటం చేయలేరు. రోజువారీ జీవన విధానంలో కూడా మార్పులు అవసరం. భారతీయ వంటకాల్లో మఖానా (తామరగింజలు) సూపర్ ఫుడ్ అని మోడీ చెప్తూనే ప్రతి ఒక్కరు అల్పాహారంలో భాగమయ్యేటట్లు చూసుకోవడం ఉత్తమమన్నారు. రైతుల శ్రేయస్సు కోసం బీహార్‌లో రూ.100 కోట్లతో మఖానా బోర్డు ఏర్పాటు జరిగాక మోడీ భాగల్‌పూర్ పర్యటనలో మఖానా మంచి పోషకాహారంగా భుజించాలని చెప్పడం, వాటి గురించి తెలియనివారికి మంచి సందేశం కాగలదు. మఖానా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచే బోర్డేకాకుండా మఖానా ఎలా పోషకాహారం కాగలదో వివరించి ప్రధాని మానవాళిలో పోషకత్వాన్ని పెంచుకునే ఆహార నియమాలను, ఆహార ఎంపికను అలవాటు చేసుకోవాల్సిన అవశ్యకతను గుర్తు చేశారు. ఇవన్నీ ఆరోగ్య భారతం కోసమే ఊబకాయంపై పోరాటం విషయానికొస్తే తొలిదశలో ప్రధాని పదిమందిని నామినేట్ చేయగా వారి లో ప్రతిఒక్కరూ మరో పదిమందిని నామినేట్ చేసుకుంటూపోతే పదికి పదిచొప్పున, వాళ్లూ మరో పదిమందిఇలా గొలుసుకట్టు ఉద్యమ ప్రచారానికి బాటలు వేసినట్లేనన్న భావన ఈ పిలుపు వెనుక కనపడుతోంది. చివరి దశలో ఊబకాయుల్లో అవగాహన కల్పనే సరైన మార్గం. ఊబకాయమంటే అదేదో వంశపారంపర్యమంటూ అతితేలికగా తీసిపారేసి ఆహార నియంత్రణ, శారీరక శ్రమ లేమి, అసంపూర్ణ ఆహారస్వీకరణ, మానసికఒత్తిడి, ఆందోళనల నిర్లక్ష్యంచేసి జీవనశైలిపట్ల నిర్లక్ష్యం వహించడంకూడా ఊబకాయానికి దారితీస్తుంది. ఇవేమీ చేయకుండా ఊబకాయులు సన్నపడతారనే ప్రచారానికి ఆకర్షించబడి వేలాది రూపాయలు ఖర్చుపెట్టే వారి సంఖ్యను తగ్గించడమూ ఓ రకంగా వైద్యమే. శారీరకశ్రమ లేకుండా, జీవనశైలి మార్చుకోకుండా కుండా మంత్రాలకు చింతకాయలు రాల్తాయనే ఆలోచన నుండి వారిని దూరంచేయాలి. భారత్‌లో ఊబకాయానికి సంబంధించి ప్రమాదఘంటికలు మోగుతున్నాయని లాన్సెట్ జర్నల్ ఇదివరకే ఓ అధ్యయనంలో వెల్లడించింది. అమెరికా, చైనాల తర్వాత భారత్‌లోనే ఊబకాయులు అధికం. 2035నాటికి ప్రపంచవ్యాప్తంగా 330 కోట్ల మంది ఊబకాయులుంటారని అంచనా. వారిలో 77కోట్ల మంది యువకులేనని లెక్కకట్టారు. 2030నాటికి ప్రపంచవ్యాప్త బాల ఊబకాయుల్లో ప్రతి పది మందిలో ఒకరు భారతీయ బాలురే ఉంటారని యూనిసెఫ్ ఒబేసిటీ అట్లాస్ -22లో పేర్కొన్నారు. అనగా ఆనాటికి భారత్‌లో 2.7కోట్ల మంది 'పిల్ల ఊబకాయు'లు ఊబకాయంతో సతమతమవుతుంటారు. సాధారణంగా బాడీమాస్ఇండెక్స్ (బిఎంఐ) 25 కంటె ఎక్కువుంటే అధికబరువు కలిగిన వ్యక్తులుగా పరిగణిస్తాం. 30కంటే ఎక్కువ ఉంటే ఊబకాయమే. 'స్లీప్ ఆప్నియా' ఊబకాయుల్లోనే ఎక్కువ. అది ఒక్కోసారి మరణానికి దారితీయవచ్చు. అందుచేత ఊబకాయాన్ని ఉపేక్షించరాదు. లైపోసక్షన్ ద్వారా ఊబకాయ శస్త్రచికిత్సతో ఇట్టే సన్నగా మారిపోవచ్చునని ఆశపెడితే వెళ్లి వాళ్లసేవలో ఇరుక్కుపోవడం, ఆపై వారి ప్రయోగాలు వైఫల్యంచెంది ప్రాణం మీదకొస్తుంది. ఆరోగ్యకరమైన శైలి పాటించేవిధంగా తమ అనుచరులను సిద్ధం చేయడం ఒక ఎత్తయితేవారు వారి అనుచరులను అందుకు సమాయత్తం చేస్తారు. శస్త్రచికిత్సలద్వారా భారీ శరీరం నుంచి విముక్తి పొందవచ్చనే ఆలోచనా ధోరణినిమార్చుచేయాలి. ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడమూ ముఖ్యమే! తక్కువ వంటనూనె వాడకంవల్ల ఊబకాయం నివారించవచ్చుననే ఆరోగ్యసలహా నేపథ్యంలోనే ఆయిల్స్ పొదుపుపై తాజాగా దృష్టిపెట్టారు. ఊబకాయ నియంత్రణకు ఇదొక్కటే సరిపోదనే విషయం దృష్టిలో ఉంచుకుని ప్రాచీన కాలం నాటి వ్యాయామ క్రమశిక్షణ ద్వారా ఆహార నియమాలు పాటింపు వంటివి అమలు చేయడం ఉత్తమం.

వ్యక్తులను బట్టి సమాజం తీరు ఉంటుంది. ముందు వ్యక్తి మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లకు మారాలి. అప్పుడే సమాజం బాగుంటుంది.



స్వామి వివేకానంద

సమస్యలను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై ఆ సమస్యల పరిష్కారం ఆధారపడి ఉంటుంది.



గోల్డ్‌స్మిత్

# ప్రజావాక్కు



### నిర్వహణ కార్యక్రమాలను చేపట్టాలి

శ్రీశైలం ఎడమ కాల్వ సోరంగ మార్గంలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో చిక్కుకుపోయిన ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు తెలంగాణా ప్రభుత్వం, కేంద్ర, రాష్ట్రఇతరసహాయక బృందాలు అహర్నిశలు కృషి చేస్తూన్నా వారిజాడ ఇంతవరకు దొరకలేదు. ఇంకా లోపలికి వెళ్ళడానికి వీలు లేకుండా దారి అంతా చెత్తాచెదరం, బురదతో నిండిపోయింది. శక్తివంతమయిన మైకులతో వారిని పిలుస్తున్నా సమాధానం ఏమాత్రం రావడంలేదు. వారు విగతజీవులై ఉంటారని అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయినా వారు నోరుమెదపలేని నీరసావస్థలోఉన్నారేమో. భగవంతుని దయవల్లవారు ప్రమాదం నుంచి బయట పడాలని ప్రార్థిద్దాం. టన్నెల్ లాంటి మార్గాలకు ఎప్పటికప్పుడు నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి

వయసు నిర్ధారణ పత్రాలు అన్నిసచివాలయాల్లో ఇవ్వాలి ఆంధ్రప్రదేశ్‌లోని కొంతమంది వృద్ధులకు ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు జరిగింది. వారికి 75 లేదా ,65 సంవత్సరాలు వయసు ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో 45,56,58,సం.లు ఉన్నట్టుగా నమోదు అయింది. ఆ కారణంగాపలువురు వృద్ధులకు వృద్ధాప్య పింఛను పొందే అర్హత కోల్పోయారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాలో ప్రత్యేక కౌంటర్‌లు పెట్టి వృద్ధులకు వయసు నిర్ధారణపత్రాలు ఇవ్వాలి. ఈ కౌంటర్‌లు నిరంతరం పనిచేయాలి. ఇవి పనిచేసే తీరుపై జిల్లా కలెక్టర్‌లు పర్యవేక్షణ ఉండాలని అర్హతవున్న వారికి వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి.

-శీరాపు శ్రీనివాసరావు, దాసన్నపేట, విజయనగరం

### నవ్వే ఔషధం

నవ్వుఆకర్షణీయమైనది. ఆనందకరమైనది మాత్రమే కాదు, ఆరోగ్య ప్రదమైనదికూడా అంటున్నారు శాస్త్రజ్ఞులు. పగలబడినవ్వినప్పుడల్లా శరీరంలో ఇంటర్ పెరాన్‌గామా రసాయనం రెట్టింపై అనారోగ్య లక్షణాలకు దివ్యమౌన ఔషధంలాగా పనిచేస్తుంది అంటున్నారు. కాబట్టి అందరూ హాస్య సినిమాలకు, హాస్య పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందరు నవ్వుతూ జీవించాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

### ప్రతిపక్ష నేత హోదా కుంటి సాకుమాత్రమే!

ప్రతిపక్ష నేతహోదా ఇచ్చేవరకు శాసనసభ సమావేశాలకు రాను అని చెప్పిన పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సభ్యత్వం రద్దు అవుతుందన్న భయంతో సభకు వచ్చి సంతకం పెట్టి వెళ్ళిపోవడం బాధ్యతారాహిత్యం, సిగ్గుచేటు కూడా! నిజానికి సభకువస్తే అధికార పార్టీసభ్యుల విమర్శలకు సమాధానం చెప్పుకోలేక మొహంచాటేస్తున్నారు? ఇలాంటి విన్యాసాలతో ప్రజల్లో చులకన అవ్వటం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

### వికలాంగులకు న్యాయం చేయండి

తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగుల వద్ద నుండిఅప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగిఇవ్వడంలో కొందరు వివాదాలు సృష్టిస్తున్నారు. దాడులు, దౌర్జన్యాలుచేస్తున్నారు. ప్రభుత్వాన్ని నిర్ణయించిన అప్పు కాగితం బాండ్ పేపర్‌లో రాసిన వాటిని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వికలాంగులు వివిధ పనులు చేసుకుని డబ్బులు పొదుపు చేసుకుని అడిగినవారికి అప్పుగా ఇస్తే కొంత వడ్డీరూపంలో కలిసివస్తదని ఆశతో ఇస్తే తిరిగి ఇవ్వడంలో చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో వికలాంగులకు సంబంధించిన ఇంటి స్థలాలను కూడా కబ్జాలు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించినారు. ఇట్టి విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ రెవెన్యూ అధికారికీ కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. సంవత్సరం గడిచిపోయినా కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదు. వికలాంగుల పెండింగ్ సమస్యల దరఖాస్తులను పరిశీలించి, వికలాంగులకు న్యాయం చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరం

ఈమధ్య కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు దాటుతున్న పాదచారులని ఢీకొడుతూ వారిప్రాణాలు పోవడానికి, అంగవైకల్యానికి కారణమవుతున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించమని, హెల్మెట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనం పైన ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించవద్దని, అతివేగం వద్దని ఎంతగానో ప్రచారం కల్పించి, జరిమానాలు విధిస్తున్నా కొందరు అస్సలు లెక్కచేయడంలేదు. అంతేకాదు రాంగ్‌రూట్లో వెళుతూ ఇతరులని ఇబ్బంది పెడుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విన్నవీ, కన్నవీ... అంతా భ్రాంతియేనా?

**ఉత్తరప్రదేశ్ హత్రాస్ జిల్లాలో జరిగిన సత్సంగ్ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేస్తే దాని నివేదిక డిసెంబరు 2024నాటికీ ఇచ్చినా బయటకు వచ్చింది ఈ ఫిబ్రవరిలోనే. ఈ లోగా నాలుగైదు ప్రాణాపాయకర చేసిన తొక్కిసలాటలు జరిగాయి. ప్రాణనష్టమూ చవిచూసాం. అంటే ఆనాటి అనుభవాలు సరికొత్త భద్రతా ప్రమాణాల రూపకల్పనకు పనికివస్తాయనుకుంటే మనకు అవి సకాలంలో అందకపోవడం దురదృష్టకరం. కమిషన్ సూచించిన విషయాలపై చర్చలు, చర్చోప చర్చలు సాగితే అమలు ఎప్పుడికో. ఈ లోగా తొక్కిసలాటలు జరగవని గ్యారెంటీ ఏమీ లేదు. జరుగకుండా ఉండాలని కోరుకుందాం. భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాలు, విస్తృత రవాణా వ్యవస్థ ఏర్పాటు, విస్పష్ట సమాచారం తెలిపే ఏర్పాట్లు, సమర్థవంత క్యూల నిర్వహణ ఉంటే తొక్కిసలాట సంఘటనలు అతి తక్కువగానే జరుగుతాయన్నది అందరూ చెప్పేదే.**

వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

దేశంలో ఎన్నో తొక్కిసలాట సంఘటనలు జరిగాయి. దాదాపు అన్నిటిలోనూ మానవ తప్పిదాలేనని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పిన విషయాలను బట్టి తెలుస్తుంది. కానీ నిర్వాహకులు ప్రభుత్వమైనా, ప్రయివేటు వారైనా సరైన ప్రణాళికలు లేకపోవడం కారణంగా ప్రమాదాలు సంభవించినా, ఆనక వారు ఆరోపణలను తోసి రాజని క్లీన్‌చిట్‌లు తెచ్చుకోవడం రివాజుగా మారింది. తాజాగా మహాకుంభ మేళా సందర్భంగా రెండు చోట్ల 'తొక్కిసలాటలు జరిగాయి. ఒకటి ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్ వద్ద, అర్థరాత్రి అపరాత్రి అనకుండా కోట్లాది మంది భక్తులు మౌని అమావాస్య నాడు అమృత స్నానాల కోసం వచ్చి ప్రమాదం బారిన పడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎనిమిది మందే చనిపోయారు. లెక్కల్లోకి రాని మరణాలు చాలానే ఉంటాయని ఆరోపణలు కూడా వచ్చాయి. అక్కడున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆ లెక్కలన్నీ వెలుగులోకి రానీయకుండా తొక్కిపట్టిందని భోగట్టా. ఏది ఏమయినా తొక్కిసలాటలు ఎక్కడ జరిగినా వాస్తవ మరణాలకి, ప్రభుత్వ లెక్కలకి పొంతన ఉండదు. ప్రభుత్వమంటే ఇలాంటి వైపరీత్యాలనూ అరికట్టలేని అసమర్థ ప్రభుత్వంగా విపక్షాలు విమర్శిస్తాయనో, తమ పాలనకు అప్రతిష్ట వస్తుందనో ఆరాటపడటం సహజం. వాటి నేపథ్యంలోనే ప్రతి తొక్కిసలాటకూ ఓ అందమైన సమర్థింపులు వల్లె వేస్తారు. కుంభమేళా సందర్భంగా ఈ నెలలో న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ప్రయాగ్‌రాజ్ రైలు ఎక్కేందుకు వేచి ఉన్న ప్రయాణికులు గందరగోళానికి గురైఏకంగా 16 మంది ప్రయాణికులు మరణించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారంతా సామాన్యులే. కేవలం సాధారణ తరగతిలో ప్రయాణించే స్థోమత కలిగిన వారు మాత్రమే. ఒకేసారి 'ప్రయాగ్‌రాజ్' పేరున్న రైల్వే అనౌన్స్‌మెంట్ వారిని పరలోకానికి చేర్చిందని రైల్వే అధికారులు సంజాయిషి ఇచ్చారు. కానీ అక్కడ జరిగిందేమిటి? రెండో ప్లాట్‌ఫారమ్ మీదకు వస్తుందన్న ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్‌ను, తీరా రైలు సమయమయ్యే సరికి 16వ ప్లాట్‌ఫారం మీదకు రానున్నదని 'ప్లాట్‌ఫారమ్' ఫిరాయింపు సమాచారమే. ఇలా గందరగోళ సమాచారాన్నివ్వడమంటే రైల్వేశాఖ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుచేతనే పాపం తమ చేతి కంటని రీతిలో 'ప్రయాగ్‌రాజ్' పేరున బట్టి ప్రయాణికులే గందరగోళంలో పడి తమ చావును తామే కొనితెచ్చుకున్నారన్న రీతిలో సమర్థించుకోవడం అభ్యంతరకరం. ఒక స్టేట్‌మెంట్ విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారు. తదనంతరం వచ్చిన విచారణలో ప్రయాగ్‌రాజ్ ప్లాట్‌ఫారం మీద, రైళ్లలో ఎక్కగలిగిన వారిని పరిమితం చేయకుండా అపరిమితంగా 10వేల మందికి ఎక్కువ టిక్కెట్లు ఎందుకు అమ్మారని న్యాయమూర్తి నిలదీశారు. ఈ ప్రశ్నకు జవాబు రాదు. దేశంలో ఎక్కడ తొక్కిసలాటలు, తోపులాటలు జరిగినా ప్రాణాపాయం ఏర్పడినా ఇలాంటి 'సర్దిపుచ్చే' పరిస్థితి ఉంటుంది. అప్పటికప్పుడు ఇచ్చే సమర్థింపులను న్యాయబద్ధం చేసేందుకేననుకుంటా విచారణ కమిషన్‌ల నివేదికలను మనం చూస్తున్నాం. చూస్తూనే ఉంటాం. అదంతా వారి భ్రమేననిపిస్తున్నది. అలాంటి సంఘటన అక్కడసలు జరిగిం



దా లేదా! మనం విన్నవీ,కన్నవీ నిజమేనా, అంతా భ్రాంతియేనా! అనుమానం మనకే వస్తుంది. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో 121 మంది చనిపోయిన తొక్కిసలాట సంఘటనలో ఆధ్యాత్మిక సదస్సు నిర్వాహకులు భోలేబాబాకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ముగ్గురుసభ్యుల జ్యుడిషియల్ కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చేసింది. ఇక్కడ 'స్కేప్‌గోట్'లు పోలీసులే! అపరిమిత జనాభా గుమిగూడినప్పుడు పరిమితంగా పోలీసు భద్రత కల్పిస్తే జరిగేదిదే. ఇలాంటి సందర్భాలలో ముందస్తు ప్రణాళికలో బందోబస్తు కలుగచేయాల్సిన అవసరముంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో సంత్ నారాయణ్ సకారిహారి అనే మాజీ పోలీసు ఉద్యోగి అనేక సత్సంగ్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రవచనాలు చెప్తుంటారు. ఉద్యోగంమానేసి బాబా అవతారం ఎత్తిన భోలేబాబా పాదధూళి కూడా పవిత్రమైనదనే భావన అక్కడి ప్రజల్లో విశ్వాసం. ఆయనకు రాజకీయ పలుకుబడి కూడా తక్కువేమీ కాదు. ఏమైతేనే యధాతథంగా భోలేబాబాకు క్లీన్‌చిట్ దక్కింది. కార్యక్రమ నిర్వాహకులకు మాత్రం మరోసారి ఇలాంటివి జరగకూడదని హెచ్చరించింది. యధావిధిగా జ్యుడిషియల్ కమిషన్ తన నివేదికలో నిర్వాహకులు నిబంధనలు పాటించి కార్యక్రమం నిర్వహిస్తే అది విజయవంతమయ్యే అవకాశం ఉందని కమిషన్ స్పష్టం చేసింది. దుస్సంఘటన జరిగి కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాక, తీరిగ్గా వచ్చే సలహాలు, సూచనలు దేనికి పనికి వస్తాయో స్పష్టంగా తేల్చలేం. 2024జులై 2న ఉత్తరప్రదేశ్ హత్రాస్ జిల్లాలో జరిగిన సత్సంగ్ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేస్తే దాని నివేదిక డిసెంబరు 2024నాటికీ ఇచ్చినా బయటకు వచ్చింది ఈ ఫిబ్రవరిలోనే. ఈ లోగా నాలుగైదు ప్రాణాపాయకర చేసిన తొక్కిసలాటలు జరిగాయి. ప్రాణనష్టమూ చవిచూసాం. అంటే ఆనాటి అనుభవాలు సరికొత్త భద్రతా ప్రమాణాల రూపకల్పనకు పనికివస్తాయనుకుంటే మనకు అవి సకాలంలో అందకపోవడం దురదృష్టకరం. కమిషన్ సూచించిన విషయాలపై చర్చలు, చర్చోపచర్చలు సాగితే అమలు ఎప్పుడికో. ఈలోగా తొక్కిసలాటలు జరగవని గ్యారెంటీ ఏమీ లేదు. జరుగకుండా ఉండాలని కోరుకుందాం. భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాలు, విస్తృత రవాణా వ్యవస్థ ఏర్పాటు, విస్పష్ట సమాచారం తెలిపే ఏర్పాట్లు, సమర్థవంత క్యూల నిర్వహణ ఉంటే తొక్కిసలాట సంఘటనలు అతి తక్కువ గానే జరుగుతాయన్నది అందరూ చెప్పేదే. ఒకే రకమైన రెండు సంఘటనలు గూర్చి చెప్పుకోవాల్సిన తరుణమిది. 2013 నవంబరులో హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు వద్ద జరిగిన కుంభమేళా ఉత్సవాల్లో తొక్కిసలాటలో 24 మంది మరణించారు. దీనికి కారణం రద్దీ నియంత్రణ, రవాణా సౌకర్యాలలేమి, సరైన ప్రణాళిక లేక నియంత్రణలో విఫల మైనట్లు తేల్చారు. అనంతరం 2022 మధ్యప్రదేశ్ రాట్లంలో ఇంద్ర కల్పపూజ ఉత్సవం సందర్భంగా భక్తులంతా తండోపతండాలుగా పక్కనే ఉన్న గంగానదికి వెళ్లబోగా తొక్కిసలాట జరిగింది. ఆ సందర్భంలో 15 మంది చనిపోయారు. ప్రతి తొక్కసలాటకు రద్దీ కారణమని తెలిసినా జాగ్రత్తలు పడకపోతే ఎదురయ్యే పరిస్థితులు కష్టనష్టాలు ఇలాగే ఉంటాయి. అపరిమిత జనాలకు ఆలవాలంగా మారే రద్దీ ఉత్సవాల్లో ఆయా ప్రభుత్వాలు మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని అంటుంటాము. కాని గందర గోళపడడమూ, తప్పుడు సమాచారంతో ముందుకు సాగడం వల్లనే ప్రాణాలు తోడుకపోతాయని గుర్తించగలిగితే ఆయా ప్రభుత్వాలు విస్తృత ప్రాతిపదికపై భద్రతా ఏర్పాట్లు తీసుకోగల అవకాశముంటుంది.

# కృత్రిమ మేధస్సుపై పారిస్ ముందడుగు


డాక్టర్. పి.ఎస్. చారి

ఇటీవల కృత్రిమ మేధస్సు (ఏఐ) పైమూడవ శిఖరాగ్ర సమావేశం ఫ్రాన్స్‌ని పారిస్‌లో జరిగింది. 2023లో 28 దేశాలతో సురక్షితమైన, మానవకేంద్రీకృత, బాధ్యతాయుతమైన ఏఐని సూచించే మొదటి శిఖరాగ్ర సమావేశం యునైటెడ్ కింగ్‌డమ్‌లో బ్లెచ్లీ పార్క్‌లో జరిగింది. రెండవ శిఖరాగ్ర సమావేశం 2024లో దక్షిణ కొరియాలోని సియోల్ రాజధాని నగరంలో 27దేశాలతో జరిగింది. ఈ సమావేశం అంతర్జాతీయ సహకారాన్ని పునరుద్ఘాటించి, ఏఐ భద్రతా సంస్థల నెట్‌వర్క్‌ను ప్రతిపాదించింది. ఈ మూడవ సమావేశం కోసం భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పారిస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్షన్ సమ్మిట్ 2025కి సహ అధ్యక్షుడు (కోఛైర్)గా వ్యవహరించడానికి ఫ్రాన్స్‌ను సందర్శించారు. అదే సమయంలో, రెండవ ఇండియా ఫ్రాన్స్ ఏఐపాలసీ రౌండ్‌టేబుల్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. కృత్రిమ మేధస్సు శిఖరాగ్ర సమావేశం అనేది ఏఐపాలన, నైతికత, సమాజంలో దాని పాత్ర గురించి చర్చించడానికి ప్రపంచ నాయకులు, విధాన రూపకర్తలు, సాంకేతిక నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులను ఒక చోట చేర్చే ప్రపంచ వేదిక. ఈ శిఖరాగ్ర సమావేశంలో కీలకమైన ఇతివృత్తాలపై చర్చలు జరిగాయి. వీటిలో సమ్మిళితంను నిర్ధారించడానికి ఏఐ అవస్థాపనకు ఎక్కువ ప్రాముఖ్యత, పబ్లిక్ ఇంటరెస్ట్ ఏఐ, పర్యావరణ ప్రయోజనాల కోసం ఓపెన్ ఏఐ, సృజనాత్మక పరిశ్రమలకు ట్రస్ట్ క్రియేటివ్ పరిశ్రమలకోసం ఏఐ తీసుకొచ్చే ఇన్నోవేషన్ సంస్కృతి, ఏఐ బాధ్యతాయుత వినియోగం, ప్రజా ప్రయోజనాల కోసం ఏఐని మరింత వైవిధ్యంగా స్థిరంగా చేయడం, ఏఐ సురక్షితమైన విశ్వసనీయ పాలనను నిర్ధారించడం మొదలైనవి ఉన్నాయి. ఏఐ అభివృద్ధికి మార్గనిర్దేశం చేయడంలో ఏకాభిప్రాయాన్ని ఎలా చేరుకోవాలో చర్చించడానికి 100 కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. పారిస్ శిఖరాగ్ర సమావేశ ప్రకటన ముఖ్యఫలితాలు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ మినహా ప్రజలు, భూగ్రహం కోసం సమగ్రమైన, స్థిరమైన కృత్రిమ మేధస్సుసంయుక్త ప్రకటనపై భారతదేశం, చైనా, యూరోపియన్ యూనియన్‌తో సహా 60 దేశాలు సంతకం చేశాయి. ఇందులో ఏఐపై అధిక నిబంధనలకు సంబంధించిన ఆందోళనలను వ్యక్తం చేయడం జరిగింది. ఈ ప్రజాప్రయోజనాలలో భాగంగా పబ్లిక్ ప్రైవేట్ ఏఐ సహకారప్రయత్నాలకు, డేటా పారదర్శకతకు, ఫైనాన్సింగ్‌లో సామర్థ్య పెంపుదల ద్వారా విశ్వసనీయమైన ఏఐ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి ఏఐ వేదిక, ఇంక్యుబేటరు ప్రారంభించబడింది. మానవకేంద్రీకృత ఏఐ, గ్లోబల్ ప్రాధాన్యతలకు సంబంధించి ఏఐ అసమానతలను పరిష్కరిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు భరోసానిస్తూ, నైతిక, సురక్షితమైన,సమ్మిళిత ఏఐ ఆవశ్యకతను సమావేశం నొక్కి చెప్పింది. ఈ సమావేశంలో ఏఐ యాక్సెసిబిలిటీ, పారదర్శకత, ఉద్యోగ సృష్టి,సుస్థిరత,అంతర్జాతీయ పాలన, డిజిటల్ విభజనను తగ్గించడం,ఏఐ భద్రతను నిర్ధారించడం, గ్రీన్ ఏఐని ప్రోత్సహించడం, ప్రపంచ సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలను కూడా నొక్కి చెప్పింది. ఇప్పటికే ఉన్న బహుపాక్షిక ఏఐ ఇనిషియేటివ్‌లతోసమతౌల్యం చేయడం, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాలు, గ్లోబల్ డిజిటల్ కాంపాక్ట్, యునెస్కో ఏఐ నైతిక సిఫార్సులు, ఆఫ్రికన్ యూనియన్ ఏఐవ్యూహం, ఆర్థికసహకార అభివృద్ధి సంస్థ, గ్రూప్7(బి7) ద్వారా ఫ్రేమ్‌వర్క్‌లతో సహా గ్లోబల్ ఏఐ కార్యక్రమాలతో సమలేఖనాన్ని సమ్మిట్ నొక్కి చెప్పింది. పారిస్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశ ప్రకటనలో అమెరికా, యునైటెడ్‌కింగ్‌డమ్ యునైటెడ్ కింగ్‌డమ్‌లు అంతర్జాతీయ ఒప్పందంపై సంతకం చేయలేదు. ఒక సంక్షిప్త ప్రకటనలో, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వం జాతీయ భద్రత గ్లోబల్ గవర్నెన్స్ గురించి ఆందోళనల కారణంగా సంతకం చేయలేదు. 2023 నవంబర్‌లో అప్పటి ప్రధాన మంత్రి రిషిసునక్ ప్రపంచంలోని మొట్టమొదటి ఏఐ భద్రతా సదస్సును నిర్వహించడంతో యునైటెడ్ కింగ్‌డమ్ గతంలో ఏఐ భద్రతకు సంబంధించి విజేతగా ఉంది. ఏఐ మరింత ఆచరణాత్మకమైన పరిష్కారాలను అన్వేషిస్తుందని సూచనగా శిఖరాగ్ర సమావేశాన్ని స్వాగతించింది. ఏఐ అభివృద్ధికి సంబంధించి ప్రపంచ సవాళ్లు ఏఐ అభివృద్ధి కోసం అధిక శక్తి వినియోగం ఉంది. ఏఐ పెరుగుతున్న శక్తి డిమాండ్ 2030 నాటికి డేటా సెంటర్ల విద్యుత్ వినియోగాన్ని 12శాతం నుండి 34శాతానికి పెంచుతుంది. ఇది ప్రపంచ శక్తి వినియోగంలో 21శాతానికి చేరుకునే అవకాశం ఉంది. పెరిగిన శక్తి డిమాండ్ కారణంగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలలో ఊహించిన పెరుగుదల 125140 బిలియన్ల అమెరికన్ డాలర్లు సామాజిక వ్యయంకి దారితీస్తుందని అంచనా వేయబడింది. ఎకనామిక్ సర్వే 2024 -25 ప్రకారం ఏఐ డేటా సెంటర్లు భారతదేశం మొత్తం ప్రస్తుత వినియోగం1,580 టెరావాట్ గంటలకు సమానమైన విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. ఎందుకంటే ఏఐపై ఎక్కువ ఆధారపడటం వలన ఉద్యోగ నష్టం, డేటా గోప్యతా సమస్యలు, డిజిటల్ విభజనలు ఉంటాయి. డీప్‌సీక్ వంటి సురక్షితంకాని, తక్కువధర ఏఐ మోడల్‌లు డేటా ఉల్లంఘనలు, తప్పుడుసమాచారం, సైబర్ సెక్యూరిటీ బెదరింపుల ప్రమాదాలనుకలిగిస్తాయి. బలహీనమైననియంత్రణ పర్యవేక్షణ, నైతికరక్షణలు పక్షపాతం భద్రతాఆందోళనలను పెంచుతాయి. కాబట్టి బలమైన ఏఐ పాలన అవసరం.

# విద్యార్థులు పాలకులకు పరీక్షా కాలమే!

మేకిరి దామోదర్

అక్షరానికి తూకం వేసేకాలం అదే పరీక్షల కాలం వచ్చేసింది. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే తరుణం. మార్చి 5వ తేదీ నుంచి 25 వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయి. అలాగే మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు కొనసాగుతాయి. ఆ తర్వాత వచ్చే డిగ్రీ, పీజీ తదితర పోటీ పరీక్షలు ఇలా వారు చదివిన చదువులను పరీక్షలతో కొలుస్తున్నాం. ఏడాదంతా తరగతిలో విని, చదివి, వీటిని మళ్లీ పునశ్చరణ చేసుకొని ఏకాగ్రతతో పరీక్షల్లో బాగారాసి మంచి మార్కులు సాధించుకోవాలనే తపన వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతారు. పాలకులు, అధికారులు పరీక్షల నిర్వహణ సౌకర్యాలతో పాటు మంచి వాతావరణం కల్పిస్తేనే ఒత్తిడికి లోను కాకుండా ఉత్సాహంగా పరీక్షలు రాస్తారు. పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయా(సౌకర్యా)ల ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అప్పుడే మంచి ఫలితాలు సాధించబడతాయి. ప్రతీ సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును నిర్ణయించే అతి కీలకమైన ఘట్టం ఈ పరీక్షలు. సుమారు 15 నుంచి 20 ఏళ్ల అకుంఠిత దీక్షతో రాత్రింబవళ్లు లెక్క చేయక కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని చదివి తన భవిష్యత్తుకు బాటలు పరిచే పరీక్ష కేంద్రాలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలి. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల ముద్రణ, మదింపు నుండి ఫలితాల ప్రకటన వరకు నిర్వాహకులు, అధికారులు ఓ మహాక్రతువు(యజ్ఞం)లా భావించాలి. విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలి. విద్యార్థులు ఈ పరీక్షలను పండుగ(వేడుక)లా భావించాలి. జీవితానికి యమగండంగా పరిణమించకూడదని విశ్లేషకులు హితం చెబుతున్నారు. విద్యార్థులు వర్రియర్స్ (విచారగ్రస్తులు)గా కాకుండా వారియర్స్ (యుద్ధ యోధులు)గా వెలుగొందాలని దాని అర్థం. వాస్తవంగా జరుగుతున్నది ఏమిటి? వార్షిక పరీక్షల్లో ఏదో ఒక విధంగా ఉత్తీర్ణులై మార్కులు సాధించడమే లక్ష్యంగా లక్షలాది మంది విద్యార్థులు కింద మీదులవుతున్నారు. పరీక్షలు మానసిక ఆందోళన, తీవ్ర భావోద్వేగాల ఒత్తిడిలో భావి పౌరులను ఎందరినో పొట్టన పెట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాఠశాల విద్యార్థుల విపరీత ఆందోళనకు పరీక్షలు, ఫలితాలే కారణం అవుతున్నాయని జాతీయ విద్యా పరిశోధనా శిక్షణామండలి (ఎన్ సీ ఈ ఆర్ టీ) అధ్యయనాల్లో తేలింది. విద్యార్థుల మనోవికాసం, సృజనాత్మకంగా పరిష్కార సాధనకు ప్రయత్నించేలా విద్యార్థిని తీర్చిదిద్దితేనే వాస్తవంగా చదువుల ప్రాథమిక లక్ష్యం నెరవేరినట్టు. బోధన సార్థకమైనట్లు. ఎటువంటి ఆసక్తులు, నైపుణ్యాలు కలిగిన వారు ఏం చదివితే ఎందులో రాణిస్తారో లాంటి స్థితిగతులను విద్యార్థుల



కు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంది. చదువును పునాది నుంచి బలోపేతం చేయాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు పరీక్షల పోరుకు సిద్ధమవుతున్నారు. వీరికి అండగా నిలిచే తల్లిదండ్రులు పరీక్షల సమరానికి సిద్ధం చేసే ఉపాధ్యాయు(అధ్యాపకు)లు ఇతరులు కలిసి మరో కోటి మంది ఈ క్రతువులో భాగస్వాములు అవుతారని అంచనా!. ఇందుకోసం విద్యాసంస్థలు ప్రత్యేక తరగతులు, మోడల్ టెస్టులతో ఫలితాల తరాజులో మొగ్గు తమవైపే ఉండేలా విద్యార్థులను సన్నద్ధం చేసే పనిలో ఉన్నారు. మార్చినుంచి జూన్ వరకు వరుసగా ఎన్నో పరీక్షలు అందులో ముందుగా మార్చి 5వ తేదీ నుంచి 25 వరకు ఇంటర్మీడియట్‌ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగుతాయి. అప్పటికే ప్రాక్టికల్స్ పూర్తి అయిపోయాయి. ఇంటర్ పరీక్షలు చివర్లో ఉండగానే టెన్త్ పరీక్షలు షురూ అవుతాయి. మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు ఇవి కొనసాగుతాయి. అలాగే ఇంటర్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి కీలకమైన ప్రవేశ పరీక్షలు ఈఏపీ సెట్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఈ పరీక్షే గేట్‌పాస్. ఇది ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు జరుగుతుంది. ప్రఖ్యాత ఐఐటీలు జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు సాధించాలనేది లక్షల మంది కల. ఈ మెట్టెక్కాలంటే జేఈఈ పరీక్షలు రాయాల్సిందే. ఈ ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ మే18న జరుగుతుంది. ఇక డిగ్రీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి వరుస పెట్టి పరీక్షలు ఉన్నాయి. ఐసెట్, పీజీఈ సెట్, ఎడ్ సెట్, లా సెట్, వైద్య విద్యకోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే యూజీ, పీజీ నీట్. ఇలా జూన్ వరకు పరీక్షలే పరీక్షలు జరుగుతాయి. విద్య, వైద్యం, రెవెన్యూ, రవాణా, పోలీస్.. తదితర శాఖలకు ఇది పరీక్షా కాలమనే చెప్పాలి. ఒకరకంగా ప్రభుత్వానికీ పరీక్షల నిర్వహణ ఒసవాలే. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా పొలిటికల్ హీట్ ఆకాశాన్ని తాకుతుంది. దీంతో పరీక్షల దగ్గర నుంచి ఫలితాల వెల్లడి వరకు టెన్షన్ తప్పని పరిస్థితే సుమా!. ఈ పరీక్షలు ఒక విద్యార్థులకు మాత్రమే కాదు వారి తల్లిదండ్రులకు, సమాజానికి దేశ రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే రేపటి తరానికి జరుగుతున్నాయి అన్న విషయాన్ని మరువరాదు. విద్యార్థులకు ఇంకో మాట. మార్కులే ప్రతిభకు కొలమానం కానే కాదు. పరీక్షలు రాయబోయే ఏఒక్క విద్యార్థి నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దు. విలువ కట్టలేనిది విశ్వంలో ఏదైనా ఉన్నదంటే అది ప్రాణం ఒక్కటే. ఆత్మవిశ్వాసం కన్న గొప్ప ఆస్తి లేదు. ఉన్నది ఒక్కటే జీవితం సంపూర్ణంగా జీవించాలి. చదువులు మనిషికి విలువలద్దాలి, సమగ్రంగా ఉన్నతీకరించాలి. ఈ ఆధునిక సమాజంలో మంచి వ్యక్తులఅవసరం ఎంతో ఉంది. మార్కులే అంతిమ కొలమానం కాదు. పరిపూర్ణ వ్యక్తిత్వంతో మహనీయులు కండి. అభ్యుదయం వైపు నడవాలి అదే అంతిమ లక్ష్యం కావాలి.

# 'గోల్డ్‌కార్డ్' వీసాతో ఎవరికి లాభం?




## ట్రంప్ తాజా ప్రతిపాదనతో ఆందోళనలో భారతీయులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకు గోల్డ్‌కార్డ్ వీసాను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. దీని ప్రకారం.. ఇది కావాలనుకునేవారు 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 43.54కోట్లు) వెచ్చించగలిగితే చాలు. ఓ రకంగా ఇది నేరుగా అమెరికా పౌరసత్వాన్ని కొనుగోలు చేయడం వంటిది. ఈ ప్రతిపాదన చాలామంది భారతీయుల్లో ఆందోళనకు దారితీసింది. ఇప్పటికే అమెరికాలో గ్రీన్ కార్డు కోసం వేచివున్న అత్యధిక వర్గాల్లో భారతీయులు ఒకరు. వీటిల్లో కొంతమందికి ఇది అందాలంటే కనీసం 50 యేళ్ల సమయం పట్టొచ్చని అంచనాలున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ ప్రతిపాదనతో అమెరికాలో వలస విధానంలో పెనుమార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇన్నాళ్లూ అమలులో ఉన్న ఇబి-5 ప్రోగ్రామ్ అదృశ్యం కావడం ఖాయమైపోయింది.

**ఏమిటీ గోల్డ్‌కార్డు వీసా..?**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీనిని ప్రతిపాదించారు. 5 మిలియన్ డాలర్లు భరించగలిగితే ఇది నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తుంది. గతంలోని ఇబి-5 వీసా ప్రకారం 8 లక్షల డాలర్ల నుంచి 10.5 లక్షల డాలర్లు (2022లో మార్చిన దాని ప్రకారం) పెట్టుబడి పెట్టి 10 ఉద్యోగాలు సృష్టించాలి. 1992లో కాంగ్రెస్ ఇబి-5ను ప్రవేశపెట్టింది. కానీ, తాజాగా ప్రతిపాదించిన గోల్డ్‌కార్డ్ సంపన్నులకు ప్రీమియం ఆప్షన్‌గా మారే అవకాశం ఉంది. దీనిలో ఉద్యోగ సృష్టి వంటి అంశాలను వెల్లడించలేదు. దీనిని రష్యాకు చెందిన కుబేరులకు కూడా విక్రయించేందుకు ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు.

**భారతీయులపై ప్రభావం ఎంత?**

అమెరికా గ్రీన్‌కార్డు దరఖాస్తుదారుల జాబితాలో భారతీయులు అత్యధికంగా ఉన్నార9ు. కానీ, ట్రంప్ ఆఫర్‌తో సంపన్న భారతీయులు వేగంగా తమ కలను పూర్తిచేసుకోవడానికి అవకాశం లభిస్తుంది. వీరి సంఖ్య తక్కువగా ఉంటుంది. గతంలో ఇబి-5 శ్రేణిలో పెట్టుబడి పెట్టగలితే వారికి కష్టమైపోతుంది. ఈ పరిణామాలు వృత్తి నిపుణులతో పోలిస్తే.. బిజినెస్ టైకూన్లకే ప్రయోజనకరం.

**ఇబి-5 ఇన్వెస్టర్ వీసా అదృశ్యమవుతుందా?**

గోల్డ్ కార్డు వీసా ఇప్పటివరకు ఉన్న ఇబి-5ను రెండు వారాల్లో భర్తీ చేయనుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుథ్నిక్ ధ్రువీకరించారు. ఇప్పటికే ఇబి-5 విధానాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుపట్టారు. అదో చెత్త, మోసపూరిత విధానమని పేర్కొన్నారు. ఇబి-5 వీసాతో పోలిస్తే కొత్త దానిలో వెచ్చించాల్సిన మొత్తం 5 రెట్లు అధికం. ఇది చిన్న, మధ్యస్థాయి ఇన్వెస్టర్లు భరించలేని భారం. ఇబి-5లో నిధులు సేకరించే లేదా కొన్ని రకాల రుణాలు తీసుకొనే వెళ్లేవారు. దీనిలో అవకాశం చాలా తక్కువ.

**ప్రస్తుతం హెచ్-1బి, ఇబి-2, ఇబి-3 వీసాపై ఉన్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చా?**

5 మిలియన్ డాలర్ల సొమ్ము ఉంటే ఈ వీసాకు వారుకూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సంపన్నులు, ధనికుల అవసరాలకోసం స్పాన్సర్ చేసే ప్రతిభావంతులకు ఇదే మార్గమని ట్రంప్ పేర్కొన్నారు. కంపెనీలు కూడా తమకు కావాల్సిన కీలక ఉద్యోగులను అమెరికాకు తీసుకురావచ్చు.

**ఎన్ని గోల్డ్ కార్డులు జారీ చేయొచ్చు?**

అమెరికా అధ్యక్షుడి ఇప్పటి లెక్కల ప్రకారం దాదాపు 10 లక్షల గోల్డ్‌కార్డులు విక్రయించొచ్చు. అదే కోటి విక్రయిస్తే అమెరికా ద్రవ్యలోటు కూడ కొంత తగ్గుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈ విధానం అమలు కావాలంటే ఆ దేశ కాంగ్రెస్ అనుమతి అవసరం లేదు. మరో రెండు వారాల్లో గోల్డ్‌కార్డు పూర్తి సమాచారం బహిర్గతం కావచ్చు.



## సూడాన్‌లో కుప్పకూలిన సైనిక విమానం

### 46 మంది దుర్మరణం

**ఖర్తౌమ్, ఫిబ్రవరి 26:** సూడాన్‌లో మంగళవారం ఘోరవిమాన ప్రమాదం చోటుచేసుకుంది. వాడిసయిద్నా వైమానిక స్థావరం నుంచి ఓ సైనిక విమానం టేకాఫ్ అయిన కాసేపటికే నివాసాల మధ్య కుప్పకూలింది. ఈ ఘటనలో 46 మంది సైనిక సిబ్బందితోపాటు పలువురు పౌరులు సైతం ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పది మందికిపైగా గాయపడినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదని.. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సూడాన్‌పై పట్టు కోసం సైన్యం, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సు (ఆర్‌ఎస్‌ఎఫ్) మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధం ఇటీవల తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో న్యాలా ప్రాంతంలో ఇటీవల ఓ సైనిక విమానాన్ని కూల్చివేసినట్లు డార్ఫర్ పశ్చిమ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ ప్రకటించింది. అయితే ప్రస్తుత ప్రమాదానికి ఈ ఘర్షణలకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.



## రాజ్యసభకు కేజ్రీవాల్!

### అవన్నీ వదంతులేనంటున్న ఆప్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఢిల్లీమాజీ సిఎం ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్ ఇక పార్లమెంటులో అడుగుపెడతారన్న చర్చ ప్రారంభం అయింది. ఆయన్ను త్వరలోనే రాజ్యసభకు పంపించేందుకు ఆప్ ముమ్మర సన్నాహాలుచేస్తోందన్న ప్రచారం జోరందుకుంది. అయితే పార్టీమాత్రం వీటిని తోసిపుచ్చింది. ప్రస్తుతం రాజ్యసభలో ఉన్న ఆప్ ఎంపి సంజీవ్ ఆరోడాను పార్టీ పంజాబ్ ఉప ఎన్నికల బరిలో నిలిపింది. లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిగా సంజీవ్‌పేరును ఖరారుచేస్తూ బుధవారం ప్రకటన విడుదలచేసింది. సంజీవ్ అరోరా 2022లో పంజాబ్‌నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2028లో ముగుస్తుంది. లూథియానా వెస్ట్‌నుంచి ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యే గుర్‌ప్రీత్‌గోగి గతనెల మరణించడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. దీనితో పార్టీ సంజీవ్‌ను బరిలోకి దించింది. ఉప ఎన్నికలు ఆయన గెలిచే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. ఆయన గెలిచి ఆపదవిలో కొనసాగాలనుకుంటే రాజ్యసభ సభ్యత్వాన్ని ఖాళీచేయాలి. అప్పుడు పెద్దల సభలో ఖాళీ అయ్యే ఆస్థానానికి కేజ్రీవాల్‌ను పంపించాలని ఆప్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పార్టీ మాత్రం అవన్నీ వందతులేనని కొట్టివేసింది. ఆప్ పంజాబ్ విభాగం ప్రతినిది జగ్దార్‌సింగ్ మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను రాజ్యసభకు పంపించే అంశంపై ఏచర్చ జరగలేదని స్పష్టంచేసారు. ప్రతిపక్షాలు ఉద్దేశ్యపూర్వకంగా ఈప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఢిల్లీ మంత్రి బిజెపి నేత పర్వేశ్‌సింగ్ వర్మ చేతిలో ఓటమి చవి చూసిన సంగతి తెలిసిందే.

# పునర్విభజనలో దక్షిణాదికి ఒక్క సీటు నష్టం కూడా ఉండదు

## తమిళనాడులో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే...

## కోయంబత్తూరులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**కోయంబత్తూరు, ఫిబ్రవరి 26:** నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు ఒక్కసీటు కూడా నష్టం ఉండదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. కేంద్రం నిధుల కేటాయింపులో కూడా దక్షిణాది రాష్ట్రాలపట్ల వివక్ష చూపిస్తోందన్న సిఎం స్టాలిన్ వ్యాఖ్యలపై అమిత్‌షా స్పందించారు. ఇది కేవలం రాష్ట్ర సమస్యలను పక్కదారి పట్టించడానికేనని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటివరకూ తమిళనాడుకు 5,08,337 కోట్లు నిధులు అందించిందని 2014నుంచి2024 వరకూ తమిళనాడుకు నిధుల వాటా కేటాయింపులో ఎలాంటి వివక్షలేదని, ముఖ్యమంత్రి స్టాలిన్ పునర్విభజనపై తప్పుడు సమాచారం వ్యాప్తిచేస్తున్నారని ఆరోపించారు. కేవలం తమిళనాడు ఒక్కటే కాకుండా ఏ ఒక్క దక్షిణాది రాష్ట్రం కూడా పార్లమెంటు సీట్లలో కుదింపు ఉండదని, ఒక్కసీటు కూడా నష్టం ఉండదని ప్రోరేటా పద్ధతిలో పునర్విభజన జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అమిత్‌షా అన్నారు. బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకవిధమైన జాతి వ్యతిరేకతను తమిళనాడులో వ్యాప్తిచేస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడు ప్రభుత్వం 1998 బాంబు పేలుళ్ల కేసు నిందితుడు మాస్టర్ మైండ్ ఎస్ఎబాషా అంత్యక్రియల సమయంలో తమిళనాడు ప్రభుత్వం భారీ భద్రత కల్పించిందని గుర్తుచేసారు. రాష్ట్రంలో డ్రగ్ మాఫియా యథేచ్ఛగా కొనసాగుతోందని అక్రమ మైనింగ్ మాఫియా రాజకీయాలు మొత్తం అవినీతి మయం చేసిందని అన్నారు. అవినీతిలో డిఎంకె నేతలందరూ మాస్టర్స్ డిగ్రీచేసారని ఆయన ఆరోపించారు. రాష్ట్రప్రజలు అనేక సమస్యలతో విసుగుచెందారని, ముఖ్యమంత్రి ఆయన కుమారుడు అవసరంలేని అంశాలను ప్రచారంలోకి తెస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మార్చి ఐదున ఆల్‌పార్టీ సమావేశం ఏర్పాటు చేసిన తమిళనాడు ప్రభుత్వం దక్షిణాదికి అన్యాయంచేస్తే సహించేదిలేదని చెపుతున్నారని, నిజానికి ఒక్కసీటు నష్టం కూడా ఉండదని అన్నారు. వచ్చే ఏడాదిజరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ నాడులో ఎన్డీయే పాలనపగ్గాలు చేపడుతుందని మహారాష్ట్ర, హర్యానా విజయాలకు మించి తమిళనాడులో ఎన్డీయే ఘన విజయం సాధిస్తుందని అన్నారు. ఇదే సందర్భంలో కోయంబత్తూరు నుంచే అమిత్‌షా వర్చువల్‌గా తిరువన్నామలై, రామనాథపురంలలో కూడా పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు.

**క్షమించాలి..తమిళంలో మాట్లాడలేకపోతున్నా**

జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడుకేంద్ర ప్రభుత్వాలమధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తమిళనాడులోని కోయంబత్తూరులో బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభించేందుకు వచ్చిన అమిత్‌షా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనభాష తమిళం అని అన్నారు. అటువంటి గొప్పభాషలో మాట్లాడలేకపోతున్నందుకు తనను క్షమించాలని ఆయన కోరారు. అధికార డిఎంకై ప్రభుత్వంపై ఆయన విరుచుకుపడ్డారు. 2026 ఎన్నికల్లో దేశవ్యతిరేక పార్టీ అయిన డిఎంకే ఓటమి పాలవుతుందని, రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు ఖాయమని అన్నారు. చాలా ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే సర్కారు ఏర్పాటుచేసామని, మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీప్రజలు బిజెపిపై విశ్వాసంతో అధికారం ఇచ్చారన్నారు.

కుటుంబ రాజకీయాలను అవినీతిని అంతంచేస్తూ 2026లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తంచేసారు. త్రిభాషా సూత్రం కింద జాతీయ విద్యావిధానంలో హిందీ, ఇంగ్లీషు ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం వెల్లడించింది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె చెపుతోంది. ఇదేవిషయమై సిఎం స్టాలిన్ కూడా తమిళభాషకు ప్రజలకు రాష్ట్రానికి నష్టం కలిగించేచర్యలను అనుమతించనని అన్నారు. ఈ వివాదం జరుగుతున్న క్రమంలో తమిళభాషను అమిత్‌షా కీర్తిస్తూ ప్రసంగించడం గమనార్హం.



## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయం!

**డెహ్రాడూన్, ఫిబ్రవరి 26:** కేదార్‌నాథ్‌దామ్ తెరుచుకోవడంతో చార్‌ధామ్‌యాత్ర ప్రారంభం అవుతున్నది. శివరాత్రి పర్వదినంనుంచే కేదార్‌నాథ్ ఆలయం తెరుచుకుంటున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేదార్‌నాథ్ ధామ్ దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో ఒకటి. ఈ 12 జ్యోతిర్లింగాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి.

అవి గుజరాత్‌లోని సోమనాథ్ నాగేశ్వర్ ఆలయం, ఆంధ్రప్రదేశ్‌లోని మల్లి ఖార్జున ఆలయం, మధ్యప్రదేశ్‌లోని మహాకాళేశ్వర, ఓంకారేశ్వర ఆలయం, ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం, మహారాష్ట్రలోని భీమశంకర, త్రయంబకేశ్వర ఆలయం, యూపిలోని కాశీ విశ్వనాథ ఆలయం జార్ఖండ్‌లోని వైద్యనాథ ఆలయం తమిళనాడులోని రామేశ్వరం మహారాష్ట్రలోని ఘృష్ణేశ్వర్ ఆలయాలు ఉన్నాయి. కేదార్‌నాథ్ ధామ్ ఉత్తరాఖండ్‌లోని నాలుగు ధామ్‌లలో ఒకటి. కేదార్‌నాథ్ ఆలయం రుద్రప్రయాగ జిల్లాలోని గౌరికుండ్‌కు 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పురాతన ఆలయానికి సంబంధించిన ప్రస్తావన మహాభారత కాలంలోనే కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని ఆదిగురు శంకరాచార్యులు 8-9 శతాబ్దాల మధ్యకాలంలో నిర్మించారని చెపుతారు.

## జీవితకాలం వేటు అనేది పార్లమెంటు పరిధిలోనిదే!

### సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** జైలుశిక్షపడిన రాజకీయ నాయకులను మళ్లీ ఎన్నికల్లో పోటీచేయకుండా జీవితకాలం వేటు వేయాలన్న పిటిషన్‌ను కేంద్రం వ్యతిరేకించింది. ఇలాంటి అనర్హత వేటు అనేది పూర్తిగా పార్లమెంటు పరిధిలో ఉంటుందని వాదించింది. ఇందుకు సంబంధించి కోర్టులో అఫిడవిట్ దాఖలుచేసింది. సుప్రీంలో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో జైలుశిక్షపడిన నాయకులు మళ్లీప్రత్యక్ష ఎన్నికల్లోను, రాజకీయాల్లోను పోటీ చేయకుండా ఉండేవిధంగా నిషేధం ప్రకటించాలని డిమాండ్‌చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంటు ప్రత్యేక చట్టంరూపొందించాలని ఆదేశించే అధికారం సుప్రీంకు ఉందని, అయితే ఈ వ్యవస్థ మొత్తం పార్లమెంటరీ వ్యవస్థపరిధిలోనిదని కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది.

జీవితకాలం వేటు అని సరైనదే కానీ అయితే ఈ అంశం పూర్తిగా పార్లమెంటు పరిధిలోనిదని అఫిడవిట్‌లో కేంద్రం ప్రకటించింది. ఒక నిర్దిష్ట సమయంపాటు వేసిన జరిమానా విధించడం సబబేకాని అనవసర వేధింపులు ఉండకూడదని కేంద్రం తన వాదనను వినిపించింది. జరిమానాలు అనేవి నిర్దిష్ట సమయం పాటు ఉండాలన్నదే తమ అభిమతమని కొంతకాలం లేదా స్పష్టమైన కాలాన్ని పేర్కొంటూ విధించడం పార్లమెంటరీ వ్యవస్థలో కొనసాగుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఉన్న విధానాన్ని మార్పిడి చేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచి నట్లవుతుందని అన్నారు. న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ ఇందుకు సంబం ధించి పిటిషన్ దాఖలుచేసారు.

శిక్షలుపడిన నేతలను జీవిత కాలంపాటు నిషేధం విధిస్తూ ఆదేశాలు ఇవ్వాలని ఆయన పిటిషన్ దాఖలు చేసారు. ఎంపి, ఎమ్మెల్యే లపై ఉన్న కేసులు సత్వరమే విచారణ జరిపించి దోషులని తేలితే వెంటనే శిక్షలుపడేలా చేయాలని ఆయన కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 8(1) ప్రకారం ఆరేళ్ల పాటు బహిష్కరించవచ్చని ఉన్నదని నాయకుడికి శిక్షపడిన తేదీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరణ ఉంటుందని, ఉత్తర్వులు జారీచేసిన రోజునుంచే ఆరేళ్లపాటువర్తిస్తుందని కేంద్రంవాదనలు వినిపించింది. జీవితకాలం నిషేధంఅనేది చాలాఎక్కువ మొత్తం శిక్ష అని నేరస్తులకు శిక్షలు ఉండాలే కానీ ఆవ్యవస్థమొత్తం పార్లమెంటుపరిధిలోనే ఉంటుందని కేంద్రం వాదనలు వినిపించింది.

## 'గ్రేట్ పేట్రియాటిక్ వార్' వార్షికోత్సవానికి ప్రధాని మోడీ!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ప్రధాని నరేంద్రమోడీ మరోసారి రష్యాలో పర్యటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అక్కడ జరగనున్న గ్రేట్ పేట్రియాటిక్ వార్ 80వ వార్షికోత్సవ పరేడ్‌లో ఆయన పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అక్కడి వార్తా సంస్థ టాస్ వెల్లడించింది. టాస్ ప్రకారం మే 9న మాస్కోలోని రెడ్ స్క్వేర్ వద్ద గ్రేట్ పేట్రియాటిక్ వార్ 80వ వార్షికోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి మోడీ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. భారత సైనికదళం సైతం కవాతు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే దీనిపై విదేశాంగ శాఖ ఏ ప్రకటన చేయలేదు. ఇక ఈ పరేడ్‌కు వివిధ దేశాల అధినేతలను ఆహ్వానిస్తున్నట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఇదిలాఉండగా గతేడాది అక్టోబర్‌లో మోడీ రష్యాలో పర్యటించారు. కజన్ వేదికగా జరిగిన 16వ బ్రిక్స్ శిఖరాగ్రసదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆ దేశాధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలుపవురు దేశాధినేతలతో మోడీ చర్చలు జరిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రసంగించిన మోడీ దౌత్యం, చర్చలకు భారత్ మద్దతిస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులు, ఆర్థిక అస్థిరత, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి పలు సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మొదలై మూడేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు అమెరికాతో సహా పలు దేశాలు కృషిచేస్తున్నాయి. ఈక్రమంలో మోడీ మాస్కోలో పర్యటనకు వెళ్లడం గమనార్హం.

## ఎలాన్ మస్క్ పౌరసత్వం రద్దు!

### ఆ దిశగా కెనడా అడుగులు



**ఒట్టావా, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో గుర్రుగా ఉన్న జస్టిన్ ట్రూడో ప్రభుత్వం తాజాగా డోజ్ సారథి మస్క్‌పై చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు విదేశీ ప్రభుత్వంతో కలిసి కెనడా సార్వభౌమత్వాన్ని తుడిచిపెట్టడానికి యత్నించారంటూ ఆయన ఆరోపణలు చేస్తూ హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఓ పిటిషన్ దాఖలైంది దీంతో మస్క్ కెనడా పౌరసత్వాన్ని, పాస్‌పోర్టును రద్దు చేయాలన్న అంశాన్ని పరిశీలిస్తోంది.

ఇప్పటికే ఈ పిటిషన్‌పై 2,82,037 మంది కెనడా పౌరులు సంతకాలు చేశారు. ప్రధాని జస్టిన్ ట్రూడోను ఉద్దేశించిన ఈ పిటిషన్ జూన్ 20 వరకు ఓపెన్‌గా ఉంటుంది. రచయిత క్యూలియా రీడ్, ఎన్డీపి పార్లమెంట్ సభ్యుడు చార్లే ఆంగస్ దీనిని తయారు చేశారు. కెనడా జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసేలా మస్క్ చర్యలు ఉన్నాయని దానిలో ఆరోపించారు. 'ప్రస్తుతం మస్క్ విదేశీ ప్రభుత్వంలో భాగస్వామిగా అయ్యారు. కెనడా సార్వభౌమత్వంపై దాడికి యత్నించారు' అని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై మస్క్ స్పందించారు. 'కెనడా నిజమైన దేశం కాదు' అని ఎక్స్‌లో పోస్టు చేసి.. ఆ తర్వాత దానిని డిలీట్ చేశారు. తమ దేశ పౌరుడు ఏదైనా మోసానికి పాల్పడినా.. ఇమిగ్రేషన్ శాఖకు తప్పుడు సమాచారం తెలియజేసినా పౌరసత్వాన్ని రద్దు చేసే అధికారం కెనడా ప్రభుత్వానికి ఉంది. టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్‌కు ఇప్పుడు దక్షిణాఫ్రికా పౌరసత్వం ఉంది. అక్కడే ఆయన జన్మించారు. 1989లో వారి కుటుంబం కెనడా వలస రావడంతో అక్కడ సిటిజన్‌షిప్ వచ్చింది. ఆ తర్వాత 2002లో అమెరికా వాసిగా మారారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమెరికా-కెనడా మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. కొన్నాళ్లుగా ట్రంప్ కెనడాను 51వ రాష్ట్రంగా పేర్కొంటోంది. దీనికి తోడు ఆ దేశాన్ని బెదిరిస్తూ అదనపు టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే.

### మహాకుంభమేళాలో పాల్గొనని ఉద్ధవ్‌ఠాక్రే, రాహుల్‌ను

## హిందూ ఓటర్లు బహిష్కరించాలి

### కేంద్ర మంత్రి రాందాస్ అథవాలె వివాదాస్పద వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలె వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే మహాకుంభమేళాను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారన్నారు. అందుకుగాను హిందూ ఓటర్లు వారిని బహిష్కరించాలని, ఎన్నికల్లో వారి పార్టీలకు ఓట్లు వేయవద్దని అన్నారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే ఠాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండిపడ్డారు. ఈ విషయంలో వారు కనీసం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందని వ్యాఖ్యానించారు.

ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి, ఉద్ధవ్ ఠాక్రేకి తగిన గుణపాఠం చెప్పినా వారి తీరులో ఎటువంటి మార్పులు లేదని దుయ్యబట్టారు. జనవరి 12న ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహాకుంభమేళా నేటితో ముగియనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కోట్లాదిమంది భక్తులతోపాటు పలువురు రాజకీయ నేతలు, వ్యాపార, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు.

## సుందర్బనిలో ఆర్మీ కాన్వాయ్‌పై మిలిటెంట్ల కాల్పులు

**శ్రీనగర్,ఫిబ్రవరి 26:** జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలోని సుందర్బని ప్రాంతంలోమిలిటెంట్లు ఆర్మీ వాహనంపై కాల్పులుజరిపారు. ఆర్మీ కాన్వాయ్‌లో భాగంగా ఉన్న ఈ వాహనంపై మిలిటెంట్లు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. సుందర్బని ప్రాంతంలోని ఫాల్ గ్రామంలో ఈసంఘటన జరిగింది. అయితే ఎలాంటి ప్రాణహాని జరిగినట్లు లేదని ఆర్మీ స్పష్టం చేసింది. ఉగ్రవాదులు సమీపంలోని అడవిలో నక్కి ఉన్నారని, కొన్ని రౌండ్లు ఆర్మీ వాహనంపై కాల్పులు జరిపారని ఆర్మీ వెల్లడించింది. ఈప్రాంతనుంచే మిలిటెంట్లు చొరబడుతుంటారని అందుకే ఇక్కడ గస్తీ ముమ్మరం చేసామని, కాన్వాయ్ గాలింపుచర్యల్లో ఉన్నందువల్లనే మిలిటెంట్లు ఈ కాల్పులకు తెగబడినట్లు జాయింట్ ఆపరేషన్ అధికారులు చెపుతున్నారు. అయితే ఆర్మీకూడా ప్రతిగా కాల్పులుజరిపింది. అంతేకాకుండా కాల్పులు వస్తున్నవైపు దూసుకు వెళ్లిన ఆర్మీ వారిని మట్టుబెట్టేందుకు ఆప్రాంతం చుట్టుముట్టారు. ఈప్రాంతం మొత్తం తమ అధీనంలోకి తీసుకుని కార్డన్ సర్చ్ చేస్తోంది. తదుపరి వివరాలు అందాల్సి ఉంది.

## రన్‌వేపైకి ఏకకాలంలో రెండు విమానాలు

### తృటిలో తప్పిన ప్రమాదం



**చికాగో, ఫిబ్రవరి 26:** అమెరికాలోని చికాగోలో పెను విమానప్రమాదం తప్పింది. మిడ్‌వే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో రెండు విమానాలు దాదాపు ఢీకొనబోయాయి. అయితే పైలట్ అప్రమత్తతతో తృటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం 8.50 గంటల సమయంలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ విమానం 2504 ఒమాహానుంచి చికాగో మిడ్‌వే ఎయిర్‌పోర్టుకు చేరుకుని రన్‌వేపై ల్యాండ్ అయ్యేందుకు సిద్ధమైంది. విమాన చక్రాలుకూడా రన్‌వేకి తాకాయి.

ఇక అదే సమయంలో రన్‌వేపై ఒక ప్రైవేటు జెట్ ఉన్నట్టుండి ఆ విమానానికి అడ్డంగా వచ్చింది. దీన్ని గమనించిన సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ పైలట్ వెంటనే అప్రమత్తం అయి విమానాన్ని టేకాఫ్ తీసుకున్నారు. దీనితో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ దృశ్యాలు ఇపుడు నెట్టింట వైరల్ అయ్యాయి.

# తెలంగాణలో యూరియా కొరత లేదు

## రాష్ట్ర సర్కారు అసమర్థతే కారణం

## అడిగిన దానికంటే ఎక్కువ ఇచ్చాం

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎక్కడా ఎరువుల కొరత లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో కెల్లా తెలంగాణకే అత్యధికంగా ఎరువుల సరఫరా చేస్తున్నామని చెప్పారు. యూరియాను రైతులకు సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అయితే కావాలనే కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎరువుల కొరతపై మీడియాలో కథనాలు రావటంతో తాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో సంప్రదించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువ కోటా ఎరువులు విడుదల చేశామని తేల్చిచెప్పారు. 2024-25 యాసంగి సీజన్లో 9.5 లక్షల టన్నుల యూరియా అవసరమైతే, 10 లక్షల టన్నులను కేంద్రం పంపించిందని వివరించారు. ఈ విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత పదేళ్లుగా దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. పాత అలవాటు ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి 27 శాతం అధికంగా సరఫరా చేశామన్నారు. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ఈ నెల 22వ తేదీ వరకు కూడా తెలంగాణలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 27.37 శాతం అధికంగా ఎరువులను రాష్ట్రానికి సరఫరా చేశామన్నారు. ఈ నెల 22వ తేదీన 40 వేల టన్నుల యూరియాను కేంద్రం అదనంగా పంపించిందని వెల్లడించారు. అలాగే 23, 24 తేదీల్లో అదనంగా మరో 48 వేల టన్నుల యూరియా పంపిస్తున్నట్లు కేంద్రం తెలిపిందని వివరించారు. లెక్క ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో ఇంకా 1.22 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలియచేశారు. ఇదిగాక మరో 6 వేల టన్నులు కృష్ణపట్నం పోర్టు నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.



పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దంపతులు

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క దంపతులు

**వైరా, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమంగా ఉండాలని ఆ శివపార్వతులను వేడుకున్నట్టు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు అనానరు. బుధవారం ఆయన శ్రీమతి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని పురాతన శివాలయంలో మధిర నియోజకవర్గ కేంద్రంలోని శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దేశప్రతిపక్ష నేత రాహుల్‌గాంధి తండ్రి రాజీవ్‌గాంధి కుటుంబం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘు రామిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైరనమన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మున్సిపాల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి26:** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు గరళకంఠుని దీవెనలు ఉండాలని ప్రార్థించారు. పవిత్ర శివరాత్రి సందర్భంగా శివ భక్తులు ఉపవాస దీక్షను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించడం హిందూ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకుందని కేసీఆర్ అన్నారు. దేశ వ్యాప్తంగా శివాలయాలు, భక్తుల శివనామస్మరణతో మారుమోగుతాయని అన్నారు. గరళాన్ని తన కంఠంలో దాసుకుని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమా శంకరుని కరుణా కటాక్షాలు తెలంగాణ ప్రజల కుండాలని ఆకాంక్షించారు. సుఖశాంతులతో జీవించేలా ప్రజలందరినీ దీవించాలని కేసీఆర్ ఆ మహాశివున్ని ప్రార్థించారు.

# రాష్ట్రంలో అత్యధికంగా 16,506 మెగావాట్లు వినియోగం

## కరెంటు డిమాండ్‌లో తెలంగాణ ఆల్‌టైమ్ రికార్డు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** కరెంటు వినియోగం తెలంగాణ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. రోజు రోజులకూ రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ బుధవారం రికార్డు స్థాయిలో నమోదైంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 08:03 గంటలకు 16506 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండు నమోదైంది. ఇదే నెలలో 21వ తేదీ మధ్యాహ్నం 12.02 గంటలకు 16412 మెగావాట్ల మేర రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చోటు చేసుకుంది. ఇంకా వేసవి కాలం ప్రారంభం కాకముందే ఈ విధంగా విద్యుత్ వినియోగం జరిగితే మార్చి నెలలో ఏ మేరకు ఉంటుందనేదానిపై విద్యుత్ శాఖ అధికారవర్గాల్లో కలవరానికి గురి చేస్తోంది. అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండు నేపథ్యంలో విద్యుత్ పంపిణీ సంస్థలు అప్రమత్తమయ్యాయి. భారీ స్థాయిలో నమోదవుతున్న విద్యుత్ డిమాండును దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది వేసవి కాలంలో ఎలాంటి సమస్యలు లేకుండా విద్యుత్ సంస్థలు దీటుగా ఎదుర్కోనేందుకు సిద్ధమవుతున్నాయి. 17000 మెగావాట్ల డిమాండ్ ఏర్పడినా దాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. డిమాండు ఎంతగా పెరిగినా దానికి తగ్గట్టు విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రకటించాయి. ఇక రాష్ట్రంలో ఈ ఏడాది వేసవి ఎండల తీవ్రత ముందుగానే పెరిగిపోవడం, భూగర్భ జలాల వినియోగం పెరుగుతుండటం, జల వనరుల్లో నీటి మట్టాలు వేగంగా తరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో దీనికి తగినట్లు యాసంగి వ్యవసాయ సీజన్‌కు సంబంధించి విద్యుత్తు డిమాండ్ తోడవడంతో రాష్ట్రంలో వినియోగం అనూహ్యంగా పెరుగుతోందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# శివనామస్మరణతో మార్మోగిన కీసరగుట్ట



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామిని మహాశివరాత్రి సందర్భంగా దర్శించుకుని శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు.

## మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం

## ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, ఎంపి ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రంగా పిలవబడుతున్న కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భారీ సంఖ్యలో భక్తులు కీసరగుట్టకు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24న ప్రారంభమై మార్చి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే పెద్దఎత్తున భక్తులు రాక ఆరంభమైంది. పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీరామలింగే శ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారంరాత్రి ఘనంగా జరుగగా స్వామివారికి ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్మన్ పి.సునీతామహేందర్‌రెడ్డి పట్టువస్త్రాలను, ఒడిబియ్యం, తలంబ్రాలను తీసుకువచ్చారు. అదేవిధంగా మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కూడ పట్టువస్త్రాలను సమర్పించారు. దీనిలో పిసిసి ఉపాధ్య క్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వారంతా స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ గౌతమ్, ఆ తరువాత మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

# భక్తుల రద్దీతో కిటకిటలాడిన శివాలయాలు

## హరోంహర నామస్మరణతో దద్దరిల్లిన ఆలయాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** శివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి.తెలంగాణలోని వేములవాడ, కీసర రామలింగేశ్వర స్వామి,ఏడుపాయల వన దుర్గాభవాని అమ్మవారు, రామప్ప, సూర్యాపేట జిల్లాలోని మేళ్ళచెరువు స్వయంభూ లింగేశ్వర స్వామి దేవస్థానం, నల్గొండ సమీపంలోపి పానగల్లలో ఉన్న పచ్చల సోమేశ్వర దేవస్థానం, పాలకుర్తిలోని వెయి స్తంభాలగుడి, మెట్టుగట్ట దేవాలయం, కాశిబుగ్గ ఆలయం, భద్రకాళి తదితర దేవస్థానాల్లోనే కాకుండా ఏపీలోని శ్రీశైలం,శ్రీకాళహస్తి, కోటప్పకొండ తదితర దేవాలయాలు భక్తుతో కిటకిటలాడుతున్నాయి. ఆయా దేవాలయాల్లో భక్తులు ఉదయమే పుణ్యస్నాం చేసి పరమ శివుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉత్సవాలను పరస్కరించిని ఆయా దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎక్కడిక్కడే మంచి నీటి వసతి కల్పించడమే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చని వారు కొంత సమయం విశ్రాంతి తీసుకునేందుకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు.

భక్తుల సౌకర్యార్ధారం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అధికారులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాటిలో భాయంగా ఆయా ప్రాంతాల మీదుగా వెళ్ళే వాహనాలను దారిమళ్ళించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముఖ్యంగా నదీ తీర ప్రాంతాలకు సమీపంలో ఉన్న శైవలయాలు వద్ద అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వీటిలో భాగంగా ఆయా ప్రాంతాల వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా భక్తుల రద్దీకి అను అనుగుణంగా నదుల్లో బారీ కేడ్లను ఏర్పాటు చేశారు. లోతుగా ఉన్న ప్రాంతాల్లో స్నానాలు చేయవవద్దని మైకలలో ఏనౌన్స్‌మెంట్‌లు చేస్తూ ఎప్పటికప్పడు భక్తులను అలర్ట్ చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమాయాల్లో నదీ తీర ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తూ చేయడమే కాకుండా ప్రత్యేక బోట్లను ఏర్పాటు చేసుకుని భక్తులను అనుక్షణం అప్రమత్తం చేస్తున్నారు.

### భారీగా పెరిగిన పూలు, పళ్ల ధరలు

శివారాత్రి సందర్భంగా పూలు, పళ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. సాధారణ రోజుల్లో డజన్ అరటి పళ్ళ ధర రూ.50 నుంచి 60 వరకు ఉండగా వాటి ధరను అమాంతంగా 80 నుంచి 100వరకు అమ్ముతున్నారు. అదే విధంగా కొబ్బరి కాయల ధర సాధారణ రోజుల్లో రూ.25 నుంచి 30 వరకు ఉండగా ప్రస్తుతం 40 నుంచి 55 వరకు అమ్ముతున్నారు.

బంతి, చామంతి ఇతర పూలు సాధర రోజుల్లో కేజి రూ.100 నుంచి 125 వరకు ఉండగా, ప్రస్తుతం వాటిని కేజి రూ.200 నుంచి 250 వరకు అమ్ముతున్నారు.

ఈ విధంగా దేని ధరం చూసినా అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇటువంటి సమయంలోనే కదా మాకు నాలుగు రూపాయాలు అధికంగా వచ్చేది అంటూ తెలివిగా సమాధానం చెబుతున్నారు.

# వ్యవసాయ కార్మికులకు భరోసా విడుదల

## ఇప్పటి వరకూ రూ.50.65 కోట్లు చెల్లింపు


**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని వ్యవసాయ కార్మికులైన లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది. ఈ మేరకు బుధవారం మొత్తం 66,640 మంది కూలీల ఖాతాల్లో 39.74 కోట్ల రూపాయలను జమ చేసింది. ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు 50.65 కోట్ల రూపాయలను చెల్లించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు జమ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాగా ఈ ఏడాది జనవరి 26వ తేదీన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని రాష్ట్ర సర్కార్ ప్రారంభించింది. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో నిధులు 18,180మందికి 6 వేల రూపాయల చొప్పున జమ చేసింది. ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. దీంతో ఎన్నికల కమిషన్‌ను అనుమతి కోసం లేఖ రాయగా, అందుకు అంగీకరించింది. దీంతో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని లబ్ధిదారులకు నిధులు విడుదల చేసింది.

ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనున్న ప్రభుత్వం స్పష్టం చేసింది. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న వ్యవసాయ కార్మికులకు పెద్దదిక్కుగా నిలుస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

# బసవతారకంలో అత్యాధునిక పరిశోధన కేంద్రానికి రూ. 10 కోట్ల విరాళం

## తొలి విడతగా రూ. 5 కోట్ల చెక్కు బాలకృష్ణకు అందించిన దాతలు



బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణకు విరాళం చెక్కును అందజేస్తున్న డా. రాఘవేంద్రప్రసాద్, శ్రీమతి కళ్యాణిప్రసాద్ దంపతులు

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ వారు కేన్సర్‌పై పరిశోధనలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తమ పరిశోధన విభాగమైన ఇండో అమెరికన్ కేన్సర్ రీసెర్చి ఫౌండేషన్‌ను భారీఎత్తున విస్తరిస్తూ అత్యాధునిక పరిశోధనా పరికరాలను సమకూర్చుకోవాలని నిర్ణయించింది. పరిశోధనలకు పెద్దపీట వేయాలని నిర్ణయించిన సంస్థ నిర్ణయానికి ఊతమిస్తూ డా. రాఘవేంద్రప్రసాద్, శ్రీమతి కళ్యాణిప్రసాద్ దంపతులు రూ. 10 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. ఈ నిధులతో హాస్పిటల్ ఆవరణలో సరికొత్తగా ఏర్పాటు చేస్తున్న పరిశోధనా విభాగాన్ని అత్యాధునిక సాంకేతికతో కూడిన పరికరాలు కొనుగోలు, పరిశోధనల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, పరిశోధనలను చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సరి కొత్త పరిశోధనాశాలను శ్రీమతి కళ్యాణిప్రసాద్ పరిశోధనాలయంగా పేరు పెట్టనున్నారు. విరాళాన్ని లాంఛనంగా అందు కొనేందుకు ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ముందుగా ఆహూతులకు, దాతలకు స్వాగతం పలుకుతూ డా. కె కృష్ణయ్య మాట్లాడుతూ హాస్పిటల్ చేస్తున్న సేవలను, 25 యేళ్లుగా సాగుతున్న సంస్థ ప్రయాణాన్ని వివరించారు. అలాగే చికిత్సతోపాటు పరిశోధన లకు మొదటి నుండి హాస్పిటల్ పెద్దపీట వేస్తోందని, అయితే నిధుల కొరత కారణంగా కొంత ఆలస్యమైనా ప్రస్తుతం దాతల ద్వారా అందిన సహాయంతో దీనిని వేగవంతం చేస్తామన్నారు. అనంతరం నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ముందుగా సభికులకు, ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంస్థను స్థాపించే సమయంలో పేదలకు అందుబాటైన ధరలలో ప్రపంచస్థాయి కేన్సర్ చికిత్స అందించాలనేది మొదటి లక్ష్యమైతే ఆ మహమ్మారి వ్యాధిపై పరిశోధ నలు చేయడం ద్వారా వ్యాధిని నిరోధించడంతోపాటు దేశ అవసరాలకు అను గుణంగా వ్యాధి కారకాలపై పరిశోధనలు చేయాలనేది మరో లక్ష్యంగా చేర్చామని చెప్పారు.



# వేములవాడ రాజన్నను దర్శించిన 3 లక్షల భక్తులు

**వేములవాడ, ప్రభాతవార్త :** వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 4గంటలకు ఆలయశుద్ధి, మంగళవాయిద్యాల తర్వాత సుప్రభాతసేవ నిర్వహించారు. ప్రాతఃకాల పూజానంతరం అనువంశిక అర్చకులకు దర్శనాలకు అనుమతించారు. వేకువజామునుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి ఒకరోజు ముందే చేరుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలను రద్దుచేసి, నిరంతర దర్శనాలను కల్పించారు. క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దర్శనానికి 10 గంటల సమయం పట్టింది. మూడులక్షల పైచిలుకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి శివస్వాములకు దర్శనానికి ప్రవేశం కల్పించారు. మాల ధారణ వేసుకున్న శివభక్తులు స్వామివారి పాటలు పాడుకుంటూ ఆట పాటలతో ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారని, శివ నామస్మరణతో రాజన్న ఆలయం మార్మోగింది. భక్తులతో ఆలయ ప్రాంగణాలన్ని కిక్కిరిసిపోయాయి. గుడి చెరువులో ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. సాయంత్రం 6 గంటలకు కల్యాణ మండపంలో స్థానాచార్యుల ఆధ్వర్యంలో 365 మట్టి ప్రమిదలతో 11 మంది అర్చకులచే వైభవంగా మహాలింగార్చన గావించారు. రాత్రి 11.30కు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం కోటి 75 లక్షలతో అన్ని ఏర్పాట్లు చేశామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామివారి దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవున్ని కోరినట్లు తెలిపారు.



తలంబ్రాలు తీసుకొస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

# శివనామ స్మరణతో పులకించిన కాళేశ్వరం

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** శివనామ స్మరణతో కాళేశ్వర క్షేత్రం పులకించింది. మహాశివరాత్రి వేడుకలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం, కోటగుళ్లు, నైనగుళ్లతోపాటు ఇతరత్రా శైవక్షేత్రాలు అలరారాయి. పరమశివుడి స్మరణలో భక్తులు తరించారు. జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు బుధవారం కన్నుల పండువగా జరిగాయి. వేకువజామునే భక్తులు శివాలయాలకు తరలివెళ్లారు. అర్చనలు, అభిషేకాలతో పూజలు చేశారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి.

ప్రసిద్ధి గాంచిన శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 10 గంటలకు మంగళ వాయిద్యాలతో దీపారాధన, గణపతిపూజ, స్వస్తి పుణ్యా హవచనం రక్షాబంధనం, దీక్షా వస్త్రధారణ రుత్విగ్వరణం మృత్సంగ్రహణం, దేవతారాధన నవ కలశారాధన, నవగ్రహారాధనం, మండప దేవతారాధన, వృషభ ధ్వజారోహణం కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠ రుద్రహవనం, రాత్రి 8 గంటలకు ఊరేగింపు, ఎదురుకోలు సేవ, రాత్రి 8:30 నిమిషాలకు ప్రసిద్ధ కళాకారులచే భక్తిసంగీత కార్యక్రమాలు జరిగాయి. మహశివరాత్రి సందర్భంగా కాళేశ్వరంలో శ్రీ శుభానంద-ముక్తీశ్వరుల కళ్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవోపేతంగా నిర్వ హించారు.

ఆనావాయితీ ప్రకారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.. ఇఒ కార్యా లయం నుంచి ముత్యాల తలంబ్రాలను తలపై పెట్టుకొని కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణతంతు జరిపించారు. ప్రభుత్వం తరపున స్వామి వారికి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

# రేపు బిసి రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బిసి హక్కుల సాధన సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు తెలిపారు. బుధవారం ఆయన నగరంలోని మగ్దూం భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ...దేశంలో జరగబోయే జనాభా లెక్కలతో పాటు కుల జనగణన కూడా చేయాలనీ, దామాషా ప్రకారం చట్టసభల్లోనూ, విద్యా వైద్యం ఉపాధి రంగాల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణనలో 3.1 ప్రజలు పాల్గొనకపోవడం వలన ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నమోదు చేసుకొనే అవకాశం కల్పించిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిపిఐ ఎంఎల్‌ఏ కూనం నేని ప్రారంభించనున్న ఈ సమావేశంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు,బిసి సంక్షేం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్,ప్రొఫెసర్ వై ప్రభంజన్‌యాదవ్, సామాజిక న్యాయ జేఏసీ,దాసు సురేష్ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు,బొమ్మ గాని ప్రభాకర్ ఐఏఎల్ జాతీయ ప్రధానకార్యదర్శి,మేకపోతుల నరేందర్ గౌడ్, బిసి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు సర్వశక్తులు ఒడ్డండి

## జూమ్ మీటింగ్‌లో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ కార్యకర్తలకు పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిచేందకు కార్యకర్తలు సర్వశక్తులుఒడ్డి పని చేయాలని టిపిసిసి చీప్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ నాయకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు.ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని పార్టీ మండల అధ్యక్షులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన చర్చించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 55వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని భవిష్యత్‌లో ఖాళీలను భర్తీ చేస్తుందని యువకులకు తెలుపాలని సూచించారు. విద్య ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలలో కాంగ్రెస్ పట్ల నెలకొన్న సానుకూలతను పోలింగ్‌లో ఓట్ల రూపంలో మలుచుకొనేందుకు పార్టీ నాయకులు కృషిచేయాలని సూచించారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ పట్టభద్రలు ఎమ్మెల్సీ స్థానాలు రెండిటింటికి గురువారం ఎన్నికలు జరుగు తుండటంతో పార్టీకి అనుబంధంగా ఉండే వారు గెలిచేలా టిపిసిసి చీఫ్ మండల స్థాయి నాయకులకు సూచనలు చేశారు.

### మీనాక్షి నటరాజన్‌కు స్వాగత తోరణాలు ఏర్పాటు చేయవద్దు

తెలంగాణ ఇన్‌చార్జిగా నియామకమైన తరువాత రాష్ట్రానికి తొలిసారి వస్తున్న మీనాక్షి నటరాజన్‌కు స్వాగత తోరణాలు ఏర్పాటు చేయవద్దని టిపిసిఇ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో జరిగే టిపిసిసి విస్తృస్థాయి కార్యవర్గ సమావేశం అత్యంత నిరాడంబరంగా జరగుతుం దని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ తెలిపారు. నూతన ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మొదటిసారి తెలంగాణకు వస్తుండటంతో ఎలాంటి హంగులు ఆర్భాటాలు ఉండవద్దని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ ఆదేశించారు. ఫ్లెక్సీ లు బోకెలు, శాలువలు తెచ్చి సన్మానాలు వంటివి చేయవద్దని ఆయన తెలిపారు. ఎక్కడ కూడా ఆడంబరం ప్రచారం చేయకూడదని సాధారణ కార్యవర్గ సమావేశం వలె జరుగుతుందని తెలిపారు.

# యాసంగిలో 9.80 లక్షల టన్నుల యూరియా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ప్రస్తుత యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 9.80 లక్షల టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో యాసంగి ప్రారంభం నుండి ఇప్పటి వరకు ప్రారంభ నిల్వలతో సహా 9.08 లక్షల టన్నుల యూరియాను కొనుగోలు చేశామన్నారు. ఇంత వరకు రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన 8.54 లక్షల టన్నుల యూరియాలో, 7.27 లక్షల టన్నులను రోడ్డు మరియు రైలు ద్వారా సరఫరా చేసిందని వివరించారు. కాగా గత విత్తనాల సీజన్‌తో పోలిస్తే ఈ సారి మొక్కజొన్న తదితన రకాల విత్తనాల పరిమాణం 6.25 లక్షల ఎకరాలు పెరిగిందని చెప్పారు. ఈ సీజన్‌లో గత ఏడాది కంటే 1.99 లక్షల టన్నుల యూరియాను ఎక్కువగా కొనుగోలు చేశారని వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, దేశీయ కంపెనీల నుండి నెలకు 1.80 లక్షల టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరడమైందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.11 లక్షల టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులకు నిరంతరాయంగా యూరియా సరఫరాను సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# బీహార్ కేబినెట్ విస్తరణలో ఏడుగురు బిజెపి ఎమ్మెల్యేలకు చోటు



**పాట్నా, ఫిబ్రవరి 26:** బీహార్ సీఎం నితీశ్‌కుమార్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా ఏడుగురు బిజెపి ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలోస్థానం ఇచ్చారు. ఈ ఏడాది నవంబరులోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఇపుడు సీఎం నితీశ్ తన కేబినెట్‌ను విస్తరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నితీశ్‌కేబినెట్‌లో చేరిన బిజెపి ఎమ్మెల్యేల్లో సంజయక్షసరోగి, సునీల్‌కుమార్, జిబేశ్‌మిశ్రా, మోతీలాల్‌ప్రసాద్, క్రిషన్‌కుమార్ మాంటూ, రాజుకుమార్‌సింగ్, విజయ్‌కుమార్ మండల్‌లు ఉన్నారు. వారంతా బుధవారం సాయంత్రం 4 గంటలకు రాజ్‌భవన్‌లోప్రమాణాలుచేసారు. బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ వారందరిచేత ప్రమాణంచేయించారు. బీహార్ బిజెపి అధ్యక్షుడుగా ఎన్నికవడంతో రాష్ట్ర రెవెన్యూ మంత్రి దిలీప్ జైస్వాల్ తన పదవికి రాజీనామాచేస్తున్నట్లుప్రకటించారు. ఒక వ్యక్తికి ఒకే పదవి అనే పార్టీ పాలసీకి అనుగుణంగా తాను రాజీనామాచేస్తున్నట్లు తెలిపారు. ఇపుడు ఆరుగురు కొత్తగా మంత్రులుగాప్రమాణంచేసారు. జైస్వాల్‌రాజీనామాచేస్తే బీహార్‌మంత్రిర్గంలోమొత్తం ఆరుగురు మంత్రులు అదనంగా వచ్చి చేరుతున్నారు. కోర్‌కమిటీతో బిజెపి జాతీయ అధ్యక్షుడు సమావేశం అయిన తర్వాత ఈ విస్తరణ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. భూమిహార్, రాజ్‌పుత్, కుర్మి సామాజిక వర్గాలకు విస్తరణలోస్థానం దక్కింది.



# గవర్నర్ హెచ్చరికతో ఆయుధాలు అప్పగిస్తున్న ప్రజలు

**ఇంపాల్, ఫిబ్రవరి 26:** మణిపూర్‌లోని కొండ, లోయప్రాంతాలప్రజలు స్వచ్ఛదంగా ఆయుధాలు అప్పగించాలన్న గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాపిలుపునకు వారు స్పందిస్తున్నారు. దోచుకున్న చట్టవిరుద్ధంగా కలిగిన ఆయుధాలుప్రజలు పెద్ద సంఖ్యలో అప్పగిస్తున్నారు. 25నాటికి 12 సిఎంజి తుపాకులు, 303 రైఫిల్స్ రెండు, రెండుఎస్ఎల్ఆర్ రైఫిల్స్,4 ఎస్‌బిబిఎల్‌రైఫిల్స్, 303 రైఫిల్స్ మ్యాగజైన్లురెండు, సిఎంజి గన్ మ్యాగజైన్లు, 12 ఎస్ఎల్ఆర్‌రైఫిల్స్ మ్యాగజైన్లు, ఒక ఐఇడి, 3030 రైఫిల్స్‌కు సంబంధించి 33 లైవ్ రౌండ్లు ఎస్ఎల్ఆర్ రైఫిల్స్‌కు సంబంధించి 32 లైవ్‌రౌండ్లు, ఎస్‌బిబిఎల్‌రైఫిల్స్‌కు సంబంధించి ఐదు లైవ్‌రౌండ్లనుప్రజలు అప్పగించారు., ఇంపాల్‌లోని భద్రతా దళాలు వీటిని ప్రదర్శించారు. మణిపూర్‌లో ఏడాదిన్నరకుపైగా మైయిటీ కుకీ జాతులమధ్య ఘర్షణలు జరిగాయి. వందలాదిమంది మరణించగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. చివరకు ఫిబ్రవరి 9న సీఎం బీరేన్‌సింగ్ తన పదవికి రాజీనామాచేసారు. అక్కడిపరిస్థితుల దృష్ట్యా ఈనెల 13నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కేంద్రం అమలుచేస్తోంది. ఈనెల 20న గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా కీలకప్రకటనచేస్తూ లూఠీచేసిన చట్టవిరుద్ధంగా తమవద్ద ఉన్న ఆయుధాలు, సామగ్రిని వారంరోజుల్లోప్రజలు స్వచ్ఛందంగా అప్పగించాలనిపిలుపునిచ్చారు. ఆయుధాలు సరెండర్‌చేసినవారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలుండవని హామీ ఇచ్చారు. గడువు తర్వాత ఆయుధాలు ఉన్నట్లయితే కఠిన చర్యలు తప్పవని భల్లా హెచ్చరించారు.

# లైఫ్‌సైన్సెస్ పాలసీపై త్వరలోనే కేబినెట్ నిర్ణయం

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** లైఫ్ సైన్సెస్ పాలసీపై త్వరలోనే కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. బుధవారం హెచ్ఐసిసి బయో ఏషియా 2025 సదస్సు అనంతరం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటిని ఏర్పాటు చేయబోతున్నామని, ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇప్పుడున్న విద్యా వ్యవస్థలోని లోపాల వల్ల పట్టాతో బయటకు వచ్చే విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా నైపుణ్యం ఉండటం లేదని అన్నారు. ఈ గ్యాప్‌ను ఫిల్ చేయడమే మా లక్ష్యం అన్నారు. అందుకే పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటిని ఏర్పాటు చేశామన్నారు.

ఫార్మా రంగంలో తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కాలుష్యం లేకుండా టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. వికారాబాద్, జహీరాబాద్‌లో ఇప్పటికే స్థలాలను గుర్తించామని తెలిపారు. లగచర్లలో ఫార్మా పరిశ్రమల కాకుండా పర్యావరణహిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని తెలిపారు. మా ప్రభుత్వం ప్రజలు తెలిపే నిరసన, అభ్యంత రాలను పరిగణనలోకి తీసుకుని, అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణలో యూఎస్ దిగ్గజ కంపెని అమ్జెన్, మరికొన్ని దిగ్గజ సంస్థలు రూ.5వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

# ఎస్ఎల్‌బిసి డిజైన్ ఫెయిల్యూర్ అని కెసిఆర్ ఎప్పుడో చెప్పారు

### మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి26:** సిగ్గులేదా జీడిగింజ అంటే నల్లగున్నా నాకేటి సిగ్గు అన్నాదట అనే సామెతలా ఉంది రేవంత్ రెడ్డి వ్యవహారం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఎస్ఎల్‌బిసి ప్రమాదం జరిగితే, ఒక బాధ్యతగల ముఖ్య మంత్రివి అయితే రెస్క్యూ ఆపరేషన్ మీద దృష్టి పెట్టేవారని, ఎన్నికలు, ఢిల్లీ టూర్లు అంటూ తిరిగే రేవంత్‌రెడ్డికి పాలన అంటే ఏంటో తెలుసా..? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బిసి ఒక డిజైన్ ఫెయిల్యూర్ అని కెసిఆర్ ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కాదు..ఆ వీడియో చూడు..కొంచెమయినా విషయ పరిజ్ఞానం వస్తుందని సిఎంకు సూచించారు. అయినా పనులు ఆగిపోవడం వల్ల, బేరింగులు పనిచెయ్యడం లేదు అని అనడం ఏంటని ప్రశ్నించారు. అసలు పనులు మొదలు పెట్టడానికి ముందు టెక్నికల్ అసెస్మెంట్, జిఎస్ఐ సర్వే ఏమన్నా చేశారా..గుడ్డిగా కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారా..? అని నిలదీశారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తాము డిమాండ్ చేస్తే దాని గురించి మాట్లాడడం మానేసి, ఈ పని కిమాలిన లీకులు, అక్కరకురాని చిట్‌చాట్లు దేనికి? అని సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ ప్రశ్నించారు.

**స్టాలిన్ వాదనలతో పూర్తిగా ఏకీభవిస్తున్నా: కెటిఆర్ ట్వీట్**

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం చేయవద్దని తమిళనాడు సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సమర్థించి,మద్దతిచ్చారు. డీలిమిటేషన్ కారణంగా దక్షిణ భారత దేశంలో 100 వరకు లోక్‌సభ సీట్లు తగ్గిపోయే ప్రమాదం ఉందని స్టాలిన్ వివరించారు,. దక్షిణాది రాష్ట్రాలు ఎంతో మెరుగైన విధానాలతో విజయవంతంగా జానాభా నియంత్రణ చేశాయని,కానీ ఇప్పుడిలా డీలిమిటేషన్ కారణంగా నష్టపోయేందుకు సిద్దంగా లేమని స్పష్టం చేశారు. కుటుంబ నియంత్రణ అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించడం తగదని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది పనితీరును పట్టించుకోక పోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.దేశ నిర్మాణంలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను ఎవరూ విస్మరించలేరని తెలిపారు. దేశంలో తెలంగాణ జనాభా 2.8 శాతం ఉంటే జీడీపీ 5.2 శాతం అందిస్తోందని కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

# రతన్ టాటా రోడ్డు.. రెండు ప్యాకేజీల్లో పనులు పూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ సిటీ,ఫ్యూచర్ సిటీలకు సంబంధించి గ్రీన్‌ఫీల్డ్ రహదారి (రతన్ టాటా రోడ్డు) నిర్మాణం మొదలు కానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనుల కోసం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. రెండు ప్యాకేజీల్లో ఈ రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయనున్నారు.ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డుని రావిరాల ఇంటర్ ఛేంజ్ 13 నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగ్ రోడ్డు అనుసంధానంగా మొత్తం 41.50 కిలోమీటర్ల పొడవుతో ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. దీంతో పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ సమాయత్తమవుతోంది. తొలి దశలో రావిలాల ఇంటర్ ఛేంజ్ నుంచి మీర్‌ఖాన్‌పేట్‌వరకు 19.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు.రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్ వరకు 22.30 కిలోమీటర్ల మేర అందుబాటులోకి రానుంది. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీం పట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాలు, 14 గ్రామాలను కలుపుతూ ఈ రహదారి అందుబాటులోకి రానుంది. టెండర్ పత్రాలు ఈ నెల 28 నుంచి సమర్పించాలని, మార్చి 21న సాంకేతిక బిడ్లు తెరవనున్నట్లు హెచ్ఎండీఏ తెలిపింది.

# నేను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే..

### కొందరు కావాలనే నా ఫొటోలు, ఫ్లెక్సీల్లో వేస్తున్నారు

### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఫిర్యాదు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** 'తాను బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, కానీ కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు, కార్యకర్తలు తన ఫోటో ఫ్లెక్సీలలో వేసి తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిబ్రవరి 11న ఫిర్యాదు చేసిన ఎఫ్ఐఆర్ ఆలస్యంగో వెలుగులోకి వచ్చింది. తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే అని ఎఫ్ఐఆర్ కాపీలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ ఫిర్యాదు స్టేట్మెంట్ ఇవ్వడం సంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్నట్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, కొంతమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ ఫ్లెక్సీల్లో తన అనుమతి లేకుండా ఫొటోలు వేసి, దుష్ప్రచారం చేస్తున్నారని గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాపీలో పొందుపర్చారు. వివరాల్లోకి వెళ్తే..గత అసెంబ్లీ ఎన్నికలలో గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.

అనంతరం మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల పై అనర్హత వేటుపడే ప్రమాదం ఉందని ప్రచారం జరుగుతుండడంతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తాను పార్టీ మారలేదని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు తమ ఫోటోలను ఉపయోగించి ఫ్లెక్సీలు వేశారని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గద్వాల టౌన్ పోలీసులకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# బోనస్ కోసం రైతుల పడిగాపులు

### రూ.2652కోట్లకుపైగా బకాయిలు

### ఎమ్మెస్పీ బకాయి రూ.3.04 కోట్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** వరిధాన్యం సాగు చేసే రైతుకు ప్రభుత్వం బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 కనీస మద్దతు ధరతో కల్పి ఇస్తామని హామి ఇచ్చిన జాప్యం జరుగుతుండటంతో రైతుల్లో అసహనం పెరుగుతోన్నది. రాష్ట్రవ్యాప్తంగా 265కోట్ల రూపాయల మేరకు బోనస్ రైతులకు ప్రభుత్వం బకాయి చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలోని 8387కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోళ్లు ముగించేసి వాటిని మూసివేసి నెలలు గడిచినా చేతికి బోనస్ నగదు రావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 53.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణ ప్రభుత్వం సేకరించింది. అందులో 5,86545 మంది రైతుల నుంచి 29.96లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డ ధాన్యం, 4,48,939 మంది రైతుల నుంచి 24లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరించారు. మొత్తంగా 10లక్షల 35,484 మంది రైతుల నుంచి రెండు రకాల ధాన్యం సేకరణ జరిగింది. దీనికిగాను 12513 .51కోట్లు కనీసమద్దతు కింద రైతులకు చెల్లించాల్సి ఉండగా 12510.47కోట్లు మాత్రమే చెల్లించారు. అంటే ఇంకా రూ.3కోట్ల నాలుగు లక్షల రూపాయలు కనీస మద్దతు ధరను కూడా రైతులకు బకాయిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వానాకాలంలో 60.39లక్షల ఎకరాలలో వరిధాన్యం సాగుచేస్తే అందులో సన్నాలు 36.80లక్షల ఎకరాలలో సాగుచేశారు. బోనస్ కోసం తెలంగాణ ప్రభుత్వం వెయ్యికోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసింది.అందులో 900 కోట్ల మేరకు బోనస్ వరకు 3.64లక్షలకుపైగా రైతులకు చెల్లించారు. సివిల్‌సప్లయ్‌శాఖ బోనస్ చెల్లింపుల కోసం నిధులు లేకపోవడంతో దాదాపు 265కోట్ల మేరకు రైతులకు బోసన్ చెల్లింపుల కోసం చెక్కులు నేటికి రాయలేదు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే చెక్కులు జారీచేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల శాలిగౌరారం మండలం అంబారిపేటకు చెందిన రైతు తోట యాదగిరి గాంధీభవన్‌లో నిరసన చేయగా అతని ఖాతాలో ఎట్టకేలకు సన్నధాన్యం బోనస్ డబ్బులు జమయ్యాయి. రైతు రుణమాఫి కాలేదని, బోనస్ డబ్బులు కూడా పడలేదని శుక్రవారం యాదగిరి ఏకంగా హైదరాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవన్ మెట్లపై ఆందోళనకు దిగాడు. యాదగిరి ఆవేదన పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. యాదగిరికి రావాల్సిన బోనస్ డబ్బులు శనివారం ఆగమేఘాల మీద ఖాతాలో జమ చేసిందని రైతు తోట యాదగిరి ధృవీకరించారు. యాదగిరికి డబ్బులు పడ్డాయని తెలియడంతో బోనస్ కోసం ఒత్తిడి పెంచడానికి రైతులు సన్నాహక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం యూరియా కూడా కొరత ఉండటం చేతిలో బోనస్ ఉంటే కనీసం పరాయి రాష్ట్రాలకు వెళ్ళి ఎరువు కొనుక్కొందామనే తాపత్రయంతో రైతాంగం ఉండటంతో బోనస్ కోసం అత్యంత ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.


# వివక్షల మధ్య సాహితీ శిఖరాన్నధిరోహించిన ఇనాక్

### ఘనంగా జరిగిన కొలకలూరి పురస్కార ప్రదానం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రతిక్షణం పనిచేసేలా చేస్తూ, తన ముగ్గురు పిల్లలు వేజండ్ల చిన్న గ్రామం నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడం వెనుక అద్భుతమైన శక్తి తన మాతృమూర్తిదేనని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం రాత్రి జ్యోతిగ్రంథమాల సంస్థ నిర్వహణలో 'కొలకలూరి పురస్కారాలు- 2025' ప్రదానోత్సవ కార్యక్రమం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షురాలు, కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొలకలూరి భాగీరథి కవితా పురస్కారాన్ని కవి జూలకంటి జగన్నాథం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాన్ని నాటకకర్త డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాన్ని పరిశోధకులు డాక్టర్ గడ్డం మోహనరావుకు అందించి గౌరవించారు. పరిశోధన పురస్కారాలను డాక్టర్ పి.వాసు (ఆదిఆంధ్రుడు కావ్యం-నిబిడతా సిద్ధాంతం), డాక్టర్ ఎ.అనూరాధ(జయ్‌ప్రకాశ్ కర్దమ్ ఔర్ కొలకలూరి ఇనాక్ కహానియోం మే దళిత్ సమాజ్), ఎం.సుబ్బరాజు(క్యాస్ట్, జెండర్ అండ్ సోషియో ఎకనామిక్ పర్స్పెక్టివ్స్ ఆఫ్ కొలకలూరి ఇనాక్ షార్ట్ సోరీస్)కు అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో కొలకలూరి అనితా శ్రీకిరణ్, తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ ఆచార్యులు కొలకలూరి సుమకిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ నిరంతరం పోరాటయోధురాలుగా తన మాతృమూర్తి జీవించిందన్నారు. తను నేడు 24 గంటల్లో జీవించేటువంటి అద్భుతమైన అవకాశాన్ని తనకు తన మాతృమూర్తి అందించారని అన్నారు. ప్రతిక్షణం పనిచేసేలా చేసిందని, తన తల్లిని తలచుకుంటే కొంత భావోద్వేగం కలుగుతుందన్నారు. ఒక సందర్భంలో పదమూడు రోజుల పాటు నిద్రపోకుండా పనిచేసే శక్తి తన మాతృమూర్తి తనకు అందించిందన్నారు. తాను 365 రోజుల్లో 136 రోజుల పాఠశాలకు వెళ్లిన సందర్భాలే ఉన్నాయని, మిగతా రోజులన్నీ కూలీ చేయాల్సిందేనని, కూలిచేయపోతే వ్యాపారం చేయాలని, అది కాకపోతే వృత్తి చేయి, నిరంతరం పనిచేయించేదన్నారు. బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగాధిపతి ఆచార్య రాణిరజిత మాధురి మాట్లాడుతూ నాడు సమాజంలో ఉన్న వివక్షతల వ్యతిరేక పరిస్థితులు నుంచి ఆచార్య కొలకలూరి ఇనాక్ శిఖరంలా ఎదిగిన గొప్ప ఆదర్శమూర్తి అని అన్నారు. తెలుగులో వెలువడిన వ్యాసాలను పరిశోధన అంశం గ్రహించడం ఇనాక్‌లో ఉన్న సృజనాత్మకతకు నిదర్శనమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యంలో ఎంతో గొప్ప గొప్ప సందేశాలను అందించేలా ఉంటాయన్నారు. మట్టిపొరల్లో నుంచి మొలకగా వెలువడి మొక్కగా వటవృక్షంగా ఎదిగిన ఇనాక్ తాను రాసిన ప్రతి అక్షరం కన్నీటి చుక్క అని చెప్పారని అన్నారు.



'కొలకలూరి పురస్కారాలు-2025' ప్రదానం చేస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య రాణిరజిత మాధురి



# పార్టీ వార్షికోత్సవ సభలో వేదికపై విజయ్, ప్రశాంత్‌కిశోర్

**చెన్నై, ఫిబ్రవరి 26:** తమిళనటుడు టివికె పార్టీ చీఫ్ విజయ్ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ ఒకేవేదికపై కనిపించారు. విజయ్ ఇటీవలే రాజకీయ పార్టీని స్థాపించారు. తమిళగ వెట్రి కళగం పేరుతోపార్టీని ఏర్పాటుచేసారు. ఏడాది అయిన సందర్భంగాచెన్నైలో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సభకు టివికెనేతలతోపాటు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ హాజరయ్యారు. ఇద్దరు స్టేజ్‌పై నిలబడి అభిమానులకు అభివాదంచేసారు. 2026లో జరిగే ఎన్నికల బరిలో దిగుతామని పార్టీనిప్రారంబించిన సమయంలోనే విజయ్ ప్రకటించారు. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన పార్టీ ఎన్నికల్లో పోటీకి ప్రశాంత్‌కిశోర్ సహకరిస్తున్నట్లు కొంతకాలంగా వినిపిస్తోంది. ఇటీవలికాలంలోనే చెన్నైలో విజయన్‌ను ప్రశాంత్‌కిశోర్ మర్యాదపూర్వకంగా కలిసారు. దేశంలో ఇప్పటికే పలు రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగాప్రశాంత్‌కిశోర్‌పనిచేసారు. ఇపుడు టివికె పార్టీకి కూడా ఆయన వ్యూహకర్తగా వ్యవహరిస్తుండటంతో విజయ్‌పార్టీపై తమిళ నాట అంచనాలు పెరిగాయి. ఇక ఈసభలో వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇతర పార్టీలతో పొత్తులపై ప్రచార యాత్రలపై విజయ్ కీలకప్రకటన చేస్తారని ఆపార్టీ అభిమానులుచెపుతున్నారు.

# చిన్నారుల అదృశ్యం వెనక బెగ్గింగ్, కిడ్నాప్ గ్యాంగ్‌ల మాఫియా

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో మిస్టరీగా మారుతున్న చిన్నారుల అదృశ్యం, అపహరణ వెనుక బెగ్గింగ్, కిడ్నాపింగ్ మాఫియా హస్తం వు న్నట్లు రాచకొండ పరిధిలో వెలుగు చూసిన పసికందులు, చిన్నారుల అమ్మకం వ్యవహారం తేటతెల్లం చేసింది. ఇప్పటి వరకు ఏ రాష్ట్రాల నేరగాళ్లు ఆయా రాష్ట్రాలలోనే దందాలు సాగిస్తుండగా పోలీసుల నిఘాను తప్పించుకునేందుకు ఇప్పుడు పొరుగు రాష్ట్రాల నేరగాళ్లతో అవగాహనతో ముందుకు సాగుతున్నట్లు తేలింది. రాచకొండ పరి ధిలో ఏడాది వ్యవధిలో చిన్నారులు, పసికందుల విక్రయాలు చేస్తున్న రెండు ముఠాలను పట్టుకోగా వీరి వద్ద నుంచి నలుగురు పసికందులతో పాటు 15 మంది చిన్నా రులను పోలీసులు రక్షించగా వీరంతా ఉత్తరాది రాష్ట్రాలలో కిడ్నాప్ అయినట్లు తేలింది. రోజుల వయస్సు నుంచి రెండు మూడు నెలల వయస్సుండగా వీరంతా కిడ్నాప్ అవగా స్వల్ప వనయవధిలోనే వీరు రక్షింపబడడం విశేషం. తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి కిడ్నాప్ రాకెట్ పట్టుబడడం ఇది రెండవసారి. తెలుగు రాష్ట్రాలలో ప్రతీ నెలా 20కి పైగా చిన్నారుల అదృశ్యం లేదా అపహరణ ఘటనలు పోలీసుల దృష్టికి వస్తుండగా ఇందులో సగం కేసులు సుఖాంతమవుతుం డగా మిగతా కేసులు మిస్టరీగానే వుండిపోతున్నాయి. గతంలో వెలుగు చూసిన చిన్నారుల కిడ్నాప్, అదృశ్యం ఘటనల వెనుక బెగ్గింగ్ మాఫియా వున్నట్లు తేలింది. ఇందులో కొన్ని ముఠాలు ఎపిలోని చిత్తూరు కేంద్రంగా వున్నట్లు కూడా తేలింది. ఆరేళ్ల క్రితం అర్థరాత్రి సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం పై తం డ్రి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న రెండున్నరేళ్ల స్వర్ణలత అనే

> **తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల నేరగాళ్ల మధ్య అవగాహన**

చిన్నారి కిడ్నాప్ ఉదంతంపై విచారణ చేసిన పోలీసులకు షాకింగ్ నిజాలు వెలుగు చూశా యి. చిన్నారిని కిడ్నాప్ చేసిన చాకలి రాజు అనే నేరగాడిని విచారించగా చిత్తూరు జిల్లా కేంద్రంగా కొనసాగుతున్న బెగ్గింగ్ మాఫియాకు విక్రయించేందుకు తాను పాపను అపహరించినట్లు వెల్లడించాడు.

రాజు వెల్లడించిన విషయాలపై పోలీసులు లోతుగా ఆరా తీసి ఆ తరువాత చిత్తూరు జిల్లాలోని బెగ్గింగ్ మాఫియాపై దాడిచేసి కొందరు చిన్నారులను కాపాడి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ ఘటన తరువాత బెగ్గింగ్ మాఫియా కార్యకలాపాలపై ఓ స్వచ్ఛంద సంస్థ పరిశీలన చేయగా సంచలన వి షయాలు వెలుగు చూశాయి. తెలుగు రాష్ట్రాల్లో రహదారులపై బిక్షాటన చేసే అనేక మంది మహిళల వద్ద వుండే చిన్నారులు వారి పిల్లలు కారని తేలింది. చిన్నారుల చేత బిక్షాటన చేయిస్తున్న వారి విషయంలో సర్కారీ విభాగాలు కఠినంగా వ్యవహరించక పోవడంతో బెగ్గింగ్ మాఫియా ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. ర హదారులపై బిక్షాటన చేసే అనేక మంది మహిళలు చిన్నారులతో పాటు కనిపిస్తుంటారు. ఈ చిన్నారులు నిద్ర పోతున్నట్లు కనిపించడం తెలిసిందే. వాస్తవానికి చిన్నా రులకు మత్తుమందు ఇచ్చి నిద్ర పుచ్చుతుంటారని మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. చిన్నారుల కిడ్నాప్‌కు రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు కేరాఫ్‌గా వుంటున్నాయి. ఇక్కడ ఒంటరిగా వుండే చిన్నారులు, లేదా తల్లిదండ్రులతో పాటు వుండే చిన్నారులకు కొందరు నేరగాళ్లు కిడ్నాప్ చేసి వ్యభిచార కూపాలకు లేదా బెగ్గి ంగ్ మాఫియాకు విక్రయించిన ఘటనలు అనేకం వెలుగు చూశాయి. అనేక సందర్భాలలో తప్పిపోయిన లేదా అపహరించబడిన చిన్నారుల జాడ తెలియరావడం లేదు. గతంలో హైదరాబాద్‌లోని నీలోఫర్, ఉస్మానియా, కోఠి ఆసుపత్రుల్లో అపహరణకు గురైన పలువురు చిన్నారుల ఉదంతాలపై పోలీసుల విచారణ అనేక సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఇక్కడ చిన్నారులను అపహరించిన నేరగాళ్లు ఇతర ప్రాంతాలలో పిల్లలు లేని వారికి అమ్ముతున్నట్లు తేలింది. ఇదే సమయంలో డబ్బు లు ఎక్కువగా ఇస్తే ఎవరికైనా అమ్ముతున్నట్లు వెల్లడయ్యింది. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోనూ చిన్నారుల అపహరణ వుండడం గమనార్హం.

**ఇతర రాష్ట్రాల నేరగాళ్లతో బ్యాండింగ్**

ఇదిలా వుండగా తాజాగా చిన్నారులను కిడ్నాప్ చేస్తున్న నేరగాళ్లు ఇతర రాష్ట్రాల నేరగాళ్లతో బ్యాండింగ్ పెట్టుకుని నేరకలాపాలను సాగిస్తున్నట్లు తేలింది. రాచకొండ ప రిధిలో వెలుగుచూసిన రెండు ఘటనలు ఇందుకు ఉదాహరణగా చెప్పాలి. గత ఏడాది మే నెలలో వెలుగు చూసిన ఘటనలో 15 మంది చిన్నారులను పోలీసులు రక్షిం చడంతో పాటు దీనికి కారకులైన నేరగాళ్లను అరెస్టు చేశారు. ఇక తాజాగా రోజుల వయస్సు వున్న నలుగురు పసికందులను పోలీసులు నేరగాళ్ల బారినుంచి కాపాడి వా రిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

# 'కన్నప్ప' నుంచి 'శివా శివా' సాంగ్ వైరల్




విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి రీసెంట్‌గా వచ్చిన 'శివా శివా శంకరా' అనే పాట సోషల్ మీడియాలో చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఈ శివరాత్రికి అన్ని చోట్లా ఈ పాటే మార్మోగిపోయేలా ఉంది. ఇప్పటికే ఈ పాట సోషల్‌మీడియాలో ఎన్నో రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఈ పాటను 80 మిలియన్ల (8 కోట్ల) మంది వీక్షించారు. ఇక ఇన్ స్టాగ్రాంలో రెండులక్షలకు పైగా రీల్స్ చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఈ పాట ఆకట్టుకుంది. పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఈ ట్రెండ్‌లో చేరి రీల్స్‌తో తమభక్తిని చాటు కుంటున్నారు. ఇక సోషల్ మీడియా మొత్తం శివ నామస్మరణే కనిపిస్తోంది. అంతటా శివా శివా శంకరా' అనే పాటే వినిపిస్తోంది. మహా శివరాత్రి సందర్భంగా ఈ పాట మరింతగా ట్రెండ్ అవుతోంది. ఈ పాట అద్భుతమైన విజయం సాధించడం గురించి నటుడు నిర్మాత విష్ణు మంచు మాట్లాడుతూ, 'శివా శివా శంకరా' పాటకు వచ్చిన అద్భుతమైన స్పందన చూసి మేం చాలా సంతోషి స్తున్నాం. ప్రజలు దానిని స్వీకరించిన విధానం, రీల్స్ చేస్తూ తమ తమ భక్తిని ప్రదర్శిస్తుండటం ఆనందంగా ఉంది. ఇంతలా ఈ పాట ట్రెండ్ అవుతుందని మేం ఊహించలేదు. శివరాత్రి వస్తున్నందున ఈ పాట మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని అర్థం అవుతోంది' అని అన్నారు. శివభక్తుడైన కన్నప్ప పురాణ కథను అందరి ముందుకు తీసుకు రాబోతున్నారు. క్లిష్టమైన కథనాన్ని, అద్భుతమైన విజువల్స్, అసాధారణమైన సమిష్టి తారాగణంతో అద్భుతంగా తెరకెక్కించారు. విష్ణు మంచు కన్నప్ప పాత్రను పోషిస్తుండగా, రుద్రుడిగా ప్రభాస్, మహా శివుడిగా అక్షయ్ కుమార్ కనిపించ బోతున్నారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఏప్రిల్ 25న గ్రాండ్‌గా రిలీజ్ కాబో తోంది.

# 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి క్యారెక్టర్ పోస్టర్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు" ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా "ఏబీసీడీ" సినిమా, రాజ్ తరుణ్‌తో "అహ నా పెళ్లంట" అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా తెరకెక్కుతోంది. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా నుంచి జీవన్ కుమార్ నటించిన ఇంగ్లీష్ రాని ప్రాజెక్ట్ మేనేజర్ విజ్ఞాన్ కుమార్ క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. విగ్ పెట్టుకునే విజ్ఞాన్ కుమార్ ఇంగ్లీష్ రాకున్నా ప్రాజెక్ట్ మేనేజర్‌గా తన టీమ్‌ను ఎలా లీడ్ చేశాడు, ఇలాంటి ప్రాజెక్ట్ మేనేజర్‌తో ఇతర ఎంప్లాయిస్ ఎలాంటి పాట్లు పడ్డారు అనేది ఎంటర్ టైనింగ్‌గా ఉండబోతోంది. ఒక కాంటెంపరరీ ఇష్యూను కథలో చూపిస్తూ వినోదాత్మకంగా "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను రూపొంది స్తున్నారు దర్శకుడు సంజీవ్ రెడ్డి. ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, శ్రీ లక్ష్మి, హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్ గీల, సద్దాం తదితరులు

టెక్నికల్ టీమ్:
డైరెక్టర్: సంజీవ్ రెడ్డి,
ప్రొడ్యూసర్స్: మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి
స్టోరీ, స్క్రీన్ ప్లే: సంజీవ్ రెడ్డి, షేక్ దావూద్ జి, మ్యూజిక్ డైరెక్టర్: సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ మధుసూదన్ రెడ్డి, సినిమాటోగ్రఫీ: మహి రెడ్డి పండుగుల, డైలాగ్స్: కల్యాణ్ రాఘవ్, కొరియోగ్రాఫర్: లక్ష్మణ్ కాళహస్తి
కాస్ట్యూమ్ డిజైనర్స్: అశ్వత్ భైరి, కె ప్రతిభ రెడ్డి
ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, పబ్లిసిటీ డిజైన్ మాయాబజార్ డిజిటల్ హౌస్ ఫుల్ డిజిటల్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్).



# 'మిస్టర్ ఎక్స్' యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్

ఆర్య, గౌతమ్ కార్తీక్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మిస్టర్ ఎక్స్. ఎఫ్ఐఆర్ సినిమాతో ఆకట్టుకున్న మను ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ భారతదేశ సీక్రెట్ సర్వీస్‌లోని హీరోల జీవితాల గురించి ఇంటెన్స్ యాక్షన్‌ప్యాక్డ్ కథనాన్ని అందిస్తుంది. మంజు వారియర్ వాయిస్ ఓవర్ మిస్ అయిన న్యూక్లియర్ డివైజ్ గురించి తెలియజేస్తుంది.



మనం దానిని భద్రపరచకపోతే, ఏ క్షణంలోనైనా ఎక్కడైనా ఎటాక్ జరగవచ్చు' అని ఆమె చెప్పడం ఉత్కంఠతని పెంచింది. ఆ డివైజ్ ట్రాక్ చేయడానికి, ఎటాక్‌ని ఆపడానికి ది ఎక్స్ ఫోర్స్ ఆర్య, గౌతమ్ కార్తీక్, శరత్ కుమార్ నేతృత్వంలోని ఎలైట్ గూఢచారుల బృందం తెరపైకి వస్తోంది. అయితే, టీజర్ టీంలో జరిగే ద్రోహాన్ని సూచించడంతో సినిమా డార్క్ సైడ్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఇందులో అతుల్య రవి, రైజా విల్సన్, అనఘ హీరోయిన్లుగా నటిస్తున్నారు. దివ్యాంక ఆనంద్ శంకర్, రామ్ హెచ్ పుత్రన్ స్క్రీన్ ప్లే రాశారు. అరుల్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ అత్యద్భుతంగా ఉంది, దిబు నినాన్ థామస్ అందించిన బిజిఎం కథనాన్ని ఎలివేట్ చేసి టెన్షన్‌ని పెంచుతుంది. ఎడిటింగ్ ప్రసన్న జికె.ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా వున్నాయి. మిస్టర్ ఎక్స్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా విడుదల కానుంది. తారాగణం: ఆర్య, గౌతమ్ కార్తీక్, శరత్ కుమార్, మంజు వారియర్.

# మార్చి 21న 'టుక్ టుక్'

వైవిధ్యమైన సినిమాలకు, న్యూ కాన్సెప్ట్‌లకు, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే చిత్రాలకు తెలుగులో ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అలాంటి చిత్రాలను చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా అఖండ విజయాన్ని అందిస్తుంటారు మన తెలుగు ప్రేక్షకులు. ఇప్పుడు ఈ కోవలోనే ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం టుక్ టుక్. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని మరియు ఆర్ వై జి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణలు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు మేకర్స్. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మహా శివరాత్రి కానుకగా విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని పంచుతుంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వెహికల్ ప్రేమలో పడి పోతారు. దానికి ఓ మంచి రహస్యం కూడా ఉంటుంది. సినిమాలో ఎంతో ఎంటర్‌టైన్‌మెంట్‌ను కూడా పంచుతుంది. యువతరం నచ్చే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు కూడా ఈ చిత్రంలో ఉన్నాయి. తప్పకుండా ఈ చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే విశ్వాసం వుంది అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, సుప్రీత్ సి కృష్ణ దర్శకత్వం వహించిన, "టుక్ టుక్" ఒక ఆహ్లాద కరమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా ఉంటుంది. అసలు కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథ ఒక గ్రామం నేపథ్యంలో కొనసాగుతుంది. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుంది. ఈ వేసవికి ప్రేక్షకులకు మంచివినోదం అందించడానికి మార్చి 21న మా టుక్ టుక్ రెడీ అవుతోంది. సంతు ఓంకార్ సంగీతం అందించిన ఈ చిత్రానికి హార్ధిక్ శ్రీకుమార్ సినిమాటోగ్రఫీ అందించారు.



# '8 వసంతాలు' ఫస్ట్ సింగిల్ లాంచ్

మోస్ట్ సక్సెస్ ఫుల్ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బిగ్ స్టార్లతో హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లను నిర్మించడమే కాకుండా కంటెంట్ రిచ్ మూవీలను రూపొందిస్తోంది. ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొంది 'మను'తో దర్శకుడిగా డెబ్యు చేసి దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టితో కాన్సెప్ట్ బేస్డ్ మూవీ '8 వసంతాలు'ను నిర్మిస్తున్నారు. ఎంఎడి ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ ఈ మూవీలో హీరోయిన్. ఇందులో ఆమె శుద్ధి అయోధ్య పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ ఇప్పటికే మంచి క్రియేట్ చేసింది. మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలో ఫస్ట్ సింగిల్ అందమా అందమా మార్చి3న విడుదల కానుంది. స్టార్ కంపోజర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ పాట కోసం బ్లాక్ బస్టర్ ట్యూన్ ని కంపోజ్ చేశారు. వనమాలి రాసిన ఈ పాటని హేషమ్ అబ్దుల్ వహాబ్ ఆవని మల్హార్ పాడారు. సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లీడ్ పెయిర్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా వుంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు హార్ట్ వార్మింగ్ మూవీగా రూపొందుతోంది. ఈ చిత్రానికి అరవింద్ మూలే ప్రొడక్షన్ డిజైనర్‌గా, శశాంక్ మాలి ఎడిటర్‌గా, బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. మేకర్స్ త్వరలో రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు. నటీనటులు: అనంతిక సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిషోర్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్, సిఇఒ: చెర్రీ, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, డీఓపీ: విశ్వనాథ్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: అరవింద్‌మ్యూల్, ఎడిటర్: శశాంక్ మాలి, ఎగ్జిక్యూటివ్‌ప్రొడ్యూసర్: బాబాసాయి కుమార్ మామిడిపల్లి, యాక్షన్ కొరియోగ్రఫీ: వింగ్ చున్ అంజి, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్‌షో.





నమిత ప్రమోద్ నయా లుక్

# హండ్రెడ్ పర్సెంట్ హిట్ మూవీ 'మజాకా'

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్ మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్. మన్మథుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ హైలీ ఎంటర్‌టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ త్రినాధరావు నక్కిన విలేక రుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.


**మజాకా ఎలా ఉండబోతోంది?**
మజాకా వందశాతం హిట్ ఫిల్మ్. ఆ రేంజ్ ఏమిటనేది ఫస్ట్ షో పడ్డాక డిసైడ్ అవుతుంది. ఇప్పటివరకూ సినిమా చూసిన వారంతా సూపర్ హిట్ ఫిల్మ్ అన్నారు.

**మీ గత సినిమాలతో పోల్చుకుంటే ఈ సినిమాకి పబ్లిసిటీ టైం సరిపోలేదనిపిస్తోంది?** టైం తక్కువైన మాట నిజమే. నిర్మాతలు వాళ్ళ బెస్ట్ ఎఫర్ట్ పెట్టారు. శివరాత్రి రిలీజ్ చేయాలని అందరం డే అండ్ నైట్ కష్టపడ్డాం. శివరాత్రి సినిమాకి మంచి డేట్. **ఈ కథ ఎప్పుడు విన్నారు?** ధమాకా సమయంలోనే ప్రసన్న కుమార్ ఈ కథ చెప్పారు. రావు రమేష్‌ని దృష్టిలో పెట్టుకొని చెప్పారు. హీరోగా ఎవరు చేస్తారని అడిగాను. ఈ కథ కొందరి దగ్గరకి వెళ్ళింది. ఫైనల్‌గా రావు రమేష్ కాంబినేషన్‌లోనే వచ్చింది. నిజానికి ఈ కథని సందీప్ కిషన్ ఒప్పుకోవడం చాలా గ్రేట్. **ఈ కథకి బ్రోడాడీ స్ఫూర్తి ఉందా?** లేదండీ. నేను ఆ సినిమా చూశాను. ఆ కథే వేరు ఇది వేరు. **మజాకా కథ ఏమిటి?** సింగిల్ లైన్‌లో చెప్పాలంటే.. ఆడదిక్కులేని ఇద్దరు మగాళ్ళ ఎప్పటికైన ఇంట్లో ఒక ఫ్యామిలీ ఫోటో పెట్టుకోవాలనుకునే వారి తపనే ఈ కథ. దీని కోసం వాళ్ళు పడే బాధలు, ప్రయత్నాలు ఫుల్ ఫన్ జోన్‌లో వుంటాయి. చివరి ఇరవై నిముషాలు చాలా ఎమోషనల్‌గా వుంటుంది. **ప్రసన్న ఈ కథ చెప్పిన తర్వాత మీరు ఎలాంటి మార్పులు చేశారు?** ప్రతి సినిమాకి మార్పులు చేర్పులు వుంటాయి. కానీ ఈ సినిమా వరకూ స్క్రిప్ట్‌లో నేను పెద్దగా ఇన్వాల్ కాలేదు. కంప్లీట్ బైండ్ స్క్రిప్ట్‌తో వచ్చారు ప్రసన్న. అప్పటికే అన్ని మార్పులు చేర్పులు చేసి సీన్స్, విత్ డైలాగ్‌తో వచ్చారు. ప్రసన్న, సాయి కృష్ణ ఇద్దరూ పక్కాగా రాసుకున్నారు. షూటింగ్ సమయంలో డైలాగుల్లో చిన్న చిన్న మార్పులు తప్పితే మజాకా కథ నా దగ్గరికి వచ్చేసరికే కంప్లీట్‌గా వుంది. **రాములమ్మ పాట సెలెక్షన్ మీదేనా?** అవును. నాకు యూట్యూబ్‌లో ప్రైవేట్ ఆల్బమ్ చాలా నచ్చుతున్నాయి. చాలా చక్కగా చేస్తున్నారు. అలా జనాల్లోకి వెళ్ళిన ఓ పాటని మళ్ళీ మన స్టయిల్‌లో వినిపిస్తే బావుంటుందనే ఆలోచనతో ఆ పాటని చేశాం. నిజానికి అలా యూట్యూబ్‌లో హిట్ అయిన ఓ నాలుగు పాటలు ఒక సినిమాలో పెట్టాలనే ఆలోచన కూడా వుంది. మంచి కమర్షియల్ కథ కుదిరితే అలా చేయొచ్చు.

**అన్షు ఛాయిస్ ఎవరిది?** ఆ క్యారెక్టర్‌కి ఆల్రెడీ హీరోయిన్ ఇమేజ్ వున్న ఓ ఆర్టిస్ట్‌తో చేయిస్తే బావుంటుందని అనుకున్నాను. అప్పుడు మన్మధుడులో అన్షు అయితే ఎలా ఉంటుందని ప్రసన్నతో అన్నాను. తర్వాత నిర్మాత రాజేష్ ఆమెని సంప్రదించారు. నేనే ఫోన్ లో మాట్లాడిన ఈ క్యారెక్టర్ గురించి చెప్పాను. ఆమెకు తెలుగు రాదు, అయిన ప్పటికీ చాలా కష్టపడి నేర్చుకొని ప్రతి డైలాగ్‌కి అర్థం తెలుసుకొని నటించడం చాలా ఆనందంగా అనిపించింది. ఒక అమ్మ క్యారెక్టర్ ఎలా చూడాలని అనుకుంటారో అన్షు క్యారెక్టర్ అలా వుంటుంది. **ఖుషి రిఫరెన్స్ సీన్ సెన్సార్ అయిపోయిందా?** ఆ సీన్ వుంది. కాకపోతే డైలాగ్‌ని సెన్సార్ చేశారు. నిజానికి ఆ డైలాగ్ వుంటే థియేటర్‌లో మరో హై వుండేది. సెన్సార్ వాళ్ళకి కూడా ఆ డైలాగ్ చాలా నచ్చింది. చాలా నవ్వుకున్నారు. కానీ కొన్ని రూల్స్ కారణంగా సెన్సార్ చేయాల్సి వచ్చింది.

**మజాకా మ్యూజిక్ గురించి?** మజాకా స్టోరీ బేస్డ్‌గా చేసిన సాంగ్స్. దానికి తగ్గట్టుగానే డిజైన్ చేశాం. లియోన్ జేమ్స్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు.

**మజాకా నిర్మాతల గురించి?** రాజేష్, అనిల్ చాలా సపోర్టివ్ ప్రొడ్యూసర్స్. చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. మజాకాకి సీక్వెల్ చేయాలనే ఆలోచన వుంది.



డైరెక్టర్ త్రినాధరావు నక్కిన

# 'ఎల్2 ఎంపురాన్' నుంచి జెరోమ్ ఫ్లిన్ పాత్ర రివీల్

మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్‌ల బ్లాక్‌బస్టర్ కాంబో 'ఎల్2 ఎంపురాన్' అంటూ మార్చి 27న రాబోతోంది. 2019లో ఈ ఇద్దరూ కలిసి చేసిన లూసిఫెర్ ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఆ లూసిఫర్‌కు సీక్వెల్ అయిన 'ఎల్2 ఎంపురాన్' ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ఒక్కో పాత్రను రివీల్ చేస్తూ అంచనాలు పెంచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు జెరోమ్ ఫ్లిన్ ఈ చిత్రంలో బోరిస్ ఆలివర్ అనే కీలక పాత్రను పోషించినట్లు మేకర్స్ వెల్లడించారు. ఐకానిక్ వెబ్ సిరీస్ గేమ్ ఆఫ్ థ్రోన్స్‌లో బ్రోన్ పాత్రను పోషించిన జెరోమ్ ఫ్లిన్ ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. జాన్ విక్ చాప్టర్ 3, సోల్జర్ సోల్జర్, బ్లాక్ మిర్రర్ వంటి అనేక ప్రాజెక్టుల్లో జెరోమ్ ఫ్లిన్ 'ఎల్2 ఎంపురాన్' చిత్రంలో ఓ కీలక పాత్రను పోషించారు.

ఈ మేరకు జెరోమ్ ఫ్లిన్ మాట్లాడుతూ, 'నేను ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చానో నాకు పూర్తిగా గుర్తులేదు. కానీ నేను యూకే,యూఎస్‌లో గడిపిన దానికంటే పూర్తిగా భిన్నమైన అనుభవాన్ని పొందాను. మాలీవుడ్ కల్చర్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. మాలీవుడ్ సంస్కృతిలో భాగం కావడం, ఇక్కడి రుచుల్ని ఆస్వాదించడం నిజంగా ప్రత్యేకమైంది. నాకు ఇండియాతో ఎంతో అనుబంధం ఉంది. నా యంగ్ ఏజ్‌లో నేను ఎక్కువగా ఇక్కడి ఆధ్యాత్మిక ప్రదేశాల్ని తిరిగాను. ఇండియాలో గడిపిన తరువాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. ఈ సినిమాలో నటించడంతో మళ్లీ నేను నా ఇంటికి వచ్చినట్టు అనిపించింది' అని అన్నారు. ఈ చిత్రంలో తన పాత్ర గురించి చెప్పకుండా, ఖురేషి ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన పాత్ర అని, ప్రేక్షకులు అతని పాత్రను ఇష్టపడతారని ఆశిస్తున్నట్లు జెరోమ్ ఫ్లిన్ పేర్కొన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించిన ఎల్2 ఎంపురాన్‌లో మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్, ఇంద్రజిత్ సుకుమారన్, టోవినో థామస్, మంజు వారియర్, సానియా అయ్యప్పన్, సాయి కుమార్, బైజు సంతోష్ వంటి ప్రముఖులు నటించారు. సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ కలిసి లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. దీపక్ దేవ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. జికెఎం తమిళ్ సుకుమరన్ లైకా ప్రొడక్షన్స్ హెడ్‌గా పని చేశారు. 'ఎల్2 ఎంపురాన్' మార్చి 27, 2025న మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది.



# గోల్డెన్ బ్యాట్‌కై బిగ్ ఫైట్

## ఛాంపియన్స్ ట్రోఫీలో హీరోల మధ్య హోరాహోరీ పోరు




### రేసులో శుభ్‌మాన్ గిల్

**న్యూఢిల్లీ:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్ ముందుకు సాగుతున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. టోర్నమెంట్ ముందుకు సాగుతున్న కొద్దీ, బ్యాట్స్‌మెన్స్ కూడా తమ ప్రతిభను చూపిస్తున్నారు. ప్రధానంగా గోల్డెన్ బ్యాట్ కోసం హీరోల మధ్య పోటా పోటీగా పోరు తీవ్రంగా సాగుతోంది. బ్యాట్స్‌మెన్స్ మధ్య పరుగుల కోసం పోటీ కనిపిస్తోంది. నలుగురు బ్యాట్స్‌మెన్స్ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇస్తూ గోల్డెన్ బ్యాట్ గెలిచేందుకు దూసుకొస్తున్నారు.

వీరిలో ఇబ్రహీం జద్రాన్ (177 పరుగులు) టామ్ లాథమ్ (173 పరుగులు), బెన్ డకెట్ (165 పరుగులు), శుభ్‌మాన్ గిల్ (147 పరుగులు) టాప్ 4 స్థానాల్లో ఉన్నారు. ఇప్పటివరకు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రయాణంలో, చాలా మంది బ్యాట్స్‌మెన్స్ సెంచరీల తర్వాత సెంచరీలు చేస్తున్నారు. దీంతో పరుగుల రేసు చాలా ఆసక్తికరంగా మారుతోంది. ఈ టోర్నీలో ఇంత వరకు దాదాపు సగం ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. దీని ఆధారంగా, గోల్డెన్ బ్యాట్ గెలుచుకునే రేసులో నలుగురు బ్యాట్స్‌మెన్స్ ముందుండటం విశేషం. వీరిలో ఇబ్రహీం జద్రాన్ (ఆఫ్ఘనిస్థాన్) 177 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. చాంపియన్‌షిప్‌లో భాగంగా లాహోర్ వేదికగా ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్ యువ ఓపెనర్ జద్రాన్ 146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో 177 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో సూపర్ సెంచరీతో అలరించిన జద్రాన్ పలు రికార్డులు సైతం కొల్లగొట్లాడు. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక పరుగులు మిషన్‌గా చరిత్ర సృష్టించాడు. ఇక టామ్ లాథమ్ (న్యూజిలాండ్) 173 పరుగులతో దూసుకుపోతున్నాడు. 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్స్‌లో న్యూజిలాండ్ జట్టు తన స్థానాన్ని నిర్ధారించుకుంది. జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ టామ్ లాథమ్ ఇందులో భారీ, ప్రత్యేకమైన సహకారాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లోనే లాథమ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. పాకిస్థాన్‌పై సెంచరీ చేసిన తర్వాత, బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో లాథమ్ అర్ధశతకం సాధించాడు. ఇప్పటివరకు ఈ టోర్నమెంట్‌లో 2 మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు (173) చేశాడు.

అతను గోల్డెన్ బ్యాట్ రేసులో ముందున్నాడు. అలాగే ఇంగ్లాండ్ స్టార్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ బెన్ డకెట్ గత కొంతకాలంగా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత పర్యటనలో కూడా అతను తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 165 పరుగులు సాధించగలిగాడు. ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో బెన్ డకెట్ గోల్డెన్ బ్యాట్ రేసులో తన పేరును చేర్చుకున్నాడు. ఇక భారత క్రికెట్ జట్టు యువ స్టార్ బ్యాట్స్‌మన్ శుభమాన్ గిల్ స్వర్ణ రూపం కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తిరిగి ఫామ్‌ను సాధించిన శుభ్‌మాన్ గిల్ ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అద్భుతంగా రాణిస్తున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఆడిన 2 మ్యాచ్‌ల్లో అతను 147 పరుగులు చేశాడు. దీనిలో అతను ఒక సెంచరీ కూడా చేశాడు. గిల్ ఫామ్‌ను పరిశీలిస్తే, ఈ టోర్నమెంట్‌లో గోల్డెన్ బ్యాట్ గెలుచుకునే బలమైన పోటీదారుడు అతనే అని నమ్మవచ్చు.

## ఇంటర్‌నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# ఇండియా రెండో విజయం

### మెరిసిన సచిన్, యువరాజ్.. 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చిత్తు



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ టీ20 టోర్నీలో ఇండియా మాస్టర్స్ జట్టు వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో భాగంగా బుధవారం ఇంగ్లండ్ మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులకే పరిమితమైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో డారెన్ మాడీ 25 పరుగులతో టాప్ స్కోరర్గా నిలవగా, టి అంబ్రోస్ (23), స్కోఫీల్డ్ (18), ట్రిమ్లెట్(16) రాణించారు. ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మెర్గాన్‌తో సహా మిగిలిన ప్లేయర్లందరూ విఫలమయ్యారు. భారత్ బౌలర్లలో ధవన్ కులకర్ణి అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో కులకర్ణి కేవలం 21 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అతడితో పాటు, అభిమన్యు మిథున్, నేగి తలా 2 వికెట్లు సాధించారు. అనంతరం 133 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 11.4 ఓవర్లలోనే ఊదిపడేసింది. భారత్ బ్యాటర్లలో గుర్‌క్రీత్ సింగ్ మానస్ (35 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 63 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే భారత కెప్టెన్ సచిన్ టెండూల్కర్ సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సచిన్ క్రీజులో ఉన్నంత సేపు తన ట్రేడ్ మార్క్ షాట్లతో అదరగొట్టాడు. కేవలం 21 బంతులు మాత్రమే ఎదుర్కొన్న లిటిల్ మాస్టర్ 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 34 పరుగులు చేసి ఔటయ్యాడు. అదే విధంగా ఆఖరిలో వచ్చిన యువరాజ్ సింగ్ కూడా తన బ్యాట్‌కు పని చెప్పాడు. యువరాజ్ కేవలం 14 బంతుల్లోనే 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో స్కోఫీల్డ్ ఒక్కడే ఓ వికెట్ సాధించాడు. మిగితా బౌలర్లందరూ చేతులేత్తాశారు. ఇక భారత్ తమ తదుపరి మాచ్‌ను మార్చి 1న సౌతాఫ్రికాతో తలపడనుంది.

## టెన్నిస్ టోర్నీలో.. పోరాడి ఓడిన భారత్

### తొలి రౌండ్‌లోనే మానస్, కరణ్, రామ్‌కుమార్ ఔట్



**న్యూఢిల్లీ:** బెంగుళూరు ఏటీపీ టెన్నిస్ టోర్నీలో భారత్ ప్లేయర్లు వైఫల్యం చెందారు. భారత్ ప్లేయర్లు రష్యా, ఆస్ట్రియా, జపాన్‌కు చెందిన ప్లేయర్ల చేతిలో పరాజయం చెందారు. వైల్డ్ కార్డుతో బరిలోకి దిగిన మానస్ ధామ్నె, రామ్‌కుమార్ రామ నాథన్, క్వాలి ఫయర్ హోదాలో అడుగు పెట్టిన కరణ్ సింగ్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రా తొలి రౌండ్ మ్యాచ్‌లో మానస్ ధామ్నె 3-6, 6-3, 6-7 (3/7)తో రష్యాకు చెందిన పీటర్ బార్ బిర్యుకోవ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. అలాగే భారత్ మరో ప్లేయర్ కరణ్ సింగ్ 4-6, 6-4, 6-7 (3/7)తో ఆస్ట్రియాకు చెందిన జురిజ్ రొడియోనోవ్ చేతిలో పరాజయం చెందాడు. ఇక రామ్‌కుమార్ రామనాథన్ సైతం 6-7 (3/7), 5-7తో జపాన్‌కు చెందిన షింటారో మొచిజుకి చేతిలో పోరాడి ఓడిపోయాడు. అలాగే రొడియోనోవ్‌తో 1 గంట 57 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కరణ్ 11 ఏస్‌లుసంధించి, 2 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నిర్ణాయక టైబ్రేక్‌లో కరణ్ ఒత్తిడికి లోను కావడంతో అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. అదేవిధంగా షింటారోతో 1 గంట 48 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో రామ్ 14 ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు.

## విజయంతో ముగించిన భారత్ జట్లు

### అంతర్జాతీయ హాకీ లీగ్‌లో ప్రపంచ నంబర్ 1పై మహిళల సంచలన హ్యాట్రిక్



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రోలీగ్ అంచె పోటీలను భారత మహిళల, పురుషుల జట్లు విజయంతో ముగించాయి. భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె సారథ్యంలోని భారత మహిళల జట్టు షూటౌట్‌లో 2-1గోల్స్ తేడాతో ప్రస్తుతప్రపంచ చాంపియన్, ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ నంబర్వన్ నెదర్లాండ్స్ జట్టును చిత్తుగా ఓడించి హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. అలాగే హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలోని భారత పురుషుల జట్టు 2-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్ జట్టుపై గెలిచింది. ఇక నెదర్లాండ్స్ మహిళల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 2క్వార్టర్లు ముగిసే సరికి భారత జట్టు 0-2 తో వెనుకబడింది. ఆ తర్వాత 8నిమిషాల వ్యవధిలో టీమిండియా రెండు గోల్స్ చేసి స్కోరును 2-2తో సమంచేసింది. భారత్ తరఫున దీపిక (35వ నిమిషంలో), బల్జీత్ కౌర్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు పియెన్ సాండర్స్ (17వ నిమిషంలో), వాన్డెర్ ఫే (28వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ నిర్వహించారు. ఈ షూటౌట్‌లో భారత గోల్‌కీపర్ సవితా పూనియా అడ్డుగోడలా నిలబడి నలుగురు నెదర్లాండ్స్ క్రీడాకారిణుల షాట్లను నిలువరించింది. భారత్ తరఫున దీపిక, ముంతాజ్ సఫల మవ్వగా, బ్యూటీ డుంగ్డుంగ్, బల్జీత్ కౌర్ విఫలమయ్యారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ విక్టరీ

### మహిళల ప్రీమియర్ లీగ్‌లో 6 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్ ఓటమి

### అదరగొట్టిన షఫాలీ, జోనాసెన్

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ నిలకడైన విజయాలతో దూసుకెళ్తోంది. బెంగుళూరులో జరిగిన పోరులో ఆల్రౌండ్ ప్రదర్శనతో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. భారతి ఫుల్మాలి (29 బంతుల్లో 40 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సు) జట్టును ఆదుకుంది. డాటిన్ (24 బంతుల్లో 26; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. మరిజాన్ కాప్, శిఖా పాండే, అనాబెల్ సదర్లాండ్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ 15.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసిగెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ జెస్ జొనాసెన్ (32 బంతుల్లో 61నాటౌట్; 9ఫోర్లు, 2 సిక్సు), షఫాలీ వర్మ (27 బంతుల్లో 44; 5 ఫోర్లు,3సిక్సులు) చెలరేగారు. మొదట బ్యాటింగ్‌కు దిగినగుజరాత్ బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు. నాలుగో ఓవర్లో హర్లీన్ (5), లిచ్‌ఫీల్డ్ (0)లను ఔట్ చేసిన మరిజాన్ కాప్ దెబ్బ తీసింది. మరుసటి ఓవర్లో శిఖాపాండే వరుస బంతుల్లో బెథ్ మూని(10), కాశ్వీ గౌతమ్ (0)లను ఔట్ చేయడంతో 20 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయింది. కాసేపటికి కెప్టెన్ ఆష్లీ గార్డనర్ (3), డియాంద్ర డాటిన్‌లు స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో 60/6వద్ద గుజరాత్ కుదేలైంది. ఈదశలో లోయర్‌ఆర్డర్ బ్యాటర్ భారతి, తనూజ (16)7వ వికెట్‌కు 51 పరుగులు జోడించడంతో స్కోరు100దాటింది. సులువైనలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఢిల్లీ ఆరంభంలోనే కెప్టెన్ మెగ్లానింగ్ (3) వికెట్‌ను కోల్పోయింది. షఫాలీ జోరుకు గార్డనర్ అడ్డుకట్ట వేయగా, జెమీమా (5),అనాబెల్(1) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించినా, 26 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న జొనాసెన్ మిగతా లాంఛనాన్ని చకచకా పూర్తిచేసింది.





# టాప్ 10 బిలియనీర్ మహిళలు వీరే!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఒకప్పుడు మహిళలు వంటగదికే పరిమితమయ్యేవారు, కానీ కాలం మారుతున్న కొద్దీ మహిళలు అన్ని రంగాలలో ప్రత్యే కతను చాటుకుంటున్నారు. అలాగే విజయం కూడా సాధిస్తున్నారు. సిటీ ఇండెక్స్ అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మహిళా బిలియనీర్లు ఉన్న ఐదవ దేశం భారతదేశం. స్వయంనిర్మిత బిలియనీర్లలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలో ఉంది. జనవరి 2025 ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల లిస్ట్ ప్రకారం, భారతదేశంలోని టాప్ 10 ధనవంతులైన మహిళలు విభిన్న నేపథ్యాలు ఇంకా పరిశ్రమలలో ముందు న్నారు. వైద్యం, సాంకేతికత, రిటైల్ ఇంకా ఇంజినీరింగ్ వంటి రంగాలలో మహిళలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారత దేశంలోని అత్యంత ధనవంతులైన మహిళల లిస్టులో సావిత్రి జిందాల్ అగ్రస్థానంలో ఉన్నారు. ఆమె నికర విలువ 34.3 బిలియన్ డాలర్లు. 2005లో ఆమె భర్త మరణించిన తర్వాత ఆమె ఓపి జిందాల్ గ్రూప్‌ను వారసత్వంగా పొందింది. ఝున్‌ఝున్‌వాలా నికర విలువ 8 బిలియన్ డాలర్లు. ఆమె రెండవ స్థానం లో ఉన్నారు. ఆమె సంపద 2022లో ఆమె దివంగత భర్త రాకేష్ ఝున్ ఝున్ వాలా విస్తృతమైన పోర్ట్‌ఫోలియో నుండి వచ్చింది. రేణుక జగ్తియాని రేణుకా జగ్తియాని 5.6 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో ఉన్నారు. యుఎఇకి చెందిన ల్యాండ్‌మార్క్ గ్రూప్ ఛైర్మన్ అండ్ సిఇఒ, ఆమె రిటైల్ అండ్ హాస్పిటాలిటీ వ్యాపారాలను ప్రపంచవ్యాప్తం గా కొత్త మార్కెట్లకు విస్తరించింది. వినోద్ గుప్తా వినోద్ గుప్తా నికర విలువ 4.7 బిలియన్ డాలర్లు. అతను తన కుమారుడు అనిల్ రాయ్ గుప్తాతో కలిసి హావెల్స్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. ఈ కంపెనీ 50కి పైగా దేశాలలో కార్యకలా పాలు నిర్వహిస్తుంది. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తు లను అందిస్తుంది. గోద్రేజ్ కుటుంబంలో భాగం గా స్మితా కృష్ణగోద్రేజ్ నికర విలువ 3.5 బిలియన్ డాలర్లు. గోద్రేజ్ గ్రూప్‌లో 20శాతం వాటా కూడా ఉంది. కిరణ్ మజుందార్ షా ఈమె 1978లో బయోకాన్‌ను స్థాపించారు, ఆమె నికర విలువ 3.4 బిలియన్ డాలర్లు. ఆమె నాయకత్వం బయో కాన్‌ను ఫార్మా స్యూటికల్ పరిశ్రమలో ప్రపంచ లీడర్గా చేసింది. రాధా వెంబు రాధా వెంబు 3.2 బిలియన్ డాలర్లు నికర విలువతో జోహో కార్పొరేషన్‌ను స్థాపించారు.

## బంగారం కొనుగోళ్లలో కొత్త ట్రెండ్..



**ముంబై, ఫిబ్రవరి 26:** భారతదేశంలో బంగారు ఆభరణాలకు డిమాండ్ గత మూడేళ్లుగా క్రమంగా తగ్గుతోంది. 2021లో 610 టన్నుల బంగారం కొనుగోలు జరిగింది. ఇది 2022లో 600 టన్నులకు, 2023లో 575టన్నులకు, ఇప్పుడు 2024లో 563 టన్నులకు పడిపోయిందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే 2022తో పోలిస్తే రికార్డు స్థాయిలో 7శాతం తగ్గుదలను గమ నించవచ్చు. దీనికి అతిపెద్ద కారణం బంగారం ధరలో భారీ పెరుగుదల. 2024లో బంగారం ధర 15శాతం పెరిగింది. దీని వలన సామాన్యులకు నగలు కొనడం అనేది ఖరీదైనదిగా మారింది. అలాగే, మొత్తం ధరలో 10-25శాతం వరకు మేకింగ్ ఛార్జీలు తారెత్తిస్తున్నాయి. ఇవి కూడా జనా లు వీటిపై అనాసక్తి చూపడానికి ప్రధాన కారకంగా మారుతున్నాయి. అదనంగా, కొత్త తరం ఇప్పుడు బంగారాన్ని కుటుంబ వారసత్వ సంపదగా కాకుండా పెట్టుబడి కోణం నుండి మాత్రమే చూడటం ప్రారం భించింది. బంగారం కొనుగోలు బలహీనపడుతోంది. బంగారు కడ్డీలు, కాయిన్‌లకు డిమాండ్ పెద్దగా హెచ్చుతగ్గులకు గురి కాలేదు. కానీ బంగారు ఇటిఎఫ్‌లతో పోలిస్తే అవి బలహీనపడుతున్నాయి. 2021లో 186 టన్నుల బంగారు కడ్డీలు, కాయిన్ల కొనుగోలుజరిగింది. ఇది 2022 నాటికి 173 టన్ను లకు తగ్గింది. అయితే, 2023లో అది 185 టన్ను లకు పెరిగింది. 2024లో అది 239 టన్నులకు చేరు కుంది. అయితే, ఇది స్వల్పకాలిక ధోరణి అని నిపుణులు భావిస్తున్నారు. దీనికి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా కారణమవుతున్నాయి. మొత్తానికి బంగారం ధరలు పెరుగుతున్నాయి. బంగారంతో పోలిస్తే బంగారు ఇటిఎఫ్‌లు కొనడానికి, అమ్మడానికి సులభంగా, సౌకర్యవంతంగా ఉండటం వల్ల కూడా ఈపెరుగుదల నమోదయ్యి ఉండవచ్చు.

## వారానికి 47 గంటల పని చాలు: క్యాప్ జెమిని

**ముంబై, ఫిబ్రవరి 26:** చాలా కాలంగా దేశంలోని కార్పొరేట్ ప్రపంచంలో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అనే అంశంపై పెద్ద చర్చ కొనసాగుతోంది. ప్రధానంగా ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణమూర్తి వారానికి 70 గంటలు పనిచేయాలని సూచించటం, తర్వాత ఎల్ అండ్ టి ఛైర్మన్ 90 గంటలు పనిచేయాలనటంతో దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ కొనసాగిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీల ఉన్నత స్థాయి సిబ్బంది లేదా వ్యక్తులు ఎక్కువ గంటల పాటు పని గురించి కామెంట్స్ చేస్తున్న సమయంలో క్యాప్ జెమినీ సీఈవో అశ్విన్ యార్డి దీనిపై స్పందించారు. వారానికి నలభైఏడున్నర గంటల పాటు వర్క్ సరిపోతుం దని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఉద్యోగులకు వారాంతంలో కంపెనీలు పనికి సంబంధించిన ఎలాంటి వర్క్ ఇ-మెయిల్స్ కూడా పంపకూడదని అభిప్రాయ పడ్డారు. తాము రోజుకు తొమ్మిది గంటల చొప్పున వారానికి ఐదు రోజులు మాత్రమే పనిని కలిగి ఉన్నట్లు నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్షిప్ ఫోరమ్ సమావేశంలో పేర్కొన్నారు. వాస్తవా నికి ఉద్యోగులు ఎన్ని గంటలు పనిచేయటం ఉత్తమంగా అడిగిన ప్రశ్నకు ఇలా బదులిచ్చారు. ఉద్యోగులకు వారాంతంలో సెలవు ఉన్నప్పుడు పనికి సంబంధించిన మెయిల్స్ పంపటాన్ని పూర్తిగా నిలిపివేయాలని అన్నారు. అయితే ఇదే పద్ధతిని తాను దాదాపు 4 ఏళ్లుగా ఫాలో అవుతున్నానని పేర్కొన్నారు. తాను గడచిన నాలుగేళ్లుగా వారాంతం సెలవు సమయంలో ఆఫీసు నుంచి ఉద్యోగులకు పనికి సంబంధించిన మెయిల్స్ పంపకూడదనే పాలసీని పెట్టుకుని దానిని విధిగా పాటిస్తున్నానని స్పష్టం చేశారు. ఎస్కలేషన్ మెయిల్ వచ్చినప్పటికీ దానిని వారాంతంలో పరిష్కరించలేనప్పుడు ఉద్యోగికి పంపించటంలో ఎలాంటి అర్థం లేదని ఆయన అన్నారు. అయితే తాను అప్పుడప్పుడు వారాం తంలో పని చేస్తానని, కానీ ఇది తన ఉద్యోగు లకు తప్పనిసరిగా వర్తించదని సీఈవో యార్డి అన్నారు. అనవసరమైన ఒత్తిడిని నివారించడానికి తాను వారికి ఇ-మెయిల్ పంపకూడదని ప్రయ త్నించానని, వారాంతంలో పని చేయలేమని తెలిసిన ఉద్యోగికి "దుఃఖం" ఇవ్వడంలో అర్థంలేదని పేర్కొన్నారు. ఐటీఉద్యోగుల జనాభా వివరా లను దృష్టిలో ఉంచుకుని సంస్థలు యువ ఉద్యోగుల అంచనాలకు అనుగుణంగా మారడం చాలా ముఖ్యం అని యార్డి అన్నారు. క్యాప్‌జెమినీ త్రైమాసిక ప్రమోషన్స్, ఆరు వారాల ఉద్యోగుల సర్వేలు, ఉద్యోగుల కెరీర్ మార్గాలను రూపొందిస్తోందని పేర్కొన్నారు.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.